ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
21-5-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 109 పేజీలు: 10+4 వెల: 6.50

గాజాలో మారణహోమం: 60 మంది పైగా మృతి

వక్ఫ్ సవరణ చట్టంపై 3 అంశాలపైనే విచారణ

5

# ఇక కాళేశ్వరం 'పెద్దల' విచారణ!



జూన్ 5న హాజరు కావాలని కెసిఆర్‌కు పిలుపు

## జూన్ 6న హరీష్, 9న ఈటల రావాలని సమన్లు పంపిన జస్టిస్ ఘోష్



### పలువురు ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు సహా 267 మంది విచారణ పూర్తి

### మాజీ సిఎం, మాజీ మంత్రులు విచారణకు వస్తారా? అనే ప్రశ్నపై అనుమానాలు

**హైదరబాద్,మే 20,ప్రభాతవార్త:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, స్వయం ప్రకటిత కాళేశ్వరం నిర్మాత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు మేడిగడ్డ కుంగుబాటు, అవినీతిపై విచారణ జరుపుతున్న పినాకి చంద్రఘోష్ మంగళవారం నోటిసులు జారీచేసింది. మేడిగడ్డ కుంగు బాటు, అన్నారం,సుందిళ్ళ బ్యారేజీలో బుంగలు పడటంపై 15 రోజుల్లో అఫిడవిట్ల రూపంలో వాగ్మూలం నివేదించడంతోపాటు జూన్ 5న మాజీ ముఖ్యమంత్రికెసిఆర్ జ్యుడిషియల్ కమీషన్ ముందు హాజరుకావాలని పిసిఘోష్ నోటిసులో పేర్కొంది. కెసిఆర్‌తో పాటు 2018 వరకు నీటిపారుదలశాఖ మంత్రిగా వ్యవహారించిన హరీష్‌రావు,ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్‌ను కూడా విచారణ కమిటికి అఫిడవిట్లు రూపంలో వాగ్మూలం అందజేయడంతోపాటు విచారణకు హాజరుకావాలని విచారణ కమిషన్ నోటిసులు జారీ చేసింది. నీటిపారుదలశాఖ, ఆర్థిక మంత్రిగా పదేళ్ళు కీలక స్థానంలో ఉన్న హరీష్‌రావును జూన్ 6, నాలుగున్నరేళ్ళు ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన ఈటెల రాజేందర్‌ను జూన్ 9న హాజరుకావాలని నోటిసులో పేర్కొన్నారు. 2024 మార్చి 14న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట వైఫ్యలం,అవినీతి విచారణకు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పిసిఘోష్ కమీషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నిర్మాణం,నిర్వహణ, డిజైన్,క్వాల్టీకంట్రోల్, పేఅండ్ అకౌంట్స్ ఆర్థికశాఖ ఇంజనీరు ఉన్నతాధికారులు,

>>2

# హోదా మరచి.. కాళ్మొక్కడమా?

### ఐఎఎస్ శరత్ వ్యవహార శైలిపై సిఎం రేవంత్ ఆగ్రహం



### అఖిల భారత సర్వీస్ అధికారులు నిబంధనలు మీరితే చర్యలు తప్పవు

### సిఎస్ రామకృష్ణరావు హెచ్చరిక



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే20:** సోమవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా ఐఎఎస్ అధికారి శరత్ అత్యుత్సాహం ప్రదర్శించారు. సభలో పాల్గొనడానికి వచ్చిన సిఎం రేవంత్ కాళ్లు మొక్కారు. దీంతో ఐఎఎస్ శరత్ వ్యవహారశైలిపై సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి కాళ్లు ఐఎఎస్ శరత్ మొక్కడంపై ఆల్ ఇండియా సర్వీసెస్ అధికార వర్గాల్లో చర్చ జరిగింది. ఈ ఘటనపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సీరియస్ అయ్యారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవంటూ

>>2

# ఫ్యూచర్ సిటీలో భూగర్భ విద్యుత్

### క్షేత్రస్థాయిలో పరిశీలనకు బెంగళూరు వెళ్లిన డి.సిఎం భట్టి



### పలు విద్యుత్ కంపెనీలతో చర్చలు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** బెంగళూరులో అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరాను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పరిశీలించారు. మొదట కర్ణాటక పవర్ ట్రాన్స్మిషన్ కార్పొరేషన్, బెంగళూరు ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ అధికారులతో కలిసి మంగళవారం అండర్ గ్రౌండ్ కరెంటు సప్లై ప్రాజెక్టుపై చర్చలు జరిపారు. తదుపరి క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టు పనితీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బ్యాంకు రుణాలు, సాంకేతిక సమస్యలు,నష్టాలు, లాభాలు, ప్రమాదాలు తదితర అంశాలపై సమాచారాన్ని సేకరించారు. హైదరాబాదులో కొత్తగా నిర్మించబోతున్న ఫ్యూచర్ సిటీవంటి ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ కరెంటు వ్యవస్థ ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థల నమ్మకము, భద్రత, ఆకర్షణీయత మెరుగుపరిచే దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో ఇది ఒక భాగమన్నారు. ఈ సందర్భంగా అధికారు భేటీలో ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఆర్థిక నిర్మాణం, ఆసియా అభివృద్ధి బ్యాంక్, గ్రామీణ విద్యుదీకరణ సంస్థ తదితర బ్యాంకుల నుండి రుణాలు, టెక్నికల్ లాసెస్, విద్యుత్ ప్రమాదాల్లో తగ్గుదల, మౌళిక వసతులు, రింగ్ మైన్ యూనిట్లు తదితర వాటిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత

>>2



# విస్తరిస్తున్న రుతు పవనాలు

### పలు జిల్లాలకు వర్ష సూచన

**హైదరాబాద్, మే 20, ప్రభాత వార్త:** అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో దక్షిణాది రాష్ట్రాలతో పాటు దేశంలో అనేక రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఐఎండీ హెచ్చరించింది. కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ సహ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. రాత్రి కర్ణాటకలో తుఫాను తీరం దాటే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. అయితే ఈ నెల 23 వరకు కొనసాగనున్న అల్పపీడన ప్రభావం ఉండనుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో రాబోయే నాలుగు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. రెండుమూడు రోజుల్లో దక్షిణ అరేబియా, మాల్దీవులు,

>>2

### అణు ఇంధన కమిషన్ మాజీ చైర్మన్ కన్నుమూత

5

# భూభారతి దేశానికే రోల్ మోడల్

### జూన్ 2 నుండి ప్రతి రెవెన్యూ గ్రామానికి ప్రత్యేక అధికారి

### రాష్ట్రంలో 20 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం

### మంత్రులు పొంగులేటి, పొన్నం వెల్లడి




కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రి పొన్నం తదితరులు

**కరీంనగర్,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక భూభారతి చట్టం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లాలోని భూభారతి పైలట్ మండలం సైదాపూర్‌లోని ఘనపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం అవగాహనా సదస్సుకు మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి కొత్త రెవెన్యూ చట్టం అమల్లో భాగంగా సైదాపూర్ మండలాన్ని పైలట్‌గా ఎంపిక చేసామన్నారు. ఇప్పటివరకు ఈ మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా 1600 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. న్యాయపరమైన సమస్యలన్నీ భూభారతి ద్వారా అధికారులు తప్పక త్వరలోనే పరిష్కరిస్తారని వివరించారు. 2020లో ధరణి చట్టం తెచ్చినప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల 20 వేల పైచిలుకు భూ సమస్యలు ఉండేవని తెలిపారు. చట్టంలో ఎలాంటి నిబంధనలూ లేకపోవడం వల్ల ఎక్కడి సమస్యలు అక్కడే ఉండేవని తెలిపారు. ధరణిలో చిన్నచిన్న పొరపాట్లను కూడా సవరించే అవకాశం లేకపోయిందన్నారు. ఎంతోమంది రైతులు న్యాయస్థానాల చుట్టూ తిరిగి అలిసిపోయారని అన్నారు. భూభారతి చట్టం ద్వారా తహసీల్దార్ స్థాయి నుండి సీసీఎల్ఏ వరకు పరిష్కారం లభించేలా నిబంధనలు పొందుపరిచామని వివరించారు. భూభారతిలో భాగంగా భూమి రిజిస్ట్రేషన్ చేసే సందర్భంలోనే సర్వే చేయించి ఆ మ్యాప్‌నుపాస్ పుస్తకాలలో అప్లోడ్ చేస్తామని వివరించారు. ఈ మ్యాప్ వల్ల భావి తరాలకు ఇబ్బందులు ఉండబోవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 6000 మంది సర్వేయర్లకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తున్నామని అన్నారు. మండలానికి ఆరు నుండి 8 మంది సర్వేయర్లు పనిచేయమన్నారని తెలిపారు. ఈనెల 27 నుండి సర్వేయర్లకు శిక్షణ ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో 256 మంది సర్వేయర్లు ఉండగా వారి సంఖ్యను మొదటి విడతలో 1000కి పెంచుతున్నామని తెలిపారు. జూన్ 2 నుండి ప్రతి రెవిన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి చొప్పున 10956 గ్రామాల్లో రెవిన్యూ అధికారులు విధులు నిర్వహించనున్నారని తెలిపారు. భూభారతి చట్టం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు సరిహద్దు పంచాయతీలు కొలిక్కి వస్తాయన్నారు. ప్రతి భూమికి భూధార్ నెంబర్ వస్తుందని తెలిపారు. జూన్ 2 నుండి తహసీల్దార్ స్థాయి అధికారులు ప్రతి గ్రామానికి వస్తారని, భూ

>>2



# ఆగి ఉన్న లారీని ఢీకొన్న పెళ్లి బస్సు

ప్రమాదానికి గురైన బస్సు

### పరిగి రంగాపూర్ సమీపంలో ఘోర ప్రమాదం

### నలుగురు మృతి,20 మందికి పైగా తీవ్ర గాయాలు

**పరిగి మే 20 ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా, పరిగి మండలం రంగాపూర్ సమీపంలో జాతీయ రహదారి 163 పై సోమవారం అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితం వివాహం జరుపుకుని సోమవారం రాత్రి పరిగిలో విందు ఉండడంతో, అబ్బాయి తరపు బంధువులు విందుకు హాజరై, తిరిగివారి స్వగ్రామం అయిన రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలం, చందనవెల్లి గ్రామానికి

>>2

# 'సిందూర్' నిజాలు వెల్లడి చేస్తాం

### ప్రపంచదేశాలకు మన దౌత్యబృందాలు.. 23 నుంచి పర్యటనలు

**న్యూఢిల్లీ, మే 20:** ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై తమ ఐక్య వైఖరిని ప్రపంచ దేశాలకు స్పష్టంగా తెలియజేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా, మే 23 నుంచి 25 కీలక దేశాలకు అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధి బృందాలను పంపేందుకు సిద్ధమైంది. ఈ పది రోజుల పర్యటన ద్వారా, ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడమే కాకుండా, జాతీయ భద్రత పట్ల భారత్ నిబద్ధతను అంతర్జాతీయ వేదికలపై చాటిచెప్పనుంది. ఈ పర్యటన కోసం మొత్తం 25 దేశాలను ఎంపిక చేశారు. వీటిలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సభ్యులుగా ఉన్న 15 దేశాలు, త్వరలో సభ్యత్వం పొందనున్న ఐదు దేశాలు, అలాగే అంతర్జాతీయంగా పలుకుబడి కలిగిన మరో ఐదు దేశాలు ఉన్నాయి. భద్రతా మండలి సభ్య దేశాలన్నింటితోపాటు త్వరలో సభ్యత్వం పొందబోయే దేశాలు, అంతర్జాతీయంగా కీలక పాత్ర పోషించే మరికొన్ని దేశాలకు సైతం ఈ ఎంపిలు వెళుతున్నారు. మొత్తం 25కు పైగా దేశాలకు ప్రతినిధులు వెళుతున్నారు అని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన 51 మంది రాజకీయ నాయకులు, పార్లమెంటేరియన్లు, మాజీ మంత్రులతో పాటు ఎనిమిది మంది మాజీ రాయబారులు ఈ ప్రతినిధి బృందాలలో సభ్యులుగా ఉన్నారు. సీనియర్ ఎంపీలు శశి థరూర్, రవిశంకర్ ప్రసాద్, సంజయ్ కుమార్ ఝా, బైజయంత్ పండా, కనిమొళి కరుణానిధి, సుప్రియా సూలే, శ్రీకాంత్ ఏక్నాథ్ షిండే వంటివారు ఏడు బృందాలకు నాయకత్వం వహించనున్నారు.



# పోలీసు శాఖలో ఏసిబి దడ

### 4 నెలల్లో 14 మంది అరెస్టు

### నిజాయితీపరులుగా పేరున్న వారే లంచాలు మేస్తున్న వైనం!

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో అవినీతి నిరోధక శాఖ దడ పుట్టిస్తోంది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా నాలుగు నెలల వ్యవ ధిలో 14 మంది అధికారులు ఎసిబికి లంచాలతో దొరికిపోయారు. ఎసిబికి పట్టుబడ్డ వారిలో హోంగార్డు నుంచి డిఎస్‌పి వరకు వుండడం గమనార్హం. ఎసిబి చ రిత్రలో తొలిసారిగా లంచాలు తీసుకునేందుకు అంగీకరించిన నేరంపై సూర్యాపేట డిఎస్‌పితో పాటు సూర్యాపేట్ పట్టణ ఇన్‌స్పెక్టర్ అరెస్టవడం పోలీసు శాఖను షాక్‌కు గురిచేసింది. శాంతి భద్రతల పరిరక్షణలో కీలకంగా వుండాల్సిన పోలీసుల్లో కొందరు పక్కదారి పడుతుండడంపై సర్కారు విమర్శల పాలవుతుండడం తెలిసిందే. క్షేత్రస్థాయిలో ప్రజల బాగోగులు చూస్తూ ప్రభుత్వానికి అండ దండగా వుండాల్సిన పోలీసులు లంచాలకు మరిగి సర్కారుకు చెడ్డపేరు తెస్తుండడంతో ఎసిబి కొరడా ఝుళిపి స్తోంది. ప్రభుత్వ విభాగాలలో అక్రమాలకు పాల్పడుతున్న వారిలో పోలీసుల సంఖ్య ఇటీవల కాలంలో అనూహ్యంగా పెరగడం పోలీసు శాఖను సైతం ఆందోళ నకు గురిచేస్తోంది. నిజాయితీపరులుగా పేరుండడంతో పాటు ఉన్నతా ధికారులు, ప్రభుత్వ పెద్దల నుంచి శహబాష్ అనిపించుకున్న వారు సైతం లక్షల రూపా యల లంచాలతో పట్టుబడడం సంచలనం రేపుతోంది, భూ వివాదాలలో తల దూరుస్తుండడం, ఇసుక దందాలలో అక్రమార్కులతో చేతులు కలపడం, సివిల్ గొడవల్లో జోక్యం చేసుకోవడం, అక్రమాలు, గోల్‌మాల్ వ్యవహారాలపై ప్రభుత్వ విభాగాల నుంచి కచ్చితమైన ఫిర్యాదులు వున్నా నాంకే వాస్తేగా స్పందించి నిం దితులను అరెస్టు చేయక పోవడం వంటివి పోలీసు శాఖలో బాగా పెరిగిపోయాయి. న్యాయం కోసం పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితులకు అండగా వుండాల్సిం ది పోయి, అన్యాయం చేస్తున్న

>>2





కుట్టుమిషన్‌తో జీవనం సాగిస్తున్న సుగుణ, శోభ

# కూటికోసం కూలిపాట్లు!

### ఉద్యోగ విరమణ తర్వాత వీధిన పడుతున్న కాంట్రాక్టు కార్మికులు

### వృద్ధాప్యంలోనూ తప్పని కూలి పనులు

### 'మేడం' మర్యాద పోయి వంట పనివాళ్లుగా మారుతున్న మహిళలు

### పింఛన్ సౌకర్యం లేనందున తప్పని అగచాట్లు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** కాంట్రాక్టు ఉద్యోగులు పదవి విరమణ తరువాత రాత్రికిరాత్రి వీధిన పడుతున్నారు. పదవి విరమణ పొందిన ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులు విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో కూటి కోసం వృద్ధాప్యంలో కూడా కూలి పనులు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. గ్రూప్ -3 కేడర్ ఉద్యోగాలు చేస్తూ మేడం మేడం అంటూ మర్యాద పొందిన మహిళా ఉద్యోగులు పొట్ట కూటి కోసం కొంత మంది పాఠశాలలో మధ్యాహ్నభోజనం వంట చేసే గ్రూపులో చేరి పనిచేస్తున్నారు. మరికొంత మంది కుట్టుమిషన్ కుట్టుకుంటూ ఈ చరమ దశలో జీవితాన్ని కొనసాగిస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు కావడంతో వారికి పింఛను లభించకపోవడంతో ఏదోఒక పని చేసుకొని బతుకులు ఈడ్చుకుంటూ పోతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రపంచబ్యాంకు మెప్పుకోసం కాంట్రాక్టు వ్యవస్థను ఉద్యోగ నియమాకాల్లో చేపట్టారు. 1997లో తొలిసారి మహిళా శిశు సంక్షేమశాఖలో తొలిసారి

>>2



### కిక్కిరిసిపోయిన త్రివేణీ సంగమం

6



న్యూఢిల్లీలోని భారత్ మండపంలో మంగళవారం కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా 16వ వార్షికోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

## లారీని ఢీకొన్న పెళ్లి బస్సు

>> వెల్దండగా రంగాపూర్ సమీపంలో రోడ్డుపక్కన ఆగివున్న లారీని పెళ్లి బృందం తో వెళ్తున్న ఎస్.కె.హెచ్. ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది..బస్సులో సుమారు 60 మంది వరకు ఉండగా, నలుగురు బస్సులో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందారు.ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు వృద్ధులు ఉన్నారు. 17 మందికి తీవ్ర గాయాలు అయ్యాయని, మూడేళ్ల చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో నీలోఫర్ ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.బస్సులో ఇరుక్కుపోయిన మృతదేహాలను అతి కష్టంగా జేసీబీ సహాయంతో బయటకు తీశారు. స్థానికులు, పోలీసులు సహాయంతో క్షతగాత్రులను 108 సహాయంతో వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కొరకు మార్చురీకి తరలించారు.అనంతరం పోస్టుమార్టం పూర్తి అయిన మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. పెళ్లిబృందం మెత్రం రంగారెడ్డిజిల్లా షాబాద్ మండలం చందనవెళ్లి గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. మృతులు,బాలమ్మ,(60), హేమలత (30), మల్లేష్ (26), సందీప్ (28)గా పోలీసులు వెల్లడించారు. రోడ్డు ప్రమాదం జరగడంతో నేషనల్ హైవే 163పై ఇరువైపులా అటు హైదరాబాద్, ఇటు వరంగల్ బీజాపూర్ వైపు, కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. రెండు గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి.

**అతివేగమే ప్రమాదానికి కారణం : డీఎస్పీ శ్రీనివాస్**

సోమవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో, వరంగల్ లో విందుకు హాజరై వెళ్తున్న పెళ్లి బృందం బస్సు డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీ కొట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని వరంగల్ డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఘటనలో నలుగురు మృతి చెందినట్లు, మూడేళ్ల చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని, దాదాపు 20 మందికి పైగా తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు.పూర్తి విచారణ అనంతరం ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌పై, రోడ్డుపక్కన ఆపిన లారీ డ్రైవర్ పై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాద ఘటనాస్థలాన్ని వరంగల్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, వేముల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి, పలువురు నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ఫ్యూచర్ సిటీలో భూగర్భ విద్యుత్

>> మహేశ్వరంలో ఏర్పాటు చేసిన పైలట్ ప్రాజెక్టును సందర్శించారు. అక్కడ అండర్ గ్రౌండ్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌తో పాటు, అండర్‌గ్రౌండ్ ట్రాన్స్‌ఫార్మర్ వ్యవస్థను పరిశీలించారు. భద్రతా నిబంధనలు, లోడ్ బ్యాలెన్సింగ్ సాంకేతికతలు, అత్యవసర మరమ్మతుల కోసం తీసుకుంటున్న చర్యలను సమీక్షి ంచారు. తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి ఆధునిక విద్యుత్ వ్యవస్థను ఎక్కువగా విస్తృత ప్రాంతాల్లో ఇలాంటి ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక పవర్ ట్రాన్స్మిషన్ ఎండి పంకజ్ పాండే, బెంగళూరు ఎలక్ట్రిసిటీ సప్లై సంస్థ ఎండితో పాటు, తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండి కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండి ముషారఫ్ ఫారూఖీ తదితరులు పాల్గొన్నారు.

## హోదా మరచి.. కాళ్మొక్కడమా?

>> హెచ్చరించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం సివిల్ సర్వీసెస్,రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు సిఎస్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కొందరు ఐఏఎస్,ఐపీఎస్ స్థాయికి తగినట్లుగా ఉండకపోవడం ప్రభుత్వ దృష్టికి వచ్చింది. సభలు,సమావేశాల్లో ఉన్నతాధికారులు హుందాగా వ్యవహరించాలి. సభలు,సమావేశాల్లో హుందాగా ఉండకపోతే ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుంది. ప్రజలను కలిసినప్పుడు ఐఏఎస్,ఐపీఎస్‌లు ప్రొఫెషనలిజం ప్రదర్శించాలి. ప్రజాప్రతినిధుల పట్ల సివిల్ సర్వెంట్ రూల్స్‌కు విరుద్ధంగా వ్యవహరించొద్దు.ఇకపై ఏ అధికారి నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవు' అని సిఎస్ హెచ్చరించారు.గతంలో ఐఏఎస్‌ల ప్రజాప్రతినిధుల కాళ్ళు మొక్కడాన్ని ఇసిం రేవంత్‌రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. ఇకపై ఐఏఎస్‌లు,ప్రభుత్వ ఉన్నతాధికారులు ఎలా వ్యవహరించాలన్న దానిపై సిఎస్‌తో సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇప్పించారు. ఈ మేరకు ఇటీవల సమావేశాలు, సభల్లో ఫోటు చేసుకుంటున్న కొన్నిసంఘటనలు ఆవాంఛనీయమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాల్లో తగని విధంగా ప్రవర్తించటం సరికాదని సర్క్యులర్ జారీ చేశారు. ఇటీవలి కాలంలో కొంతమంది అఖిల భారత సర్వీసు అధికారులు సామాజిక సమావేశాలు, సభల్లో సర్వీసు హోదాకు తగనటువంటి చర్యలు, హావభావాలు ప్రదర్శిస్తున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ఇలాంటి ప్రవర్తన ప్రజల్లో ఆ సర్వీసు అధికారుల మీద నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తుంది. మరియు సేవ యొక్క మాన్యతను దెబ్బతీస్తుంది. అఖిల భారత సేవల ప్రవర్తనా నియమావళి, 1968 లోని నిబంధన 3(1) ప్రకారం: ప్రతీ సర్వీసులో సభ్యుడు ఎల్లప్పుడూ సంపూర్ణ నిజాయితీ, విధిపట్ల నిబద్ధత కలిగి ఉండాలి. సర్వీసులో ఉన్న అధికారికి తగని పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదు. అఖిల భారత సేవల అధికారులు, అధికారికంగా మరియు ప్రజలతో సంబంధాల విషయంలోనూ, ఉన్నతస్థాయి నైపుణ్యం, నిజాయితీ, నిబద్ధతను పాటించాల్సిన బాధ్యత కలిగి ఉన్నారు. ఇది ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు అవసరమైన చర్య. కాబట్టి, ఇకపై ఏ అఖిల భారత సర్వీసు అధికారులు అయినా, సామాజిక సమావేశాలు, సభల్లో తగనటువంటి విధంగా ప్రవర్తించడం, హావభావాలు ప్రదర్శించడం వంటి చర్యల నుంచి దూరంగా ఉండాలి. ఈ ఆదేశాలను ఉల్లంఘించినచో ఆ అధికారి తగిన చర్యలకు బాధ్యుడు అవుతారు. సచివాలయం కేంద్రంగా పనిచేసే అన్ని శాఖల సెక్రటరీలు, హెచ్‌ఓడీలు ఈ మేరకు చర్యలు తీసుకుని, తమ పరిధిలో పనిచేసే అధికారులు, ఉద్యోగుల ఈ ఆదేశాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సర్క్యులర్‌ను జారీచేసినట్టు తెలిపారు. సర్వీస్ హోదాకు తగని ఏది చేయొద్దంటూ ఐఏఎస్ అధికారులకు ఆయన సూచించారు. ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల అనుచిత ప్రవర్తన వల్ల ఐఏఎస్‌ల ప్రతిష్టను దెబ్బ తీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యల కారణంగా ఐఏఎస్ అధికారుల పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని తెలిపారు. సర్వీస్ హోదాకు తగని ఏది చేయొద్దంటూ ఐఏఎస్‌లకు ఆయన కాస్తా ఘాటుగా సూచించారు. మరోవైపు ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి.. ఐఏఎస్ అధికారులపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫీల్డ్‌లోకి వెళ్లకుండా.. ఏసీ గదులకే పరిమితమవుతున్నారంటూ ఐఏఎస్ అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి సునిశిత విమర్శలు చేసిన విషయం విదితమే. ఆ క్రమంలో గతంలో ఐఏఎస్ అధికారులు ఎలా ఉండేవారో.. పలువురు పేర్లను సైతం ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేసిన విషయం విదితమే.

## విస్తరిస్తున్న రుతు పవనాలు

>> కొమొరిన్ సహా బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలను విస్తరించనున్నాయి. దీంతో అంచనా వేసిన సమయానికంటే ముందుగానే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశమున్నట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు పూర్తిగా విస్తరించి ఉన్నాయి. జూన్ మొదటి వారంలోనే తెలంగాణలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. మరోవైపు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మరో 4 రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. దీంతో రాబోయే 3 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3–5 డిగ్రీల మేర తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 21, 22, 23 తేదీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మొత్తంగా నేటి నుంచి వరుసగా నాలుగు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు పడే అవకాశం ఉంది. కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. అయితే, కొన్నిచోట్ల భారీ వర్షాలుసైతం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రైతులు ఈ అకాల వర్షాలకు తమ పంటలను జాగ్రత్త చేసుకోవాలని అధికారులు సూచించారు. కాగా ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాం తాల్లో వర్షాలు కురుస్తున్నాయి. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. కాగా బుధవారం అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అంచనా వేసింది.

### వారం - వర్జ్యం

తేది : 21-05-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
నవమి రా.3.20
శతభిషం సా.6.53
వర్జ్యం రా.9.36-10.17
దు.ఉ.11.39-మ.12.31
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం** : కొత్తపనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో మీమాటకు విలువ పెరుగుతుంది.

**వృషభం** : గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు.

**మిథునం**: కుటుంబంలో వివాదాలు ఏర్పడిన పరిష్కరించుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి.

**కర్కాటకం**: ముఖ్యమైన పనులలో జాప్యం పెరిగినా నిదానంగా పూర్తిచేస్తారు. ఋణ బాధలు తప్పవు. అనారోగ్య సూచనలు.

**సింహం**: చిరకాల మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**కన్య** :ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. విందు, వినోదాలలో పాల్గొంటారు. వాహనయోగం.

**తుల** : వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**వృశ్చికం**: భాగస్వామ్య వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**ధనుస్సు**: కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం**: పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రయాణాలు.

**కుంభం**: ఆర్థికపరిస్థితి మెరుగు పడుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. దైవదర్శనాలు.

**మీనం** :కొత్త మిత్రుల పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. నూతన వస్త్రలాభాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కూటికోసం కూలిపాట్లు!

>> కాంట్రాక్టు వ్యవస్థను ప్రయోగాత్మకంగామొదలుపెట్టారు. విమెన్‌ఫైనాన్స్ కార్పొరేషన్‌లో ఎనిమిది మంది తెలుగుబాల మహిళా ప్రగతి ప్రాంగణం ఆఫీసర్లను నియమించారు. నెలకు ఆరువేల జీతంతో వారిని మూడేళ్ల కాలపరిమితితో తీసుకున్నారు. ఆతరువాత 1999లో 42 మంది సిడిపివోలు,ఎసిడిపివోలు,375 మంది గ్రేడ్‌వన్ సూపర్‌వైజర్లు,అంగన్‌వాడీలకు 658 మందికి పదోన్నతి కల్పించి వారిని కూడా కాంట్రాక్టు పద్ధతితో సూపర్‌వైజర్లుగా నియమించారు. మూడేళ్ల కాలపరిమితి తో తీసుకొని మూడేళ్ల తరువాత ప్రతి సంవత్సరం కాంట్రాక్టును రెన్యూవల్ చేస్తూ గత రెండు దశాబ్దాలుగా వారితో వెట్టి చాకిరి చేయించారు.ప్రారంభంలో సిడిపివోకు ఐదువేలరూపాయల జీతం, ఎసిడిపివోకు రూ.4500జీతం,గ్రేడ్ వన్ సూపర్‌వైజర్‌కు నాలుగు వేలజీతం అంగన్‌వాడీ నుంచి పదోన్నతి గ్రేడ్–2 సూపర్‌వైజర్‌గా నియమించబడిన 3వేల జీతం ఇచ్చారు.ప్రభుత్వ ఉద్యోగం కావడంతో ఏదో రోజు సర్వీసు క్రమబద్ధీకరణ జరుగుతోందని ఆశతో పనిచేశారు.రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నా వీరికి జీతం తక్కువగా ఉండేది. ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే ఏ భద్రత కూడా ఉండకపోయినా ఏదో మంచి జరుగుతోందని ఇన్నాళ్ళు పని చేశారు.ప్రభుత్వం కూడా వారి బాగోగులు పట్టించుకోకుండా పట్టిపోయిన పళ్ళవలె వదిలించుకున్నారు. ప్రస్తుతం వారి జీవితం కడుదుర్భరంగా ఉంది. అంగన్‌వాడీ కార్యకర్తగా 1987లో ప్రభుత్వ సేవలు చేసిన డి.శోభరాణి నిసూపర్‌వైజర్‌గా 2017లో రిటైర్డు అయ్యారు.ఆమె ప్రస్తుతం పింఛన్ రాకపోవడంతో కుటుంబపోషణ తోసుకుంటూ శేషజీవితాన్ని గడుపుతోన్నది. శోభరాణికి భర్త ఇరువై ఐదేళ్ల క్రితం చనిపోయారు. ఆమె ఆ కుటుంబంకు జీవనాధారం.ఒక కూతురు, కొడుకు ఆమెకు ఉన్నారు. బిడ్డ వివాహం కోసం చేసిన అప్పులు ఇంకా తీర్చాల్సిన బాధ్యత ఆమెపై ఉంది. కొడుకు ప్రైవేటు ఉద్యోగం చేస్తుండటంతో వారికి భారం కావొద్దని ఆమె కుటుంబపోషణ కష్టపడుతోంది. మహిళా శిశు సంక్షేమశాఖ కమిషనర్‌గా జనార్దన నాయుడు పనిచేసే రోజుల్లో ఎపిఎస్‌సిక్ బదులు స్త్రీశిశుసంక్షేమశాఖ నిర్వహించిన ఉద్యోగోన్నతి పరీక్షరాసి ఆమె గ్రూప్ 3 క్యాడర్‌లో ఉండే గ్రేడ్2 సూపర్‌వైజర్ ఉద్యోగంకు కాంట్రాక్టు పద్ధతిలో నియామకమైనారు. 2014లో వీరి ఉద్యోగం పర్మినెంట్ చేశారు. పర్మినెంట్ అయిన మూడేళ్లకు డి.శోభరాణి రిటైర్డు అయ్యారు. ఆమెకు పర్మినెంట్ అయినా ఆమె సిపిఎస్ కింద కాని, పాత పెన్షన్ స్కీమ్ కింద కూడా ఆమె రాలేదు. హుస్నాబాద్‌లో నివాసం ఉంటున్న కరుణ అనే సూపర్‌వైజర్ హుజూరాబాద్ ఐసిడిఎస్ ప్రాజెక్టులో పనిచేస్తూ ఐదేళ్ల క్రితం రిటైర్డు అయ్యారు. ఆమె రిటైర్డు అయ్యాక ఆమె పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తూ జీవిస్తున్నది.1989లో అంగన్‌వాడీ టీచర్‌గా ఎంపికై 2006లో కాంట్రాక్టు గ్రేడ్–2 సూపర్‌వైజర్‌గా పి.సుగుణ పదోన్నతి పొందారు. సూపర్‌వైజర్ కూడా 2016లో రిటైర్డు అయ్యారు. ఒక్కగానొక్క కూతురు వివాహం చేశారు. కుటుంబపోషణ ఆమెకు జీవనాధారం. ఆమె సోదరులు కూడా ఎంతో కొంత ఆర్థిక సహాయం చేస్తున్నా ఒకప్పుడు ఆర్థిక స్వతంత్రంతో జీవించిన ఆమె ఇప్పుడు ఇబ్బంది పడుతోన్నది.పరమేశ్వరి సూపర్‌వైజర్‌గా పదవి విరమణ పొందిన ఆమెకు ఆరోగ్య సమస్యలు తలెత్తాయి బిడ్డకు వివాహం చేసి ప్రస్తుతం ఆమె తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే 143 మంది కాంట్రాక్టు సూపర్‌వైజర్లు రిటైర్డు అయి పింఛన్ లేకుండా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ స్కీమ్‌లలో ఉద్యోగులు ఇరువై ఏళ్లు పనిచేసి జీవితం చివరి దశలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.30 ఏళ్లుగా సేవలు అందిస్తున్న వారికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాల్సి ఉంది. కానీ ఆ స్థాయిలో వేతనాలు ఇవ్వడం లేదు.30ఏళ్లు సర్వీసు ఉన్న వీరికి ఉద్యోగ బాధ్యతల నుంచి తప్పుకునేనాటికి ఎటువంటి ఆర్థిక సహాయం కానీ, పింఛన్ సదుపాయాలు కానీ ఇవ్వడం లేదు.

**కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా పింఛన్ ఇవ్వాలి: టిఎన్‌జిఓ రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యోగ ఐక్యకార్యాచరణ సంఘాల,జెఏసి చైర్మన్ మారం జగదీశ్వర్**

కాంట్రాక్టు ఉద్యోగులకు జీవనభద్రత కల్పించాలి. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ పేరుతో శ్రమదోపిడి చేయడం తగదు. కాంట్రాక్టు ఉద్యోగులను ఎప్పుడు రెగ్యులరైజేషన్ చేసినా, వారు విధుల్లో చేరి నాటి నుంచి సర్వీసు కౌంట్ చేయాలి. మానిటరీ బెనిఫిట్ ఇవ్వకపోయినా వారి సర్వీసు క్రమబద్ధీకరణ చేసి వారికి పదవి విరమణ లబ్ధి కలిగించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తాం. సిపిఎస్ పెన్షన్ విధానం కూడా ఉద్యోగులలో అభద్రత కల్పిస్తున్నది. పదవి విరమణ చేసిన వారికి ఏ లబ్ధికలిగించకుండా వదిలించుకోవద్దు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏస్థాయిలో పనిచేసినా వారికి రెగ్యులర్ ప్రాతిపదికన పనిచేసే ఆటెండర్ జీతం కంటే తక్కువ వేతనం పొందుతున్నారు.

# ఇక కాళేశ్వరం 'పెద్దల' విచారణ!

>> క్షేత్రస్థాయి అధికారులు, అఖిలభారతసర్వీసు అధికారులు సర్వీసులో ఉన్న పదవి విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులను నిర్మాణసంస్థల ప్రతినిధులను, విజిలెన్స్ రిపోర్టులను సుమారు 267 మందివరకు ఇప్పటివరకు జస్టిస్ పినిఘోష్ విచారణ చేశారు. విచారణ ఎదుర్కొన్న అధికారులు నిర్మాణ సంస్థల ప్రతినిధులు గత ముఖ్య మంత్రి,నీటిపారుదలశాఖ మంత్రి సూచనలమేరకు నిర్మాణ నిర్ణయాలు జరిగాయని ఆయన ఆదేశాలు అమలు చేశా మని వాగ్మూలం ఇచ్చారు. జస్టిస్ పినిఘోష్ ఆనధికార లను విచారణచేయకుండానే నివేదిక ఇస్తుందని తొలుత భావించినా,నిందారోపణలు ఎదుర్కొన్న గత పాలకులను విచారణ పరిధిలోకి తీసుకొని రాకుండా నివేదిక అందిస్తే అది పక్షపాతంగా ఉందని ప్రభుత్వం భావించి పినిఘోష్ కమిటీ గడువును మరో రెండు నెలలు పొడిగించింది. దీంతో జస్టిస్ పినిఘోష్ గత ప్రభుత్వంలో కీలకమైన ముగ్గురికి నోటీసులు ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి తోపాటు మాజీ మంత్రులు విచారణకు హాజరవుతారా లేదా అనే విషయంలో రాజకీయవర్గాలు ఆసక్తి నెలకొంది. విద్యుత్ కమీషన్ ముందు హాజరు కాకుండా ఎలాగైతే కోర్టుకు వెళ్లినారో ఇప్పుడు కూడా అదే తరహాలో మళ్లీ కోర్టులను ఆశ్రయిస్తారా అని అంతా ఆసక్తితో చూస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడంతో తెలంగాణలో నీటి ఎద్దడి మళ్లీ తలెత్తుతోన్నది. 2023 అక్టోబర్ 21 సాయంత్రం 6:15కు మేడిగడ్డ బ్యారేజి పెద్ద ప్రేలుడుశబ్దంతో ఏడవ బ్లాక్ లోని పియర్లు నెర్రెలువారి కుంగిపోయాయి. సమీప గ్రామాలకు కూడా ప్రేలుడు వినిపించిందని విధ్వంసకారుల కారణం కావొచ్చని మహదేవ్‌పూర్ పోలీసుస్టేషన్‌లో ఆనాటి ప్రభుత్వం చేసిన ఫిర్యాదు ఎఫ్ ఆర్ నమోదైనా దానిపై సమగ్ర విచారణ జరుగలేదని ఇటీవల తెలంగాణ వాటర్ రిసోర్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసి ప్రకాశ్ వివిధ సామాజిక మాధ్యమాల వేదికలపై ఇటీవల పెద్ద ఎత్తున వినిపిస్తున్నారు. తెలంగాణలో 2024 డిసెంబర్‌లో ఎన్నికైన పాలకులు కూడా కేవలం సాంకేతిక వైఫల్యంపై మాత్రమే విజిలెన్స్ ,ఎన్‌డిఎస్‌ఏ, జుడిషియల్ విచారణ చేపట్టారు కానీ ప్రేలుడు అభియోగం కోణం నిర్ధారణ చేసేందుకు ఏలాంటి ఫోరెన్సిక్ తనిఖీలు చేపట్టలేదు. టిఎసిటి, హెచ్‌ఎంఎస్,ఐఐటి వంటి ఉపయోగించిన టెక్నాలజీ నైట్రో గ్లిజరిన్ గ్రెయిన్ బ్లాస్ట్ వంటి ఆనవాళ్ళు అక్కడ ఏమైనా ఉన్నాయా అనే విషయంలో నిపుణుల అభిప్రాయం తెలుసుకోవాల్సి ఉందాల్సింది. మరోవైపు తుమ్మిడి హెట్టి నుంచి స్థల మార్పు బ్యారేజిల స్థల మార్పువిషయంలో జస్టిస్ అధికారులను ఇప్పటికే విచారణలో ప్రశ్నించారు. జూన్ ఐదు నుంచి జరిగే ప్రముఖుల విచారణలో స్థల మార్పుపై కూడా వారిని ప్రశ్నించే అవకాశం ఉంది. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు,హరీష్‌రావు,ఈటెల రాజేందర్ విచారణ ముందు హాజరైతే అక్కడ బ్యారేజి నిర్మాణం యోగ్యతలేదని విచారణ కమిషన్‌కు ఖరాఖండిగా చెప్పే అవకాశం ఉంది. తుమ్మిడిహట్టి సమీపంలో వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ఉందని బ్యారేజి ఎఫ్‌ఆర్‌ఎల్ 148 అడుగుల ఎత్తులో కడితే కేవలం 0.8 టిఎంసి నీటిని మాత్రమే నిలువచేసే అవకాశం ఉందని వివరించే అవకాశం ఉంది. అంతేకాదు బ్యారేజి నిర్మాణ వ్యయం కూడా రూ.3500కోట్లుపైగా ఉంటుందని వివరణ ఇచ్చే అవకాశం ఉంటుందని కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ సమర్థించేవారు కేసిఆర్,హరీశ్‌రావులు వివరిస్తారని ప్రచారం చేస్తున్నారు. అక్కడ ఆరు కిలోమీటర్ల పొడవుతో 110 గేట్లతో బ్యారేజి నిర్మాణం వక్రతల (స్యూవల్) ఆకృతి లో నిర్మించాల్సి ఉంటుందని విచారణకు వివరించే అవకాశం ఉంటుంది. నీటిని లంబకోణంలో ప్రతి గేటుకు తీసుకొని రావాల్సిన తీరులో గేట్లు జిగ్‌జాగ్‌గా నిర్మించాల్సి ఉంటుందని అక్కడ బ్యారేజి నిర్మాణం అసాధ్యమని అందుకే 2004 నుంచి 2009 వరకు కేంద్రంలో,మహారాష్ట్రలో,ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా తుమ్మడిహట్టి వద్ద బ్యారేజిని వక్రతలంగా నిర్మాణం చేయడం సాధ్యం కాదని మిన్నకుండి పోయారని వివరించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. కాంగ్రెస్ జలయజ్ఞంలో భాగమైన నెట్టెంపాడు నుంచి మొదలు కొని ఎస్సారెస్పీ వరద కాలువలను పూర్తిచేశామని ఒక వేళ 2007లోనే అక్కడ ప్రాజెక్టు నిర్మాణం మొదలు పెట్టి అసంపూర్తిగా ఉంటే దానినే నిర్మించేవారమని మహారాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించకపోతే స్థలం మార్పుచేశామని జస్టిస్ ముందు సమర్థించుకొనే అవకాశం ఉంటుందని కాళేశ్వరం సమర్థించే వారు భావ్యం చెబుతున్నారు. ఏది ఏమైనా నోటీసులు రావడంతో తెలంగాణలో రాజకీయ వేడి పుట్టింది. ఇంతకు బిఆర్ఎస్ నాయకులు కెసిఆర్,హరీష్‌రావులు బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ హాజరవుతారా లేదా అని చర్చ జోరుగా సాగుతోన్నది.



మంగళవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డితో భేటీ అయిన రష్యా కాన్సుల్ జనరల్ వలేరీ ఖోడ్జాయేవ్

## సిఎం రేవంత్‌ని కలిసిన రష్యా కాన్సుల్ జనరల్ వలేరీ ఖోడ్జాయేవ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే20:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌ని చెన్నైలోని రష్యా కాన్సుల్ జనరల్ వలేరీ ఖోడ్జాయేవ్ మంగళవారం మర్యాద పూర్వకంగాకలిశారు. జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భూభారతి దేశానికే రోల్ మోడల్

>> సమస్యల దరఖాస్తులు వారికి అందించాలని తెలిపారు. ఒక్క రూపాయి ఫీజు కూడా ఎవరికి చెల్లించాల్సిన పనిలేదని, శాశ్వతంగా సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. దరఖాస్తు కూడా ఉచితంగా ఇస్తారని తెలిపారు.నలుగురు వ్యక్తుల నాలుగు గోడల మధ్య తయారుచేసిన ధరణి చట్టం వల్ల అనేక సమస్యలు వచ్చాయని అన్నారు. 18 రాష్ట్రాల్లో ఆర్ వోఆర్ చట్టాలను అధ్యయనం చేసి ప్రజా ప్రభుత్వం భూభారతి చట్టం రూపొందించామని, నియమ నిబంధనలు పొందుపరిచామన్నారు. ధరణి చట్టం దేశానికి రోల్ మోడల్ గా నిలుస్తోందని వివరించారు. ఈ చట్టంలో అప్పీలుకు అవకాశం ఉన్నందున అధికారి న్యాయం చేయలేదని భావిస్తే పై స్థాయి అధికారులకు, సీసీఎల్ఏ కి అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి సమస్యకు ఈ చట్టంలో అవకాశం ఉందని, కోర్టుల చుట్టూ తిరగాల్సిన పనిలేదని తెలిపారు. ప్రతి పేదవారికి గూడు ఉండాలన్న ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టామని, మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేశామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 80 వేల ఇండ్ల నిర్మాణం ప్రారంభమయ్యాయని తెలిపారు. 20 లక్షల ఇండ్లు కట్టాలనేది ప్రభుత్వ లక్ష్యమని, విడతల వారీగా ఈ లక్ష్యాన్ని నెరవేరుస్తామని అన్నారు. అప్పుల భారం ఉన్నా ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రేషన్ ద్వారా సన్న బియ్యం, సన్నవడ్లకు బోనస్, ఇందిరమ్మ ఇల్లు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 500 కే గ్యాస్ సిలిండర్, రాజీవ్ యువ వికాసం, ఇందిరా గిరిజల వికాసం వంటి ఎన్నో పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.ఎన్నో దశాబ్దాలుగా పోడు,ప్రభుత్వ భూముల సాగు చేసుకుంటున్న అర్హులైన వారందరికీ జూన్ 2న పట్టాలు ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో భూభారతి అవగాహన సదస్సులు నిర్వహించామని అన్నారు. సైదాపూర్ మండలంలో సుమారు 30 వేల ఎకరాల భూమి ఉండగా ఇందులో సుమారు 29వేల ఎకరాల సాగు భూమి ఉందన్నారు. అన్ని రకాల భూముల ఇక్కడ ఉన్నందున భూభారతి పైలట్ మండలంగా సైదాపూర్ ను ఎంపిక చేసామని తెలిపారు. అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 410 దరఖాస్తులు ఇప్పటికే పరిష్కారం అయ్యాయని అన్నారు. ధరణిలో సవరణలకు వెసులుబాటు లేని కారణంగా అనేక సమస్యలు ఉండేవని తెలిపారు. జూన్ 2 నుండి నిర్వహించే రెవెన్యూ సదస్సులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమం అనంతరం భూభారతిలో పరిష్కరించిన సమస్యలకు సంబంధించిన ఉత్తర్వులు పట్టాదారులకు అందజేశారు.స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు.

## ఆర్మీచీఫ్‌నుంచి ఫీల్డ్‌మార్షల్‌కు ఆసిమ్‌మునీర్ పదోన్నతి

**ఇస్లామాబాద్, మే 20:** భారత్ పాకిస్తాన్‌మధ్య తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు వెలెగుతున్నవేళ పాక్ ఆర్మీచీఫ్ అసిమ్‌మునీర్‌కు దేశ అత్యున్నత పదవి లభిస్తోంది. పాక్‌ప్రధాని షెహబాజ్‌షరీఫ్ అధ్యక్షతన కేబినెట్ ఆయనకు దేశ అత్యున్నత ఫీల్డ్‌మార్షల్‌పదవిని కట్టబెట్టబోతోంది. దీనితో మునీర్ ఇక సాయుధదళాలన్నింటికీ అధిపతిగా వ్యవహరిస్తారు. 1947లో దేశ విభజన జరిగిన తర్వాత ఫైవ్‌స్టార్ ర్యాంక్ అయిన ఫీల్డ్‌మార్షల్ ర్యాంకు ఇద్దరికి మాత్రమే లభించింది. వీరిలో ఒకరు మునీర్ రెండో అధికారి. ఆనాడు అయూబ్‌జనరల్‌గా ఉన్న అయూబ్‌ఖాన్‌కు ఫైవ్‌స్టార్‌ర్యాంక్ ఫీల్డ్‌మార్షల్ పదవి లభించింది. ఆరోజుల్లో అయూబ్‌ఖాన్ తనంత తానే ఈ పదోన్నతిని ప్రకటించుకున్నారు. ఈపదవిలోఉన్నా ఎపుడైనా సరే పదవీవిరమణ చేయడానికి వీల్లేదు. ప్రస్తుతం ఆర్మీచీఫ్‌గానే అసిమ్‌మునీర్ కొనసాగుతారు. దీనితో ఆసిమ్‌మునీర్‌కు ఇక రిటైర్‌మెంట్ వయసు అనేది ఉండదు. 2022 నవంబరులో ఆర్మీచీఫ్‌గా అసిమ్‌మునీర్ బాధ్యతలుచేపట్టారు. పార్లమెంటు స్థాయిలో న్యాయచట్టాల సవరణలచేసి ఆయన పదవీకాలం మూడేళ్లనుంచి ఐదేళ్లకు పెంచుకోగలిగారు.

# పోలీసు శాఖలో ఏసిబి దడ

>> వారి పక్షాన నిలబడుతున్న ఘటనలూ ఎసిబి దృష్టికి వచ్చాయి. ఎసిబికి అందాలతో పట్టుబడ్డ వారిలో జనవరి ఆరవ తేదీన తొర్రూర్ ఎస్‌హెచ్‌ఓ జగదీష్ రెండు లక్షల రూపాయలతో దొరికిపోగా ఫిబ్రవరి 18వ తేదీన మక్తల్ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్ 40 వేల రూపాయలతో పట్టుబడ్డారు. మార్చి ఐదవ తేదీన కోరుట్ల ఎసిఐ శంకర్ ఐదు వేల రూపాయలతో పట్టుబడగా ఏప్రిల్ పదవ తేదీన భద్రాచలం టౌన్ ఎస్‌హెచ్‌ఓ బరుపాటి రమేష్ 20 వేల రూ పాయలతో దొరికిపోయారు. ఏప్రిల్ నెల 18వ తేదీన నస్పూర్ ఎసఐ సుగుణాకర్ 30 వేల రూపాయలతో దొరికిపోగా ఏప్రిల్ 21వ తేదీన మణుగూరు ఎస్‌హెచ్‌ఓ సోమ సతీష్ కుమార్ లక్ష రూపాయలతో పట్టుబడ్డారు. ఏప్రిల్ నెల 28వ తేదీన షామీర్‌పేట ఎసిఐ పరశురాం 22 వేల రూపాయలతో పట్టుబడగా మే 12వ తేదీన సూర్యాపేట డిఎస్పీ పాకపరశురాం, పట్టణ ఇన్స్‌పెక్టర్ రాఘవులు 17 లక్షల రూపాయల లంచంగా తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కారు. ఈ కేసులో సూర్యాపేట డిఎస్పీ పార్థసారథి, పట్టణ ఇన్స్‌పెక్టర్ రాఘవుల అరెస్టు పోలీసు శాఖను కుదిపేసిందని చెప్పాలి. సూర్యాపేటలో అక్రమంగా ఓ స్కానింగ్ కేంద్రం నడుపుతున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుర్తించింది. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ విభాగం అధికారులు పోలీసులకు లేఖ రాయడంతో పాటు ఇదే విషయాన్ని వైద్య శాఖ ఉన్నతాధికారులకు తెలియజేశారు. అయితే ఐఎంఏ లేఖపై సూర్యాపేట పట్టణ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా అక్రమంగా స్కానింగ్ కేంద్రం నిర్వహిస్తున్న వ్యక్తితో బేరానికి దిగడం, ఇంతలో ఈ విషయం ఏసీబీకి తెలిసిపోవడంతో వారు రంగంలోకి దిగి డిఎస్పీని ఇన్స్‌పెక్టర్లను అరెస్టు చేశారు. పోలీసు శాఖలో ఈ మాటకు వస్తే సర్వత్రా విభాగాల్లో ఇటీవల కాలంలో లంచం తీసుకునేందుకు అలవాటుపడిన ఆయా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా దొరకడం ఈ మధ్య చర్చనీయాంశంగా మారింది.

**సిటీ కొత్వాల్‌గా ఎంపిక కృష్ణారావు హయాంలో పోలీసులకు నిర్ధిష్ట విధానాలు అమలు**

పోలీసు శాఖలో ఇటీవల కాలంలో వరుసగా లంచాలు తీసుకుని ఏసిబికి దొరికిపోతున్న ఘటనలు పెరగడంతో 20 ఏళ్ల క్రితం హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా పనిచేసిన ఎం.వి కృష్ణారావు హయాంలో సిటీ పోలీసులకు కొన్ని నియమాలను విధించారు. సిటీ పోలీసులు ప్రతి రోజు విధుల్లో చేరే సమయంలో తమ వద్ద ఎంత మొత్తంలో డబ్బులు ఉన్నాయనే సమాచారం సంబంధిత పోలీసు స్టేషన్లలో నమోదు చేయాలి. దీని తరువాత ఎసిబి అధికారులు ఆకస్మికంగా పోలీసులను తనిఖీ చేసేవారు. ఆ సమయంలో ఎవరి వద్ద అయినా అధికంగా డబ్బులు ఉంటే కేసుల్లో ఇరుక్కునేవారు. అప్పట్లో సిటీ పోలీసులు ఎసిబి అధికారుల పేరు చెబితేనే వణుకిపోయేవారు. అప్పట్లో అక్రమార్కులను పదుల సంఖ్యలో కృష్ణారావు నిర్ధిష్ట పదవీ విరమణ చేయించారు. ఈ తరహా నిబంధనలు గతంలో కొన్ని పోలీసు విభాగాల్లో పుండేవని విశ్రాంత పోలీసులు చెబుతున్నారు. తాజా ఘటనల నేపథ్యంలో ఈ విధానం మళ్లీ అమలుపరిస్తే బాగుంటుందని నేటి పోలీసుల్లోనే కొందరు అనుకుంటున్నారు.

# రాజకీయ దురుద్దేశంతోనే కెసిఆర్‌కు నోటీసులు

**అది కాళేశ్వరం కమిషన్ కాదు..**

**కాంగ్రెస్ కమిషన్: కల్వకుంట్ల కవిత**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 20:** రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాళేశ్వరం కమిషన్ ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ప్రజానాయకుడు కేసీఆర్‌కు రాజకీయ దురుద్దేశంతో, కుట్రపూరితంగా నోటీసులు జారీ చేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ అని మరోసారి తేటతెల్లమైంది అని విమర్శించారు. కాళేశ్వరం ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన బృహత్ ప్రాజెక్టు అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల తరతరాల దాహార్తిని తీర్చడానికి, తెలంగాణ పొలాల్లోకి గోదావరి నీళ్లను గళగళా తరలించడానికి కట్టిన ప్రాజెక్టు అని స్పష్టం చేశారు. తాను కలలు గన్న తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దడానికి కేసీఆర్ కట్టిన ప్రాజెక్టే కాళేశ్వరం అని చెప్పారు. రాజకీయ కక్షతో, కుట్రతోనే నోటీసులు ఇచ్చారని, కాలక్రమంలో తప్పకుండా న్యాయం గెలుస్తుందని. నిజాలన్నీ బయటకు వస్తాయని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

# భారత్‌కు పర్యాటకులు తగ్గడంపై కేంద్రం ఆందోళన

**టూరిజంపై ప్రధాని మోడీ సమీక్ష**

**న్యూఢిల్లీ, మే 20:** టూరిజం రంగాన్ని ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పహల్గామ్ దాడి తరువాత కశ్మీర్‌కు టూరిస్టుల సంఖ్య తగ్గడంలో ఈ వ్యవహారంపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. జమ్మూకాశ్మీర్‌కు టూరిస్టులను ఆకర్షించేలా పలు కార్యక్రమాలను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ కీలక సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ అధ్యక్షతన పర్యాటక రంగంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఆపరేషన్ సింధూర్ , పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల కారణంగా టూరిజం రంగం పై తీవ్ర ప్రభావం పడింది. అంతర్జాతీయ టూరిస్టుల సంఖ్య తగ్గింది. కశ్మీర్‌కు కూడా వెళ్లడానికి టూరిస్టులు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. దీంతో పర్యాటకులను ఆకర్షించడానికి తీసుకోవాల్సిన చర్యలపై మోదీ చర్చించారు. పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల కారణంగా జమ్మూకశ్మీర్‌లో పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం పడింది. కశ్మీర్‌లో టూరిస్టుల భద్రతపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా ఇప్పటికే హోటల్ యాజమానులతో సమావేశమయ్యారు. కాశ్మీర్ ప్రభుత్వానికి కేంద్రం నుంచి అన్ని విధాలా సహకారం ఉంటుందని మోదీ తెలిపారు. జమ్మూకాశ్మీర్‌లో పర్యటించడానికి వచ్చే ప్రతి పౌరుడికి రక్షణ కల్పిస్తామని కేంద్రం భరోసా ఇస్తోంది. దేశంలో టూరిజం ప్రాజెక్ట్‌ల పురోగతిపై కూడా అడిగి తెలుసుకున్నారు మోదీ. కేంద్ర టూరిజం శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, సహాయ శాఖ మంత్రి సురేశ్ గోపి, కేంద్ర టూరిజం శాఖ కార్యదర్శి విద్యావతి ఈ సమావేశానికి హాజరయ్యారు. భారత్‌ను అంతర్జాతీయ టూరిజం మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలపాలని అధికారులకు మోడీ సూచించారు. అధ్యాత్మిక టూరిజం, స్వదేశ్ దర్శన్ లాంటి కార్యక్రమాలపై ఎక్కువ ఫోకస్ పెట్టాలని కోరారు. అధ్యాత్మిక క్షేత్రాల్లో భక్తులకు వసతుల కల్పనపై దృష్టి పెట్టాల న్నారు. టూరిస్ట్ ప్లేస్‌లను మరింత అభివృద్ధి చేయాలన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి తరువాత కశ్మీర్‌కు పర్యాటకులు తగ్గిన సంగతి వాస్తవమేనని కేంద్రం చెబుతోంది. ఇదే సమయంలో ప్రధాని మోదీ టూరిజం రంగంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించడం అందరి దృష్టిని ఆకర్షించింది.



# వికారాబాద్ రోడ్డు ప్రమాదంపై మంత్రులు దామోదర, పొన్నం విచారం

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లాలోని పరిగి పట్టణానికి సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం వ్యక్తం చేశారు.ఘటనలో పలువురు ఘటనాస్థలంలోనే చనిపోయారని తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యానని, మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు మంత్రి దామోదర రాజనర్సింహ. జిల్లా వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి.. ప్రమాదంలో గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి వేర్వేరు హాస్పిటళ్లలో చికిత్స అందిస్తున్నామని అధికారులు తెలపగా.. అందరికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# గుల్జార్‌హౌజ్ అగ్నిప్రమాదంపై విచారణకు ఉన్నతాధికారులతో కమిటీ

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** నగరంలోని గుల్జార్‌హౌజ్ వద్ద ఆదివారం ఉదయం సంభ వించిన భారీ అగ్ని ప్రమాదంపై విచారణకు ఆరుగురు ఉన్నతాధికారులతో కూడిన కమిటీని స ర్కారు ఏర్పాటు చేసింది. ఈ మేరకు హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా కు తెలిపారు. ఈ కమిటీలో బల్దియా కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిటీ కొత్వాల్ ఆనంద్, ఫైర్ సర్వీస్ డిజి నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, టిజిఎ స్పీడిసిఎల్ సిఎండి ముషరఫ్ ఫారుఖీలతో కూడిన కమిటీని సర్కారు ప్రకటించింది. ఈ ప్రమా దం జరగడానికి గల కారణాలు, అనంతరం వివిధ శాఖలు తీసుకున్న చర్యలతో పాటు భవిష్యత్తులో ఇలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా చేబట్టాల్సి న చర్యలను ఈ కమిటీ నివేదిక రూపంలో సర్కారుకు అందజేస్తుంది. కమిటీ అందించిన నివేదిక తరువాత సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి తదుపరి చర్యలు తీసుకుంటారు.

# సెల్‌ఫోన్ చోరీలు, రికవరీలో మళ్లీ మొదటి స్థానంలోకి తెలంగాణ

**సిఇఐఆర్ పోర్టల్‌తో బాధితులకు ఊరట**

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** సెల్‌ఫోన్‌ల చోరీలు, మిస్సింగ్ కేసుల విచారణ, నేరగాళ్ల నుంచి రికవరీలో తెలంగాణ సిఐడి విభాగం దేశంలో మరోసారి మొదటి స్థానంలోకి వచ్చింది. రెండేళ్ల నుంచి ద్వితీయ స్థానానికి పడిపోయిన తెలంగాణ పోలీసు విభాగం దేశ వ్యాప్తంగా అన్ని పోలీసు విభాగాల గణాంకాల పరిశీలన తరువాత మొదటి స్థానంలో నిలిచింది. కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ సహకారంతో దేశ వ్యాప్తంగా ఏర్పాటైన సెంట్రల్ ఇక్విప్‌మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ (సిఈఐఆర్)తో పైలట్ ప్రాజెక్టుగా మొదట కర్నాటక, మహారాష్ట్ర, ఢిల్లీ సహా ఈశాన్య రాష్ట్రాలలో సెల్‌ఫోన్ల చోరీలు, విచారణ రికవరీలను 2022 సెప్టెంబర్‌లో అమలు చేయగా తెలంగాణలో 2023 ఏప్రిల్‌లో అమలు చేశారు. అప్పటి నుంచి 2025 ఏప్రిల్ వరకు అంటే రెండేళ్ల కాలంలో రాష్ట్ర పోలీసు విభాగం 78, 114 సెల్ ఫోన్లను రికవరీ చేసి రికార్డు సృష్టించింది. సిఐడి ఆధ్వర్యంలో పనిచేసే ప్రత్యేక విభాగం దీనికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 31 పోలీసు యూనిట్ల లోని 780 పోలీసు స్టేషన్లకు సిఈఐఆర్ యూజర్ ఐడిలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అన్ని పోలీసు స్టేషన్లలో ఎంపిక చేసిన వారికి దీని అమ లుకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. కాగా సిఈఐఆర్ పోర్టల్‌కు రాష్ట్ర వ్యాప్త నోడల్ అధికారిగా సిఐడి చీఫ్ శిఖా గోయల్ వ్యవహరిస్తున్నారు. సగటున ప్రతీరోజు 82 ఫోన్లను రికవరీ చేస్తున్నారు. మొత్తం మీద సెల్‌ఫోన్ల రికవరీలో హైదరాబాద్‌లో 11,879, సైబరాబాద్‌లో 10,385, రాచకొండలో 8681 ఫోన్లు ఉన్నాయి. ఇతర ప్రాంతాలలోను గణనీయంగా సెల్‌ఫోన్లు రికవరీ అయ్యాయి. ఈ సందర్భంగా సిఐడి డిజి శిఖాగోయల్‌ను ఆమె బృందాన్ని డిజిపి అభినందించారు.

# రాజ్‌భవన్‌లో హార్డ్‌డిస్క్ చోరీ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే దొంగ

**వారం రోజుల క్రితం మహిళా ఉద్యోగి ఫొటో మార్ఫింగ్ కేసులోనూ అరెస్టు**

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** గవర్నర్ నివాసం రాజ్‌భవన్‌లో హార్డ్ డిస్క్ చోరీ కావడం కలకలం రేపింది. అయితే ఈ కేసును తీవ్రంగా పరిగణిం చిన పోలీసులు స్వల్ప వ్యవధిలోనే నిందితుడిని అరెస్టు చేశారు. ఈ నేరానికి పాల్పడిన వ్యక్తి రాజ్‌భవన్‌లో కంప్యూటర్ సెక్షన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా వు న్న శ్రీనివాస్‌గా గుర్తించారు. ఇతను వారం రోజుల క్రితం రాజ్‌భవన్‌లోనే ఓ మహిళా ఉద్యోగి ఫోటోను మార్ఫింగ్ చేసి ఆమెను బ్లాక్ మెయిల్ చేసిన కేసులో అ రెస్టు కాగా వెంటనే చోరీ కేసులో మళ్లీ ఊచలు లెక్కపెట్టాడు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత వున్న రాజ్‌భవన్‌లో చోరీ జరగడం సంచలనం రేపగా ఈ కేసులో నిందితుడిని పోలీసులు వెంటనే అరెస్టు చేశారు. అయితే చో రీ విషయంతో పాటు నిందితుడి అరెస్టు విషయాన్ని పోలీసులు గోప్యంగా వుంచడం గమనార్హం. రాజ్‌భవన్‌లో కంప్యూటర్ విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యో గిగా పనిచేస్తున్న శ్రీనివాస్ (30) తోటి మహిళా ఉద్యోగి ఫోటోను మార్ఫింగ్ చేసి తనకు ఎవరో ఈ ఫోటోలు పంపుతున్నారు...జాగ్రత్తగా వుండూ...నా సిస్టం లో ఇంకా చాలా ఫోటోలు వున్నాయి అని ఆమెను హెచ్చరించాడు.

దీంతో సదరు మహిళ భయపడి కుటుంబ సభ్యులతో కలిసి దీనిపై పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై విచారణ చేబట్టిన పోలీసులు ఈ కేసులో శ్రీనివాస్ నిందితుడుగా తేల్చారు. అనంతరం అతన్ని అరెస్టు చేయగా రాజ్‌భవన్ అధికారులు సస్పెండ్ చేశారు. ఈ కేసులో జైలుకు వెళ్లి రెండు రోజుల తరువాత బెయిల్‌పై వచ్చిన శ్రీనివాస్ మహిళా ఉద్యోగి ఫోటోను మార్ఫింగ్ చేసిన కంప్యూటర్‌లోని హార్డ్ డిస్క్‌ను చోరీ చేసేందుకు ఈ నెల 14వ తేదీన రాత్రి రాజ్‌భవన్‌లో అనధికారికంగా ప్రవేశించి నేరం చేశాడు. కంప్యూటర్ సెక్షన్‌లో హార్డ్ డిస్క్ చోరీ కాగా కొన్ని వస్తువులు చిందరవందరగా వుండడాన్ని 15వ తేదీన అక్కడి సిబ్బంది గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై హెల్మెట్ ధరించి రాజ్‌భవన్‌లోకి వచ్చి కం ప్యూటర్ సెక్షన్‌లో ప్రవేశించి ఈ చోరీకి పాల్పడినట్లు రాజ్‌భవన్‌లోని సిసి టివిలో నమోదయ్యింది. హార్డ్ డిస్క్‌తో పాటు కీలక ఫైళ్లు మాయమై వుంటాయని అధికారులు భావించి దీనిపై పోలీసులకు వేగంగా స్పందించిన పోలీసులు రాజ్‌భవన్‌కు వచ్చి కంప్యూటర్ సెక్షన్‌లో పరిశీలించగా కేవలం హార్డ్ డిస్క్ మాత్రమే చోరీ అయిందని తేల్చారు.

ఫైళ్లు ఇతర సామాగ్రి అంతా వుందని తేల్చారు. ఈ హార్డ్ డిస్క్ చోరీ చేసిన నేరగాడి కోసం గాలించగా సిసి టివిలో నమోదైన దృశ్యాల ఆ ధారంగా ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్‌గా తేల్చారు. నిందితుడిని అదే రోజు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అతని వద్ద నుంచి చోరీ అయిన హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు.

# ఉద్యోగుల జీతాలు పెంచరు.. అందాల పోటీలకు కోట్లా?

**సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ**




**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరమంతా ఇప్పుడు అందాల భామల చుట్టూ తిరుగుతోందని, ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు పెంచరు కానీ, అందాల భామల కోసం కోట్లల్లో ఖర్చు పెడుతున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ నారాయణ తీవ్రవిమర్శలు చేశారు. అందాల బామల చుట్టూ అధికారులు, మంత్రులంతా తిరుగుతున్నారని హాట్‌కామెంట్స్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కె.నారాయణ, కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి మావోయిస్టులపైన ఉన్న ద్వేషం, కసి ఉగ్రవాదులపై లేనట్లు ఉందని.. అందుకే వారితో చర్చలకు సిద్ధమైన కేంద్రం.. మావోయిస్టులతో చర్చలపై స్పందించకపోవడం ఏమిటని నారాయణ మండిపడ్డారు. ఉగ్రవాదులు బహిరంగంగా తుపాకులు పట్టుకుని తిరుగు తున్నారని పానీపూరి అమ్ముకునే వాళ్లు కూడా చెబుతున్నారని, మన నిఘావర్గాలు ఏమి చేస్తున్నాయని ప్రశ్నించారు. ఉగ్రవాదులను ఏరివేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అన్ని పార్టీలు ఏకతాటిపై నిలబడి సంపూర్ణ మద్దతు ప్రకటించాయని.. కాని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాత్రం ఉగ్రవాదులను అడ్డంపెట్టుకుని సొంత రాజకీయాలకు పాల్ప డుతున్నారని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా వివిధ దేశాల మద్దతును కూడగట్టేందుకు ఏర్పాటు చేసిన దౌత్యబృందాల ప్రతినిధులను ప్రధానమంత్రి స్వయంగా ఎంపిక చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని నారాయణ పేర్కొన్నారు. దౌత్య బృందాలను ఏర్పాటు చేయాలనుకుంటే ప్రజాస్వామ్యబద్ధంగా డెలిగేషన్ పంపించాలని, రాజకీయ పార్టీలకు సూచిస్తే ఎవని పంపించాలనేది ఆ పార్టీ న్యాయకత్వం నిర్ణయిస్తుందన్నారు.

తల్లిదండ్రులు కష్టపడి భవిష్యత్ కోసం పిల్లలను విదేశాలకు పంపించగా.. విదేశాల నుంచి పిల్లలు పంపించే డబ్బు పైన కూడా 5 శాతం పన్ను పేరుతో దోచుకుంటూ.. భారత్‌పై అమెరికా పైశాచికానందం పొందు తోందన్నారు. దేశం కోసం సర్వశక్తులు ఒడ్డి పోరా డుతున్న సైనికులను అవమానపర్చేలా మాట్లాడిన బిజెపి మంత్రిని తక్షణమే మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. సిందూర్ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసిన వీరవనితను అవమానించడం పట్ల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేస్తూ సదరు మంత్రి తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆదేశిస్తే మంత్రి మాత్రం మనస్పూర్తిగా కాకుండా నామమాత్రంగా చెప్పడం ద్వారా మరోసారి అవమానించారన్నారు.

# కూలిపోయే స్థితిలో గుల్జార్‌హౌస్ భవనం

**అగ్నిప్రమాదానికి గురైన భవనంలో మొత్తం 14 ఏసీలు**

**ఏసీ యూనిట్‌లోని కంప్రెషర్ పేలినట్లు నిర్ధారణ**

**క్లూస్‌టీమ్ విచారణ పూర్తి**

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** తీవ్రవిషాదం నింపిన గుల్జార్‌హౌజ్ ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగిన ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. అగ్ని ప్రమాద ఘటనపై క్లూస్ టీమ్ విచారణ పూర్తయింది. ఇంటి లోపలికి వెళ్లి క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని పరిశీలించింది. గోడలు బీటలు వారినట్లు అధికారులు గుర్తించారు. భవనం కూలిపోయే అవకాశం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వివరాల ప్రకారం, గుల్జార్‌హౌస్ భవనంలో మొత్తం 14 ఏసీలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఏదో ఏసీ యూనిట్లోని కంప్రెసర్ ఒక్కసారిగా పేలినట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ పేలుడు తీవ్రమైన అగ్ని ప్రమాదానికి దారితీసిందని అధికారులు తెలిపారు. పేలుడు తీవ్రతకు భవనం మొత్తం తునా తునకలైనట్లు వెల్లడించారు. గ్రౌండ్ ప్లస్ టూ అంతస్తులతో నిర్మించిన భవనం మొత్తం ప్రమాదంతో తీవ్రంగా దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. మూడంతస్తుల భవనంలోని వస్తువులు అన్నీ పనికి రాకుండా పోయాయి. గోడలన్నీ పగిలిపోయినట్లుగా, ఫ్లోర్లలో వేడి ప్రభావంతో బీటలు పడినట్లుగా గుర్తించారు. అలాగే టైల్స్, మార్బుల్స్ కూడా పూర్తిగా ధ్వంసమయ్యాయని నివేదికలు చెబుతున్నాయి. ఈ ప్రమాదం నేపథ్యంలో భవన నిర్మాణ నాణ్యతపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంప్రెసర్ పేలుడు ఎంత తీవ్రమైనా, భవనం అంతటి స్థాయిలో ధ్వంసం కావడం వెనుక నిర్మాణంలో లోపాలున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా,ప్రమాద స్థలాన్ని తహసీల్దార్ బృందం కూడా పరిశీలించింది. భవనం యజమాని సహా కుటుంబసభ్యులతో తహసీల్దార్ మాట్లాడి పంచనామా నిర్వహించారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తహసీల్దార్ బృందం బాధితులను అడిగి తెలుసుకుంది. హైదరాబాద్‌లోని గుల్జార్‌హౌస్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం అందరినీ కలచివేసింది. ఈ ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా జడ్జి ప్రసవం



**వేములవాడ, ప్రభాతవార్త:** వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా జడ్జి జ్యోతిర్మయి సోమవారం పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. సాధారణ కాన్పు ద్వారా మగ శిశువు జన్మించాడని వైద్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే సేవ లపై ప్రజలకు అవగాహన కల్పిం చేందుకు జిల్లా న్యాయమూర్తి స్వయంగా ఇక్కడ సేవలు పొందడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొంది అందరికి ఆదర్శంగా నిలిచారని సీనియర్ కోర్టు ఎజిపి ప్రశాంత్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. న్యాయమూర్తి జ్యోతిర్మయి వేములవాడ జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. కాగా, 2023లోనూ ఇదే ఆసుపత్రిలో ఆమె ఆడపిల్లకు జన్మనివ్వడం విశేషం. కాగా, ఈ విషయం తెలిసి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ ట్విట్టర్ ద్వారా న్యాయ మూర్తి జ్యోతి ర్మయికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అను భవం, నైపుణ్యం కలిగిన వైద్యులు అందుబాటులో ఉంటారని, వారి సేవలు పొందాలని ఆయన ప్రజ లకు సూచించారు. ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేశామని మంత్రి పేర్కొన్నారు.

**జూనియర్ సివిల్ కోర్టు జడ్జికి**

# మంత్రి దామోదర అభినందనలు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జ్యోతిర్మయి వేములవాడ ప్రాంతీయ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి సాధారణ కాన్పు ద్వారా మగ శిశువుకు జన్మనిచ్చిన సమాచారాన్ని తెలుసుకున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్యసేవలు పొంది తన మొదటి కాన్పు 2023లో ఆడ శిశువుకు జన్మనిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు పొంది ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకాన్ని పెంచినందుకు మంత్రి వేములవాడ జూనియర్ జడ్జి జ్యోతి ర్మయికి ట్విట్టర్ (ఎక్స్) ద్వారా అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేశామన్నారు. ఉచిత వైద్య సేవలను ప్రజలందరూ ఉపయోగించు కోవాలని మంత్రి రాజనర్సింహ కోరారు.

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

తేది: 20.05.2025

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి ప్రజా పాలన పార్టీ అధ్యక్షులు అయిన శ్రీ దుగ్గిరాల నాగేశ్వరరావు గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీ దుగ్గిరాల నాగేశ్వరరావు (అధ్యక్షులు) గారు (2) శ్రీ కోనింటి పవన్ కళ్యాణ్ (ప్రధాన కార్యదర్శి) గారు (3) శ్రీ అద్దంకి చెన్నకేశవులు (కోశాధికారి) గారు ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము 1-9-290/B/A అడిక్మెట్, రాంనగర్ గుండు, లలితానగర్, న్యూ నల్లకుంట, హైదరాబాద్, తెలంగాణ. సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C. గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల వరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు ప్రజా పాలన పార్టీను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

అధ్యక్షులు/సంతకం
ప్రజా పాలన పార్టీ.

# ఎంపి మంత్రిపై విచారణకు సిట్ ఏర్పాటు



**భోపాల్, మే 20:** మహిళా సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాపై దర్యాప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ సెట్‌లో ముగ్గురు సభ్యులున్నారు. మంత్రి వ్యాఖ్యలపై విచారణ జరపనున్న సిట్ మే 28 నాటికి నివేదిక సమర్పించనుంది. సిట్‌ను ఏర్పాటు చేస్తూ మధ్యప్రదేశ్ డీజీపీ ప్రకటన విడుదల చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఐజీ ప్రమోద్ వర్మ, డీఐజీ కళ్యాణ్ చక్రవర్తి, ఎస్పీ వాహినీ సింగ్‌లతో సిట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ప్రమోద్ వర్మ ప్రస్తుతం సాగర్ రేంజ్ ఐజీగా ఉన్నారు. కళ్యాణ్ చక్రవర్తి ఎస్ఏఎఫ్ డీఐజీగా ఉన్నారు. వాహినీ సింగ్ డిండోరీ ఎస్పీగా ఉన్నారు. కల్నల్ ఖురేషీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు మంత్రి విజయ్ షాపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన క్షమాపణలను అంగీకరించేది లేదని స్పష్టం చేసింది. అరెస్టు నుంచి ఉపశమనం కలిగించిన సుప్రీం కోర్టు పరిణామాలు తప్పవని హెచ్చరించింది. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన అనంతరం, ఈ నెల 12వ తేదీన మంత్రి విజయ్‌షా ఓ సభలో మాట్లాడుతూ పాకిస్తాన్ పని పట్టేందుకు ప్రధాని మోదీ అక్కడున్న వారి మతానికి చెందిన మహిళనే పంపించారంటూ కల్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మంత్రి వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయన్న సుప్రీం కోర్టు కల్నల్ సోఫియా ఖురేషీకి క్షమాపణలు చెప్పాలని గత గురువారం ఆదేశించింది. సోమవారం విచారణ సందర్భంగా మంత్రి క్షమాపణలు చెప్పిన తీరుపై కోర్టు ఆగ్రహించింది. కోర్టు కోరింది కాబట్టి క్షమాపణ చెబుదామన్నట్టు మీ వైఖరి ఉంది. చేసిన పిచ్చి వ్యాఖ్యలకు నిజాయితీగా క్షమాపణ అడగడానికి మీకు ఏం అడ్డుపడుతోంది? అని జస్టిస్ సూర్యకాంత్ నిలదీశారు. మంత్రి వ్యాఖ్యలతో దేశం సిగ్గుతో తల దించుకుందని మండిపడ్డారు.

# శ్రీశైలం పంజ్‌పూల్ అధ్యయనానికి వచ్చిన పుణే శాస్త్రవేత్తలు

**హైదరబాద్, మే 20, ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయం ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యిని పరిశీలిం చేందుకు పుణే శాస్త్రవేత్తల బృందం మంగళవారం శ్రీశైలం చేరుకొంది. డ్యామ్ దిగువన దెబ్బతిన్న ప్లంజ్‌పూల్ కాంక్రీట్ స్టీల్ సిలిండర్ డ్రమ్స్‌ను అండర్ వాటర్ విడియోగ్రఫీ ద్వారా నిపుణుల బృందం పరిశీలన చేసింది. సిడబ్ల్యు పిఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు శాస్త్రవేత్తల బృందం ప్లంజ్ పూల్‌లో ఏర్పడిన గుంతపై సర్వే చేశారు, రెండు రోజులపాటు డ్యామ్ వద్ద సర్వే చేయనున్న శాస్త్ర వేత్తల బృందం తెలిపారు. ప్లంజ్‌పూల్ సమస్యకు తక్షణం పరిష్కారాలు చూపేందుకు పుణే శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో శోధన చేస్తున్నారు. సిలిండర్లలో ధ్వంసమైన వాటిని పునరుద్ధరించే తీరుపై కూడా ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్లకు సూచనలు చేయడానికి తగిన నోట్స్ రూపొందిస్తున్నారు. ఆప్రాన్, పాత కాఫర్‌డ్యాం కింద సాంద్రత, పగుళ్ల స్వభావం అంచనా వేసేందుకు జూన్ నెలాఖరులోగా జియోగ్రాఫికల్ సర్వే నిర్వహించి ఫలితాలు పుణే శాస్త్రవేత్తలు తేల్చాల్సి ఉంది. ప్లంజ్‌పూల్ ఆప్రాన్, కుడి, ఎడమ వైపులా టోపోగ్రాఫికల్ సర్వే నిర్వహించాలి. ప్రస్తుతం ఉన్న హైడ్రాలా జికల్ సర్వే నివేదికలతో తాజా నివేదికల ఫలి తాలను అనుసంధానించాలి. స్వల్పకాలంలో చేయాల్సి న పనులన్నీ ఈ యేడాది వర్షాలు వచ్చే లోపు పూర్తి చేయాలి. డ్యాం 5, 6 గేట్లను ఎక్కువ సార్లు వాడకూడదు. శాశ్వత రక్షణ పనులు ఎలా చేయాలో కేంద్ర జలసంఘాన్ని సంప్రదించాలి. ప్లంజ్‌పూల్ దీర్ఘకాలంలో తీవ్రఇబ్బందులు సృష్టించే అవకాశం ఉంది. అక్కడ చేరిన నీటిని తొల గించలేని పరిస్థితుల్లో కోత విస్తరి స్తున్నందున అది ప్రమాదకరంగా మారు తుంది. సహజంగా ఏర్పడ్డ ప్లంజ్‌పూల్ కుడి, ఎడమ వైపు ఏట వాలుగా ఉన్న ప్రాంతాలు పుణే శాస్త్రవేత్తలకు కూడా సవాల్‌గా నిలి చాయి. వీటి స్థిరత్వానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. వైర్‌మెష్, రాక్‌బోల్ట్‌ల సాయంతో రీసెక్షనింగ్ చేసి పటిష్ఠ పరచాలి. శ్రీశైలండ్యాం నిర్మాణ సమయంలోనే రెండు దశల్లో భద్రతకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. స్పిల్‌వే బ్లాక్ నంబరు 10 నుంచి 13 ఎదురుగా ఉన్న రాతి కట్టపై ఆప్రాన్ ఏర్పాటు చేశారు. నీటి కోతను ఆపేందుకు కాంక్రీటు ఆప్రాన్ అంచు నుంచి స్టీల్ సిలిండర్లను శ్రీశైలం డ్యామ్‌కు ఏర్పాటు చేశారు. వాటిని కాంక్రీటుతో నింపారు. అయితే 40 నుంచి 45 వరకు ఉన్న సిలిండర్లు మొత్తం కొట్టుకుపోయాయి. పౌండేషన్ గ్యాలరీలో సీపేజీ విష యంలో కూడా పుణే శాస్త్రవేత్తలు తగిన సూచనలు ఇచ్చే అవకాశం ఉంది.

**జాతీయ విద్యుత్ శిక్షణ సంస్థ**
విద్యుత్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం
NPTI కాంప్లెక్స్, సెక్టార్-33, ఫరీదాబాద్- 121 003, హర్యానా, ఇండియా
NPTI
**అడ్మిషన్లు ప్రారంభం**
**పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు**
పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ (01 సంవత్సరం) — ఫరీదాబాద్ | నాగ్‌పూర్ | నైవేలి | దుర్గాపూర్ | అలప్పుఝ | శివపురి
రెన్యుయేబుల్ ఎనర్జీ & గ్రిడ్ ఇంటర్‌ఫేస్ టెక్నాలజీస్ (01 సంవత్సరం) — బెంగళూరు | నైవేలి | గౌహతి | న్యూఢిల్లీ (NISE సహకారంతో)
హైడ్రో పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ (09 నెలలు) — నంగల్
ట్రాన్స్‌మిషన్ & డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (06 నెలలు) — బెంగళూరు | గౌహతి
పవర్ డిస్ట్రిబ్యూషన్ & ఎమర్జింగ్ టెక్నాలజీస్ (01 సంవత్సరం) — న్యూఢిల్లీ (BSES సహకారంతో)
దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది - 21వ జూలై, 2025
దరఖాస్తు రుసుము - రూ.500 (GSTతో సహా)
కిందటి బ్యాచ్‌లలో 100% ప్లేస్‌మెంట్ రికార్డ్
మహిళా దరఖాస్తుదారులకు మాత్రమే ట్యూషన్ ఫీజులో 10% సడలింపు
https://bit.ly/NPTIPGDC25-26
మా ప్లేస్‌మెంట్ భాగస్వాములలో కొందరు: JSW BSES KPMG pwc adani tcs HCL Infosys GMR ESSAR wipro SUZLON BAJAJ vedanta RELIANCE
8218228896, 8826048899, 9999670968, 9781392002 nptipgdcadmissions@gmail.com www.npti.gov.in

వార్త

జీవితం అంటే ఒక సమస్య నుంచి మరొక సమస్యకు ప్రయాణం మాత్రమే. ఏ సమస్యలూ లేని జీవితం ఉండదు.

-రస్కిన్

# అ 'మర్యాద'కు అంతేది?


ఏలినవారు ఎలా ఉన్నా అధికార దర్పం అనుభవిస్తూ ప్రభుత్వ మర్యాదలు పాటించాల్సిన వారు ప్రోటోకాల్స్ పాటించడానికి కూడా ఇష్టపడుట లేదు. సాధారణ జనజీవనంలో పెద్దల్ని గౌరవించని వారిని పెద్దంతర చిన్నంతరం తెలియకుండా పిల్లచేష్టలు చేస్తున్నారని తట్టిపడేస్తాం. మరి కానీ సాక్షాత్తూ ఈ దేశ అత్యున్నత సర్వోన్నత న్యాయస్థానాధిపతి ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్‌కి ప్రోటోకాల్ పాటించడానికి మహారాష్ట్ర డిజిపి కానీ, సిఎస్‌గానీ ముంబై పోలీసు కమిషనర్ కానీ హాజరుకాలేదు. దాంతో సుప్రీం ప్రధాన న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారిగా శ్రీ బి.ఆర్ గవాయ్ సొంత రాష్ట్రం మహారాష్ట్రకు వెళ్లారు. మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్ నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఆ సందర్భంగా జరిగిన సభలో ఈ ప్రస్తావన తెచ్చారు. న్యాయమూర్తులకు ప్రోటోకాల్ విషయంలో 'అమర్యాద' కలిగితే సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలు కల్పిస్తున్న ఆర్టికల్ 142 కింద చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఈ అధికరణం కింద ఏ వ్యక్తినైనా తమ ముందు హాజరు కమ్మని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇవ్వచ్చు. ప్రజాస్వామ్యంలో మూడు ప్రధాన స్తంభాలుగా వ్యవహరించే న్యాయవ్యవస్థ, శాసనసభా, కార్యనిర్వాహక వ్యవస్థలు సమాన గౌరవాలు పొందుతున్నప్పుడు అందులో భాగస్వాములైన వారు ఒకరినొకరు పరస్పరంగౌరవించుకోవాలని అన్నారు. ప్రతి రాజ్యాంగ వ్యవస్థ, సమానమైన మరొక సంస్థకు ఇచ్చే గౌరవానికి సంబంధించిన విషయమే 'ప్రోటోకాల్' అని ఆయన వివరించారు. వారెవరైనా అలాంటి ప్రోటోకాల్ విషయంలో భిన్నమైన అభిప్రాయం ఉంటే సముచితం కాదని భావిస్తే పునరాలోచించుకోవాలని జస్టిస్ గవాయ్ కోరారు. చీఫ్ జస్టిస్ఆగ్రహం చవిచూశాక దాని తీవ్రత మరోదశకు చేరకుండా సిజెను ఆ ముగ్గురు ఉన్నతాధికారులు కలిసి వెళ్లారు. సాధారణంగా పాలకుల కనుసన్నల్లో నడుస్తూ తమకు వారి నుండి కావల్సినంత రాజ్యాంగ భద్రత ఉన్నదని భావించినపుడో, తమపై అధికారులను రక్షణ కల్పించే 'బాస్' లున్నారని భావించినప్పుడో పై అధికారులను వారి ఆధిపత్యాన్ని పక్కన బెట్టడం సహజంగా జరుగుతుంది.కొన్ని ప్రాంతాల్లో ఇలాంటివి గతంలో చూశాం. అధికారులు పాలకుల ఆధిపత్యాన్ని అంగీకరించలేనప్పుడు అలాంటివి జరుగుతుంటాయి. ఇవన్నీ ఆయా ప్రాంతాల్లో నడుస్తున్న రాజకీయాలు. రాజకీయ పార్టీల అనుబంధాల నేపథ్యంలో బేధాభిప్రాయాలు బయటపడ్తుంటాయి.రాజకీయవేత్తల ఆధిపత్యాన్ని సహించనప్పుడు కొందరు అధికారులువారికి తలొగ్గేందుకు ఇష్టపడరు. వ్యక్తిగతంగా ఎవరు ఎవరితోనైనా విభేదించవచ్చు. కాని రాజ్యాంగ సంస్థలకు చెందిన వారి మధ్య ఎలాంటి మర్యాదల లోపం జరుగకూడదు. అలా జరిగినప్పుడు ఆయా వ్యవస్థల మధ్య జరిగే సంఘర్షణలు రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తాయి. రాజ్యాంగ వ్యవస్థలో ముఖ్యమైన మూడు వ్యవస్థలూ సమాన గౌరవాలు ఇచ్చిపుచ్చుకోవాలి. ఇలాంటివి తాను పెద్దగా పట్టించుకోనని అయినా చెప్పవలసిన చోట, చెప్పదగిన విషయాలు చెప్పాల్సివస్తుందని ప్రస్తావించారు. మహారాష్ట్రకు చెందిన తాను దేశంలోని న్యాయవ్యవస్థలో అత్యున్నత హోదా పొంది తొలిసారి స్వరాష్ట్రానికి వచ్చినప్పుడు సాటి రాజ్యాంగ సంస్థల అధికార్లు ప్రోటోకాల్ పాటించని విషయంలో పునరాలోచన చేసుకోవాలని కోరారంటే వారిని ప్రధాన న్యాయమూర్తి ఎంత సున్నితంగా మందలించారో అర్థమవుతుంది. ఇలా ఒక సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి విషయంలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. శాసనసభ్యులు, మండల ప్రజాపరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల విషయంలో విపక్ష శాసన సభ్యుల విష యంలో కూడా ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతుండ డం తరువాత అవి సర్దుకుపోవడం మామూలే. అయితే గత కొంతకాలం తెలుగు రాష్ట్రాలలో రాజ్యాంగ వ్యవస్థ లోనే అంతర్గతంగా కొన్ని విభిన్న హోదాలున్న వారి మధ్య ఇలాంటి వివాదాలు చెలరేగి చాలాకాలం ముఖాముఖాలు చూసుకోలేని పరిస్థితి ఏర్పడింది. సాటి వ్యవస్థ అధినేతలు వారిని సమాన గౌరవంతో చూడలేకపోవడం అహంభావ ఛాయలు కూడా ఇలాంటి చేదు అనుభవాలకు దారితీస్తాయి. తెలంగాణ గవర్నర్ తమిళ్‌సై వచ్చాక తెలంగాణ ప్రభుత్వం ఆమె పట్ల ఎంతో విభిన్న వైఖరితో ప్రవర్తించింది. పలుసార్లు ఆమె అవమానానికి గురయ్యారు. కాగా ఎంతో సంయమనంతో వ్యవహరించేవారు. చివరికి తెలంగాణ గవర్నర్ తమిళ్‌సై సుందరరాజన్ పట్ల అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి సరైన గౌరవం చూపలేదనే చేదు అనుభవాల గురించి అందరికీ తెలిసిందే. 2024 జనవరిలో మెదక్ జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా కాంగ్రెస్ నేతలను వేదిక మీద కూర్చోనివ్వకపోవడం వివాదాస్పదమైంది. రాజ్యాంగ సంస్థల మధ్య ఇటువంటి పరువు ప్రతిష్టల సమస్య ఏర్పడడం మంచిది కాదు.తెలుగునాట చీటికిమాటికి వచ్చే ప్రోటోకాల్ స్పర్థలన్నీ స్థానిక రాజకీయ విభేదాలకు సంబంధించినవే కనుక కాలక్రమంలో వీరు వారైనా, వారువీరైనా ఒకటైపోతారు.కాగా మొన్న ప్రధానన్యాయమూర్తి విషయంలో జరిగిన ఉల్లంఘన అసలుసిసలు సమస్య. అధికారులు ప్రోటోకాల్ విషయంలో విశాలదృక్పథంతో ఆలోచిస్తే అసలు సమస్యే ఉండదు.అందుకే రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు తాము ఇతరుల పట్ల ఎంత మర్యాదగా ప్రవర్తించాల్సి ఉంటుందో తెలుసుకోవాలి. దీనివలన ప్రజల్లో చులకనవడం తప్ప వేరే ఏ విధమైన గౌరవ ప్రతిష్టలు కలుగవని గుర్తుంచుకోవాలి.

అదృష్టాన్ని నమ్ముకోవడం కంటే ధైర్యాన్ని నమ్ముకోవడం మంచిది. అదృష్టం ఏ వ్యక్తినీ తెలివిమంతుడ్ని చేయలేదు.



సెనెకా

ఒక వ్యక్తి పవిత్రమైన ఆలోచనలతో మాట్లాడినా, లేక పనిచేసినా, ఎప్పటికీ అతనిని విడువని నీడలాగా ఆనందం అతని వెన్నంటే ఉంటుంది.



గౌతమబుద్ధుడు

## ప్రజావాక్కు



### ఆన్‌లైన్ గేమ్స్‌పై నిషేధం విధించాలి

రాష్ట్రంలో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్,బెట్టింగ్‌లపై నిషేధం ఉన్నప్పటికీ చాలా మంది విరివిగా ఆడుతున్నారు. రాష్ట్రంలో నిషేధించిన యాప్‌లను విపిఎన్ సాయంతో లొకేషన్ మారుస్తూ వినియోగిస్తున్నారు. ఈ ఆన్‌లైన్ గేమ్స్ వల్ల యువత డబ్బును కోల్పోవడమే కాకుండా తమ విలువైన ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలి.

- ఎం.ముత్యం రెడ్డి, అందెగ్రామం, సిద్ధిపేటజిల్లా

### అందాల పోటీలు రాష్ట్రఖ్యాతిని పెంచాయి

పన్నెండురాసులలో నూటఎనిమిది పాదాలున్నట్లుగా అందాల పోటీకి నూట ఎనిమది దేశాల అందగత్తెలలో అందగత్తెగా ఎన్నిక చేయడానికి వారందరని మన తెలంగాణా రాష్ట్రంలోని హైదరాబాద్‌కుఆహ్వానించి, గౌరవించడం రాష్ట్ర ఖ్యాతి మిక్కిలి ఇనుమడించింది.వారికి సకల సదుపాయాలను కలిగించి, ముఖ్యమైన చారిత్రాత్మక ప్రదేశాలకు, మన రామోజి ఫిల్మ్ సిటికి తీసుకెళ్ళడం వంటివి చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆహ్వానితులు ఎన్నటికి మరచిపోలేరు. వీరి కట్టూ బొట్టు మన హిందూ సంప్రదాయాన్ని ప్రతిఫలించింది.వీరిలో ఎవరో ఒకరు ప్రపంచ సుందరిగా ఎన్నికవుతారు. కానివారు కూడా చాలామందికి బాగా నచ్చుతారు. అందానికి సరియైన నిర్వచనం లేదు. నాకు ఏది అందంగా కనిపిస్తోందో అదే నాకు ఎప్పటికి ఆనందమనిపిస్తుందని ఆంగ్ల రోమాంటిక్ కవి జాన్‌కీట్స్ అన్నాడు. మన తెలుగు కవులు ఇంకా అద్భుతంగా స్త్రీ సౌందర్యాన్ని ఊహకు అందనంతగా అనేక శోభలతో వర్ణించారు.

-డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### సౌకర్యాలు కల్పించాలి

పొట్టకూటికోసం వలసకార్మికులు పడే కష్టాలు వర్ణనాతీతం. రెక్కాడితేకానీ డొక్కాడని ఈ భవన కార్మికులకు ఉపాధికరువయిందంటే అతిశయోక్తికాదు. ఏపూటకాపూట శ్రమించి, ఉదరం నింపుకునే వీళ్లకు సౌకర్యాలు చాలా దూరం. అంతేకాకుండా చేసే పనుల్లో దుమ్ము, ధూళి కారణంగా శ్వాసకోశ సమస్యలతో అనారోగ్యపాలవుతుంటారు. ఎక్కువ పనిదినాలు, సొంతిళ్లతోపాటు రేషన్ హెల్త్, లేబర్ కార్డులు, షూ, చేతిగ్లోస్‌లు, మాస్కులు అందించి ఆదుకొని వీరి జీవితాల్లో వెలుగు నింపాలి.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### అగ్నిప్రమాదాలను నివారించలేరా?

వేసవి పొడి గాలులు, పెరిగిన ఉష్ణోగ్రతలు, గరిష్ఠ విద్యుత్ లోడ్లుకలిస్తే అగ్నిప్రమాదాలుసంభవించే అవకాశాలు ఎక్కువగా వుంటాయి. ముఖ్యంగా వాణిజ్య ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల ప్రమాదం శారీరకంగానే కాక ఆర్థికంగా కూడా వినాశకరంగా మారుతోంది. ఒక్క చిన్న స్పార్క్‌తో వేల కోట్లు విలువైన ఆస్తి కలిపి, ఎన్నో ప్రాణాలు మంటల్లో పోయే అవకాశముంది. ప్రభుత్వం తక్షణం మూడు దిశల్లో చర్యలు చేపట్టాలి. మొదట, అగ్నిమాపక విభాగాన్ని బలోపేతం చేయాలి.ప్రతి మండలానికి ఒక మొబైల్ ఫైర్ స్టేషన్, వేగవంతమైన రగడ నీటి ట్యాంకర్లు, ఆధునిక ఫోమ్ సిస్టమ్‌లు అందుబాటులో ఉంచాలి. రెండవది, నిరంతర తనిఖీలు, శీతల పానీయ చేటిగళ్లు, గాజు ప్యానెల్లు, ఎయిర్‌కండిషనర్ లైను లాంటి అధిక లోడ్ ప్రాంతాల్లో ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆడిట్లు నెలసారి నిర్వహించి, తప్పులైతే వెంటనే సరిపెట్టాలి. మూడవది, ప్రజలకు అవగాహన ప్రతి రెవెన్యూ గ్రామంలో వేసవి ప్రారంభానికి ముందే 'ఫైర్ సేఫ్టీ వారాలు' జరిపి, గృహాల్లో ప్రత్యేక భద్రతాచర్యలు, గ్యాస్ సిలిండర్ నిర్వహణ, పొదుపు చర్చలు నిర్వహించాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### క్లీన్ సిటీగా నగరం

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి అనే భావనతో ఇటీవల తెలంగాణాప్రభుత్వం గోడల మీద రాతలను వాల్‌పోస్టర్స్‌ను నిషేధించింది. దీన్ని ఉల్లంఘిస్తే ఫైన్ వేస్తామని తెలిపింది. ఇది ముమ్మాటికీ హర్షణీయం. అలాగే బ్యానర్ ఫ్లెక్సీలపై కూడా చర్యలు తీసుకోవాలి. గతప్రభుత్వం బ్యానర్ ఫ్లెక్సీలపై నిషేధం విధించింది. కానీ నగరంలో విచ్చలవిడిగా బ్యానర్లు ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి.రోడ్లపై చెత్తను వేయకూడదు.

-ఎస్. శేషగిరి, సికింద్రాబాద్

### అవినీతిని అరికట్టాలి

ఇటీవల ఉభయరాష్ట్రాల్లో కొన్ని లక్షల ప్రజలకు ఎన్నో విషయాల్లో సమస్యలు ఎదురవుతున్నాయి. అత్యంత ఉన్నత అధికార హోదా ఉన్న వ్యక్తులు చాపకింద నీరులా అవినీతి, అధికార దుర్వినియోగం చేస్తూ బయట పడుతున్నారు. రాజును బట్టి రాజ్యం అన్నారు పెద్దలు. ఆ హోదాకి విలువ, ప్రజలకు రక్షణ అప్పుడే సాధ్యం. ఏ ప్రభుత్వమైన ప్రజల సంక్షేమానికి పెట్టిన పథకాలు అమలు బాధ్యత ప్రభుత్వానిదే. వాటిని సరిదిద్దేందుకు ఏదైనా సహేతుక చర్య తీసుకోవచ్చు.

-బొల్లోజు మేఘనాథ్, విశాఖపట్నం

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అవగాహనే అగ్నిప్రమాదాల సమస్యకు పరిష్కారం

*ప్రభుత్వం తక్షణమే కఠినమైన భవన నిర్మాణ నిబంధనలను ప్రవేశపెట్టి, వాటిని నిక్కచ్చిగా అమలు చేయాలి. నగరంలోని అధిక జనాభా కలిగిన ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలి.సురక్షితమైన, ధృవీకరించబడిన విద్యుత్ పరికరాల వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. విద్యుత్ పనులు అర్హత కలిగిన, శిక్షణ పొందిన నిపుణులచే మాత్రమే నిర్వహించబడేలా చూడాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా, అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు, సిబ్బందిని సమకూర్చాలి. ప్రజల్లో అగ్నిమాపక భద్రతపై ఒక బలమైన అవగాహన సంస్కృతిని పెంపొం దించడం అత్యంత కీలకం. దీని కోసం విస్తృతమైన విద్యా ప్రచారాలు, అవగాహన సదస్సు లు నిర్వహించాలి.*

**డి. జయరాం**

హైదరాబాద్ నగరంలో ఇటీవల చోటుచేసుకున్న అగ్ని ప్రమాదం ఒక హెచ్చరిక. ఇది కేవలం ఒక దుర్ఘటనగా కొట్టిపారేయడానికి వీల్లేని ఒక భయానక వాస్తవం. పట్టణీకరణ శరవేగంగా జరుగుతున్న మన దేశంలో, ఇలాంటి విషాదాలు మళ్లీ మళ్లీ తలెత్తుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ, ఇలాంటి ప్రమాదాలకు దారితీసే అంతర్లీన కారణాలను, వ్యవస్థాగత లోపాలను, మానవ తప్పిదాలను లోతుగా పరిశీలించాల్సిన సమయం ఆసన్నమైంది. దట్టమైన జనాభాతో నిండిన మన నగరాలలో విద్యుత్ మౌలిక సదుపాయాల పరిస్థితి ఎప్పుడూ ఒక ప్రధాన సమస్యగా నిలుస్తోంది. పాతబడిపోయిన వైర్లు, ప్రమాదకర స్థాయికి చేరిన విద్యుత్ లోడ్, నాసిరకం విద్యుత్ పరికరాల వినియోగం నిత్యం పెను ప్రమాదానికి కారణమవుతున్నాయి. నగరాలు విస్తరిస్తున్న తీరుకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థలను ఆధునీకరించడంలో మనం తీవ్రంగా వెనుకబడిపోతున్నాం. దీనిఫలితంగా ఎప్పుడు ఏ విపత్తుజరుగుతుందో అనే భయం ప్రతి నగరవాసి గుండెల్లోనూ దాగి ఉంది. ఇక అనధికారికంగా వెలసిన మురికివాడలు, అనుమతి లేని కట్టడాలలో విద్యుత్ కనెక్షన్ల పరిస్థితి మరింత దయనీయంగా, ప్రమాదకరంగా ఉంటుంది. అక్కడ నివసించే వారి జీవితాలు నిత్యం అగ్నిగుండంపైనే ఉన్నట్లుగా అనిపిస్తుంది. విద్యుత్ వైఫల్యాలే కాకుండా, అగ్నిమాపక భద్రతా నిబంధనల పట్ల మనం చూపుతున్న నిర్లక్ష్యం, వాటిని సమర్థవంతంగా అమలు చేయడంలో ఉన్న అలసత్వం కూడా ఇలాంటి విషాదాలకు ముఖ్య కారణాలలో ఒకటి. వాణిజ్య సముదాయాలైనా, బహుళ అంతస్తుల నివాస భవనాలైనా, విద్యా సంస్థలైనా, ఆసుపత్రులైనా చాలా వరకు సరైన అగ్నిమాపక భద్రతా వ్యవస్థలు లేకుండానే కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల ఉన్నా అవి చాలా కాలంగా పనిచేయని స్థితిలో మూలకు పడివుంటాయి. అత్యవసర నిష్క్రమణ మార్గాలు సరుకులతో నిండిపోయి ఉండటం, వాటిని తాళం వేసి ఉంచడం వంటి బాధ్యతారహితమైన చర్యలు మనకు నిత్యం కనిపిస్తూనే ఉన్నాయి. అగ్నిమాపక పరికరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, వాటి నిర్వహణపై శ్రద్ధ చూపడం అనేది చాలా చోట్ల మర్చిపోయిన విషయం. కేవలం స్వల్ప మొత్తంలో డబ్బు ఆదా చేయాలనే దురాలోచనతో భద్రతా ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. ఇది ఎంతటి ఘోరమైన పరిణామాలకు దారితీస్తుందో మనం ఊహించలేం. మానవ ప్రవర్తన కూడా ఈ విషయంలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. వంట చేసేటప్పుడు ఏమరుపాటుగా ఉండటం, మండే గుణం కలిగిన వ్యర్థ పదార్థాలను అజాగ్రత్తగా పారవేయడం, ప్రాథమిక అగ్నిమాపక భద్రతా నియమాల గురించి కనీస అవగాహన కూడా లేకపోవడం వంటివి భయంకరమైన ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఇరుకుగా ఉండే ప్రాంతాలలో ఒక చిన్న నిప్పురవ్వ కూడా క్షణాల్లో పెద్ద అగ్ని జ్వాలగా మారి ఎన్నో ప్రాణాలను బలిగొనగలదు. అగ్నిమాపక భద్రతపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించకపోవడం, పాఠశాల్లో, కార్యా



లయాల్లో తగినంత శిక్షణ లేకపోవడం కూడా ఈ దుర్భర పరిస్థితికి ప్రధాన కారణమవుతోంది. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతగా ప్రవర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన ప్రాణాల కంటే ముఖ్యమైనది ఏదీ కాదని గుర్తెరగాలి. ఈ విషమ పరిస్థితిని చక్కదిద్దాలంటే మనం ఒక సమగ్రమైన, బహుముఖ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి. ప్రభుత్వం తక్షణమే కఠినమైన భవన నిర్మాణ నిబంధనలను ప్రవేశపెట్టి, వాటిని నిక్కచ్చిగా అమలు చేయాలి. నగరంలోని అధిక జనాభా కలిగిన ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలి.సురక్షితమైన, ధృవీకరించబడిన విద్యుత్ పరికరాల వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. విద్యుత్ పనులు అర్హత కలిగిన, శిక్షణ పొందిన నిపుణులచే మాత్రమే నిర్వహించబడేలా చూడాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా, అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు, సిబ్బందిని సమకూర్చాలి. ప్రజల్లో అగ్నిమాపక భద్రతపై ఒక బలమైన అవగాహన సంస్కృతిని పెంపొందించడం అత్యంత కీలకం. దీని కోసం విస్తృతమైన విద్యా ప్రచారాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలి. నివారణ చర్యలు తీసుకోవడం ప్రాముఖ్యతను, బాధ్యతాయుతంగా ప్రవర్తించవలసిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా తెలియజేయాలి. భవన యజమానులు, నివాసితులు కూడా తమ వంతు బాధ్యతగా ప్రతి అంతస్తులో నాణ్యమైన పొగ గుర్తింపు యంత్రాలు ఏర్పాటు చేసుకోవడం, అందుబాటులో అగ్ని చల్లార్చే పరికరాలు ఉంచుకోవడం, స్పష్టమైనతరలింపు ప్రణాళికలు రూపొందించుకోవడం వంటి చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. అంతేకాకుండా, క్రమం తప్పకుండా అగ్నిమాపక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం కూడా చాలా అవసరం. ఈ విషయంలో ఏమాత్రం అలసత్వం వహించినా దాని మూల్యం ప్రాణాలతో చెల్లించుకోవలసి వస్తుంది. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మండే పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయడం వంటి సాధారణ జాగ్రత్తలు తీసుకోవాలి. హైదరాబాద్‌లో జరిగిన ఈ విషాదకరమైన సంఘటన మనందరికీ ఒక కనువిప్పు లాంటిది. అధికారులు, పాలకులు, భవన యజమానులు, సామాన్య పౌరులు ఇలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి, అగ్ని భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి. ఈ దిశగా మనం తీసుకునే ప్రతి చిన్న చర్య కూడా భవిష్యత్తులో ఎన్నో అమూల్యమైన ప్రాణాలను కాపాడుతుంది. సమిష్టిగా కృషి చేస్తేనే సురక్షితమైన, మరింత నిరోధక శక్తి కలిగిన నగరాలను మనం నిర్మించగలం. ఇది కేవలం మన బాధ్యత మాత్రమే కాదు, మన భవిష్యత్తు తరాలకు మనం అందించే అత్యంత విలువైన భద్రతా వారసత్వం కూడా. ఈ విషయంలో ఇంకెంత మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. నివురుగప్పిన నిప్పులా ఉన్న నగర భద్రతపై మనమందరం కలిసి పోరాడకపోతే, భవిష్యత్తులో మరిన్ని విషాదాలను చూడక తప్పదు. ఇకనైనా మేల్కొని, తగిన జాగ్రత్తలు తీసుకుందాం. మన ప్రాణాలను, మన ఆస్తులను కాపాడుకుందాం. సురక్షితమైన నగర జీవనానికి బాటలు వేద్దాం. ●

# ఉగ్రవాదం మూలాలు పెకలించాలి

**సంపతి రమేష్**

రాజకీయ, మతపరమైన లేదా సైద్ధాంతిక లక్ష్యాల కోసం జనాభాను లేదా ప్రభుత్వాన్ని బెదిరించడానికి హింసను సృష్టించడం ఉగ్రవాదంగా పేర్కొంటారు. ఉగ్రవాదం దేశ భద్రతకు సవాల్ విసురుతోంది. ప్రజల ఆర్థిక, సామాజిక జీవనాన్ని దెబ్బతీస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా నష్టం. దేశాభివృద్ధికి విఘాతంగా మారుతుంది. మే 21, 1991లో తమిళనాడులోని శ్రీ పెరంబుదూర్‌లో జాతీయ ఎన్నికలకు పార్టీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ ప్రచార సభలో ప్రసంగిస్తున్నప్పుడు ఉగ్రవాదుల చేతుల్లో హత్యకు గురైయ్యారు. ఆ తర్వాత భారత ప్రభుత్వం ఇటువంటి సంఘటనలు జరగకూడదనే ఉద్దేశ్యంతో ఈ రోజును జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించింది. ఇది భారతదేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి రోజు అని చెప్పవచ్చు. మానవత్వం, కోసం పాటుపడేలా ప్రజలలో ఐక్యతను పెంపొందించడం కోసం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ శాంతి కోసం అహింస సందేశాన్ని ప్రజలకు అవగతమయ్యేలా చేయడం, యువత పెడదోవ పట్టకుండా చేయడం వంటివి ఈ దినోత్సవం ముఖ్యోద్దేశాలు. ఈ రోజున ఉగ్రవాద వ్యతిరేకంగా పోరాడిన వేలాదిమంది సైనికులు చేసినత్యాగాలను గుర్తుచేసుకోవడమే కాక వారికి నివాళుల అర్పిస్తారు. మానవత్వం శాంతి సందేశాన్ని ప్రచారం చేయడం జరుగుతుంది. ఉగ్రవాద మూలాలను వెతకాలి. భారత దేశంలో ఉగ్రవాదం ప్రధానంగా బోర్డర్ నుంచి పొంచి ఉంది. ఇది దేశవ్యాప్తంగా కూడా విస్తరించే ప్రమాదం ఉంది. మన దేశసరిహద్దు దేశాలకు మధ్య ఉన్న రాష్ట్రాలకు నిరంతరం వలసలు రావడం వలన ఉగ్రవాద ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగాచైనా, పాకిస్థాన్ సరిహద్దు రాష్ట్రాలతో మనకు ప్రమాదం ఉంది. ఇటీవల జమ్మూకాశ్మీర్ లోని పహల్గామ్ ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిలో 28 అమాయక భారతీయులు ప్రాణాలు కోల్పో



యారు. ఉగ్రవాద ముప్పు తొలగిపోయిందన్న నేపథ్యంలో ఈ దాడి జరగడం మరొకసారి భారతదేశాన్ని భయోందోళనలకు గురిచేసింది. దీనికి భారతదేశం ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రతిదాడి చేసింది. ఇప్పటికే భారతదేశంపై పలుమార్లు ఉగ్రదాడి జరిగింది. చాలా ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. కానీ గత కొంతకాలం నుంచి భారత్ వివిధ దేశాలతో కొనసాగిస్తున్న దౌత్య సంబంధాల నేపథ్యంలో ఉగ్రదాడి తగ్గిన సంగతి తెలిసిందే. మరోవైపు భారతదేశంలో వేల సంవత్సరాల నుంచి చాప కింద నీరులా కొనసాగుతున్న సామాజిక వివక్షత వలన అంతర్గత సంఘర్షణలు పెరుగుతున్నాయి. కులం పేరుతో విభజించి అవకాశాలు అందకుండా చేయడం కూడా ఉగ్రవాదమే. ముఖ్యంగా రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు కొన్ని వర్గాల వారికే అందడం వలన సమాజంలో అంతర్గత కలహాలు పెరిగిపోతాయి. దీంతో గతంలో వామపక్ష తీవ్రవాదం తీవ్రంగా పెరిగిపోయింది. ఇప్పటికీ అక్కడక్కడ కొనసాగుతుంది. దీనికి ప్రధాన కారణాన్ని అన్వేషించి పరిష్కరించాల్సిన అవసరం ప్రభుత్వాలపైన ఉన్నాయి. కానీ ఇటీవల చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కర్రెగుట్టల వద్ద ఆపరేషన్ పేరుతో అణచివేయడం వలన వామపక్ష తీవ్రవాదం అంతం కాదు. అనేక ప్రజా సంఘాల సైతం దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. అతిపెద్ద జనాభా గల భారతదేశంలో అంతర్గత బహిర్గత ఉగ్రవాదం అత్యంత ప్రమాదకరం. దీన్ని నిలువరించాలంటే ప్రపంచ దేశాలతో స్నేహపూరిక దౌత్యసంబంధాలను పెంపొందించుకోవాలి. సరిహద్దు దేశాలతో ఉన్న బార్డర్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలి. ఉగ్రవాదం అంతం చేయడానికి ఆధునిక సాంకేతికతను వాడాలి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలపై నిఘాపెట్టాలి. ముఖ్యంగా మతోన్మాదాన్ని నివారించాలి. కులం పేరుతో కొనసాగుతున్న అణచివేతను తగ్గించాలి. అన్ని రం గాలలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అవకాశాలు కల్పించాలి.ఉగ్రవాదం అంటే తుపాకిలతో కాల్చాడం.బాంబులను పేల్చడం ఉగ్రవాదం కాదు, ప్రజలను కులాలుగా, మతాలుగా విభజించడం కూడా అతి భయంకరమైన ఉగ్రవాదమే అని గుర్తెరిగి నడుచుకోవాలి. ●

# మానవహక్కుల కార్యవర్గాన్ని నియమించాలి

**టేకి.సురేష్ కుమార్**

ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల సంఘంలో దాదాపు14 నెలల నుంచి ఛైర్మన్, సభ్యుల నియామకం జరగని కారణంగా..వేలాది హక్కుల ఉల్లంఘన ఫిర్యాదులు అపరిష్కృతంగా గత ప్రభుత్వ కాలం నుంచే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో 2024లో సదరు నియమకానికి దరఖాస్తులు ఆహ్వానించగా జూన్ 2024లో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం సదరు నియమకాలు పారదర్శకంగా, నిబద్ధతగా జరపాలని మరల నూతనంగా దరఖాస్తులని ఆహ్వానించి దాదాపు 6నెలలు కావస్తున్నా ఎంపిక, నియామక ప్రక్రియ జరగపోవడానికి కారణమేమిటో సామాన్య ప్రజలకు, విజ్ఞానవంతులకు,మానవ హక్కుల సంఘాల కార్యకర్తలకు అర్థం కావడం లేదు.! ప్రభుత్వం చొరవ చూపి తక్షణమే సమర్థుల్ని,సేవాభావం గల వారిని మానవహక్కుల సంఘం ఛైర్మన్, సభ్యులుగా నియమిస్తే బాగుంటుందని ప్రజలు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్.హెచ్.ఆర్.సి) మానవ హక్కుల రక్షణ కోసం ఏర్పాటు చేయబడిన ఒక చట్టబద్ధమైన సంస్థ. మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993,ద్వారా ఏర్పడ్డ కేంద్ర(ఎన్.హెచ్. ఆర్. సి), రాష్ట్ర (ఎస్.హెచ్.ఆర్.సి) మానవ హక్కుల సంఘాలకు..సివిల్ న్యాయ స్థానాలకున్న అధికారాలు ఉంటాయి. ఈ కమిషన్ మానవ హక్కుల ఉల్లంఘనలను, వినతులు,విజ్ఞప్తులు, పరిశీలిస్తుంది. పరిశోధించి సంబంధిత చర్యలు తీసుకోవడానికి బాధ్యత వహిస్తుంది. ప్రజల హక్కులను రక్షించే బాధ్యత వహిస్తుంది. ఉల్లంఘనల ఫిర్యాదులను, వినతులు, విజ్ఞప్తులు స్వీకరించి వాటిని పరిశీలిస్తుంది. ఉల్లంఘనలు కన్ఫర్మ్ అయితే కమిషన్ సంబంధిత చర్యలు తీసుకుంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌ను,ఇద్దరు సభ్యులని(ఎస్.హెచ్.ఆర్.సి).. ముఖ్యమంత్రి ఛైర్మన్గా, శాసనసభ స్పీకర్,శాసనమండలి ఛైర్మన్, హోం మంత్రి,ప్రతిపక్ష నాయకుడు (లేదా అత్యధిక ఎమ్మెల్యే స్థానాలు గెలిచిన మరో పార్టీ నాయకుడు) సభ్య లుగా గల ఎంపిక కమిటీ సిఫార్సు మేరకు గవర్నర్ నియమిస్తారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 19 నుంచి 35వ ఆర్టికల్ వరకు ప్రాథమిక హక్కుల గురించి సవివరంగా తెలియజేయబడింది. వాటినే మానవ హక్కులుగా పేర్కొనడం జరుగుతుంది. మానవ హక్కుల సంఘ పరిధి లో..బాలల హక్కులు, వయోవృద్ధుల హక్కులు,మహిళల హక్కులు, బాల కార్మికుల హక్కులు.,హెచ్ఐవి/ఎయిడ్స్ (పరిరక్షణనిరోధ చట్టం)2017, ప్రజారోగ్య పరిరక్షణ చట్టం తదితర చట్టాల పరిధిలో అంశాలు కూడా పరిశీలించి తగు ఆదేశాలు ఇచ్చే అవకాశం కూడా ఈచట్ట పరిధిలో ఉంది. మానవ హక్కుల ఉల్లంఘనల ఫిర్యాదులను నేరుగా స్వీకరిస్తుంది, ఫిర్యాదులు పోస్టు, కొరియర్, ఫ్యాక్స్, ఈమెయిల్ ద్వారా పంపవచ్చు. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆన్లైన్ల ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర కమిషన్లో




ఆన్లైన్లో సమర్పించే సదుపాయాలు అందుబాటులోకిరాలేదు. ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత కమిషన్ వాటిని పరిశోధిస్తుంది. ఉల్లంఘనలపై సిఫారసులను చేస్తుంది. అవసరమైన చర్యలు తీసుకుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి ప్రతిపక్ష నాయకులు నేటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ ప్రాజెక్టు ఎత్తు పెంచుతున్న సందర్భంగా మన తెలుగు రాష్ట్రాలకు నీరు అందక, రైతులు,ప్రజలు చాలా ఇబ్బందులు పడతారని తెలుగు రాష్ట్రాల భవిష్యత్తుని ఆలోచించి నాడు బాబ్లీ ప్రాజెక్టు సందర్శనకు వెళ్ళగా మహారాష్ట్ర ప్రభుత్వాధికారుల నిరంకుశ చర్యల వల్ల దాదాపు మూడు రోజుల పాటు చాలా ఇబ్బందులకు గురి కాగా అప్పుడు రాజమండ్రికి చెందిన విశ్వశామలం సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి టి.సురేష్ కుమార్,అధ్యక్షులు కోటిలింగేశ్వరరావులు ఓ ఫిర్యాదును జాతీయ మానవ హక్కుల కమిషన్‌కి ఫ్యాక్స్ ద్వారా.. సమర్పించి రాష్ట్ర క్యాబినెట్ మంత్రి హోదా పార్లమెంట్ సభ్యులు పై మహారాష్ట్ర ప్రభుత్వ అప్పటి పోలీసుల ప్రవర్తన పై చర్యలు తీసుకుని, రిలీఫ్ ఇవ్వాల్సిందిగా కోరడం జరిగింది. దానిపై స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ మహా రాష్ట్ర డీజీపీకి,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసి వెంటనే హైదరాబాదు చేరుకునే ఏర్పాట్లు చేయించింది.! అదే సందర్భంలో ఆ తదుపరి టిడిపి రాజ్యసభ సభ్యులు మైసూరారెడ్డి కూడా ఓ ఫిర్యాదును జాతీయ మానవ హక్కుల కమిషన్‌కి నేరుగా అందించారు.! జూన్ 2014లో హిమాచల్ ప్రదేశ్‌లో ఒక విషాద సంఘటన జరిగింది. హైదరాబాద్‌కు చెందిన 24 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు థలోట్ సమీపంలోని బియాస్ నదిలో కొట్టుకుపోయారు. ముందస్తు హెచ్చరిక లేకుండా లార్జీ ఆనకట్ట నుండి అకస్మాత్తుగా నీరు విడుదల కావడంతో విద్యార్థులు కొట్టుకుపోయారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా విచారణకు స్వీకరించి ప్రమాదంలో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారం వచ్చేలా చేసింది. సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో విద్యార్థులు 8 రోజులుగా నిద్ర ఆహారాలు మాని నిరాహార దీక్షలో పాల్గొన్న సందర్భంగా వారి ఆరోగ్యం బాగా క్షీణిస్తుందనే వార్తల నేపథ్యంలో రాజమండ్రికు చెందిన సామాజిక కార్యకర్త టి.సురేష్ కుమార్.. ఫ్యాక్స్ ద్వారా రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సుభాషన్ రెడ్డి గారికి ఫిర్యాదు చేయగా.. వెంటనే స్పందించిన కమిషన్ దీక్షలో ఉన్నవిద్యార్థులకి వైద్య సదుపాయాలు కల్పించి, వారిని కాపాడేలా చేసింది. ఈ మానవ హక్కుల కమిషన్ సభ్యులుగా నియామకంలో రాజకీయ పార్టీ చరిత్ర(రాజకీయపార్టీ సభ్యులుగా) ఉన్న వారిని నియమించకూడదని, అలాగే లాభదాయక పదవుల్లో ఉన్న వారు నియమింపబడకూడదని చట్టం నిర్దేశిస్తుంది.! సమ ర్థులు, సరైన వారు, సేవాభావం గలవారు, ఛైర్మన్గా, సభ్యులుగా నియామకం జరిపితే., అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణలో వారికి వెన్నుదన్నుగా ఉంటారనిప్రజల ఆశాభావం.కర్నూల్లో గల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో నేటికే వేలాదిగా వినతులు, ఫిర్యా దులు గత 14 నెలలుగా ఛైర్మన్, సభ్యులనియామకం జరగనికారణంగా అపరిష్కృతంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకుడు నారా లోకేష్‌లు సమర్థవంతంగా ప్రజారంజక పాలన అందిస్తున్న సందర్భంగా వెంటనే మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్, సభ్యులు నియమించి మరింత ప్రోత్సాహం అందించాలి. ●

# వక్ఫ్ సవరణచట్టంపై 3 అంశాలపైనే విచారణ!





## అభ్యంతరం తెలిపిన కపిల్‌సిబాల్, అభిషేక్ మనుసింఘ్వి

**న్యూఢిల్లీ, మే 20:** వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సిజెఐ బిఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాసితో కూడిన ధర్మాసనం మంగళవారంనాడు విచారణ జరిపింది. ఈ సందర్భంగా సిజెఐ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు ఆమోదించిన చట్టం రాజ్యాంగబద్ధమేననే భావన ఉందని, స్పష్టమైన సందర్భం వెల్లడి కానప్పుడు కోర్టులు జోక్యం చేసుకోకూడదని అన్నారు. మరీ ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదన్నారు. అంతకన్నా తాము చెప్పవలసిన అవసరం లేదని చెప్పారు. వక్ఫ్‌ను స్వాధీనం చేసుకోవడం ఈ చట్టం ఉద్దేశమని పిటిషనర్ల తరఫు లాయర్ కపిల్ సిబాల్ అన్నప్పుడు సిజెఐ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ చట్టంపై గత విచారణ సందర్భంగా, మూడు అంశాలపై మధ్యంతర ఆదేశాలు జారీ చేయడానికి వాదనలు వింటామని ధర్మాసనం పేర్కొంది. వాటిలో వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ కౌన్సిల్, స్టేట్ వక్ఫ్ బోర్డులకు ముస్లిమేతరుల నామినేషన్, వక్ఫ్ కింద ప్రభుత్వ భూముల గుర్తింపు వంటివి ఉన్నాయి. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించమని, ఈ మూడు అంశాలపై వెంటనే ఎలాంటి చర్యలు తీసుకోమని సుప్రీంకోర్టుకు గత విచారణలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది.

కాగా, మంగళవారం విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, వక్ఫ్ చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి విచారణను మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరారు. కోర్టు గుర్తించిన మూడు అంశాలకు తాము సమాధానం దాఖలు చేశామన్నారు.

అయితే ఇప్పుడు పిటిషనర్ల లిఖిత పూర్వక సమాధానాలు ఇతర అంశాలను ప్రస్తావించాయని, విచారణను ఈ మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరారు. ఇందుకు పిటిషనర్ల తరఫునహాజరైన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి అభ్యంతరం తెలిపారు. ఈ కేసును విచారించి, మధ్యంతర ఉపశమనం ఎక్కడ ఇవ్వచ్చో పరిశీలిస్తామని గత సిజెఐ (సంజీవ్ ఖాన్నా) చెప్పారని, అందువల్ల కేవలం మూడు అంశాలకే తాము పరిమితమవుతామని చెప్పలేమని అన్నారు. వక్ఫ్‌భూములను లాక్కోవడానికే చట్టం తెచ్చారని సిబాల్ వాదించారు. ఎలాంటి ప్రక్రియ లేకుండా వక్ఫ్ ఆస్తులను లాక్కోవడమే చట్టం ఉద్దేశమన్నారు. వక్ఫ్‌ను క్రియేట్ చేయాలంటూ ఒక వ్యక్తి కనీసం ఐదేళ్లు ఇస్లాంలో ఉండాలనే షరతును సిబాల్ ప్రస్తావించారు. నేను మరణశయ్యపై ఉండి వక్ఫ్ ఏర్పాటు చేయాలనుకుంటుంటే ముస్లింగా ఉన్నట్లు ప్రూవ్ చేసుకోవాలి. ఇది రాజ్యాంగ విరుద్ధం అని అన్నారు. ఇది ఖచ్చితంగా వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునే చట్టమేనని వాదించారు. సీజేఐ ఇందుకు స్పందిస్తూ, పార్లమెంటులో ఆమోదించిన చట్టానికి రాజ్యాంగబద్ధత ఉంటుందని, స్పష్టమైన సందర్భం వెల్లడికానప్పుడు కోర్టులు జోక్యం చేసుకోలేవని అన్నారు. ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితిలో ఇంతకంటే తాము ఏమీ చెప్పాలనుకోవడం లేదని స్పష్టం చేశారు. ఇంతకు ముందు ఏప్రిల్ 17న జరిగిన విచారణలో వక్ఫ్ బైయూజర్‌తో సహా ఏ వక్ఫ్ ఆస్తిని డీనోటిఫై చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీఇచ్చింది.

అలాగే, వక్ఫ్ బోర్డులలో కొత్త నియామకాలు చేపట్టబోమని సుప్రీం కోర్టుకు తెలిపింది. ఇదిలా ఉండగా మూడు అంశాల విషయానికి వస్తే వక్ఫ్ బై యూజర్ లేదంటే వక్ఫ్ బై డీడ్ కింద వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తొలగించే అధికారం. రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ ముస్లిమేతరులను నియమించడాన్ని ముస్లింలు వ్యతిరేకించడం రెండో అంశం కాగా. మూడో అంశం నిబంధనకు సంబంధించింది. సర్వే బాధ్యత సర్వే కమిషనర్ నుంచి కలెక్టర్ అధికారం ఇవ్వడంపై ముస్లిం సంఘాల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.



# గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం

## తాజా దాడుల్లో 60మంది పైగా మృతి

**గాజాసిటీ, మే 20:** గాజాలో ఇజ్రాయెల్ మారణ హోమాన్నిసృష్టిస్తోంది. గాజాలోని పలు ప్రాంతాలపై భీకర దాడులకు పాల్పడుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్‌కు వెళ్లకుండానే మధ్యప్రాచ్య పర్యటనను ముగించిన తర్వాత ఐడీఎఫ్ తమ దాడులకు మరింత తీవ్రతరం చేసింది. గాజాలోని నివాస ప్రాంతాలు, ఆసుపత్రులపై విరుచుకుపడుతోంది. సోమవారం రాత్రి కూడా ఉత్తర గాజా, డీర్ ఆల్ బలా, ఖాన్ యూనిస్ ఇజ్రాయెల్ దళాలు తమ దాడులను కొనసాగించాయి. ఈ దాడుల్లో దాదాపు 60 మందికిపైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్లు పాలస్తీనా ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. ఉత్తర గాజాలో జరిపిన వైమానిక దాడుల్లో 22 మంది, డీర్‌ఆల్ బలాపై జరిపిన దాడిలో 13 మంది, సమీపంలోని నుసెయిరాత్ శరణార్థి శిబిరంపై జరిగిన మరో దాడిలో 15 మంది, దక్షిణ నగరమైన ఖాన్ యూనిస్‌లో జరిగిన రెండు దాడుల్లో 10 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. హమాస్‌ను అంతమొందించి ఆ ఉగ్రసంస్థ చెరలో ఉన్న బందీలను విడుదల చేయడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ సేనలుతెలిపాయి.

మరోవైపు గాజాపోరు మొదలై నప్పటి నుంచి ప్రాణాలు కోల్పోయిన పాలస్తీని యుల సంఖ్య 55 వేలు దాటినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురైనప్పటి నుంచి గాజాలో 3వేల మందికిపైగా మరణించారు. ఇజ్రాయెల్ ప్రధాని గాజాస్ట్రిప్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు ప్రకటించారు.



మాలూరు రామస్వామి శ్రీనివాసన్ (ఫైల్)

## అణుఇంధన కమిషన్ మాజీ చైర్మన్ కన్నుమూత

**ఉదగమండళం, మే, 20:** మాజీ అణు శాస్త్రవేత్త, అటామిక్ ఎనర్జీ కమిషన్ మాజీ చైర్మన్ మాలూరు రామస్వామి శ్రీనివాసన్ మంగళవారం కన్నుమూశారు. ఆయన వయసు 95 ఏళ్లు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. స్వదేశీ అణ్వాయుధ కార్యక్రమ రూపకల్పనలో డాక్టర్ హోమీ బాబాతో కలిసి శ్రీనివాసన్ పనిచేశారు. ప్రతిష్టాత్మక పద్మ విభూషణ్ పౌర పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. శ్రీనివాసన్ మృతి పట్ల ప్రభుత్వం నివాళి అర్పించింది. శ్రీనివాసన్ బెంగుళూరులో జనవరి5, 1930లో జన్మించారు. సైన్స్ సబ్జెక్టుల్లో మైసూరు నుంచి ఇంటర్ చదివారు. 1950లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పొందారు. 1952లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. కెనడాలోని మాంట్రియల్‌లో ఉన్న మెక్‌గిల్ యూనివర్సిటీ నుంచి ఎంఫిల్ పూర్తిచేశారు. 1955లో ఆయనడిఎఇలో చేరాడు. తొలి అటామిక్ పవర్ స్టేషన్ నిర్మాణానికి 1959 ఆగస్టులో డాక్టర్ శ్రీనివాస్‌ను ప్రిన్సిపల్ ప్రాజెక్టు ఇంజినీర్‌గా నియమించారు. దేశ అణ్వాయుధ కార్యక్రమాల రూపకల్పన అతని నాయకత్వంలో సాగింది. దేశవ్యాప్తంగా నెలకొల్పిన న్యూక్లియర్ పవంట్ ప్రాజెక్టుల ప్లానింగ్, ఆపరేషన్స్ అన్నీ చూసుకున్నారు. 1987లో అటామిక్ ఎనర్జీకమిషన్‌చైర్మెన్‌గా, అణు ఇంధన శాఖకార్యదర్శిగానియమితుడయ్యారు. ఆయనకు 1984లో పద్మశ్రీ, 1990లో పద్మ భూషణ్, 2015లో పద్మవిభూషణ్ అందుకున్నారు.

## ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త జయంత్ నార్లికర్ కన్నుమూత

**పూణె, మే 20:** ప్రముఖ ఖగోళ, శాస్త్ర సాంకేతిక శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ జయంత్ విష్ణు నార్లికర్ మంగళవారం పూణేలో కన్నుమూశారు. ఆయన వయసు 87 సంవత్సరాలు. డాక్టర్ జయంత్ విష్ణు నార్లికర్ ప్రఖ్యాత ఖగోళ, సైన్స్ కమ్యూనికేషన్ శాస్త్రవేత్తగా ప్రసిద్ధి గాంచారు. ఆయనకు పద్మ విభూషణ్ పురస్కారం కూడా లభించింది. కుటుంబ వర్గాల సమాచారం ప్రకారం, డాక్టర్ నార్లికర్ మంగళవారం ఉదయం నిద్రలోనే మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. జూలై 19, 1938న జన్మించిన డాక్టర్ నార్లికర్ తన ప్రాథమిక విద్యను బనారస్ హిందూ విశ్వవిద్యాలయర్‌లో పూర్తి చేశారు. తర్వాత ఉన్నత విద్యను కేంబ్రిడ్జ్‌లో పూర్తి చేశారు. ఆ తర్వాత టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (1972-1989)లో చేరడానికి భారతదేశానికి తిరిగి వచ్చాడు. విష్ణు నార్లికర్ నాయకత్వంలో సైద్ధాంతిక ఖగోళ భౌతిక శాస్త్ర సమూహాన్ని విస్తరించారు. ఇది క్రమంగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. 1988లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డాక్టర్ నార్లికర్‌ను ప్రతిపాదిత ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్‌ని స్థాపించడానికి వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఆహ్వానించింది.

2003లో పదవీవిరమణ చేసేవరకు ఆయన డైరెక్టర్ పదవిలో కొనసాగారు. డాక్టర్ నార్లికర్‌కు 1965లో 26 ఏళ్లకు చిన్న వయసులోనే పద్మభూషణ్ లభించడం విశేషం. 2004లో ఆయనకు పద్మవిభూషణ్ లభించింది. 2011లో మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు రాష్ట్ర అత్యున్నత పౌర పురస్కారమైన మహారాష్ట్ర భూషణ్‌ను ప్రదానం చేసింది. 2014లో భారతదేశపు ప్రముఖ సాహిత్య సంస్థ సాహిత్య అకాడమీ, ప్రాంతీయ భాష (మరాఠీ) రచనలో అత్యున్నత పురస్కారానికి ఆయన ఆత్మకథను ఎంపిక చేసింది.

### వివాహేతరబంధంతో విడాకులు తీసుకున్న మహిళ

# భరణం పొందేందుకు అర్హతలేదు

## చత్తీస్‌గఢ్ హైకోర్టు సంచలన తీర్పు

**రాయ్‌పూర్, మే 20:** విడాకులు తీసుకున్న మహిళకు భరణానికి సంబంధించిన కేసులో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఓ సంచలన తీర్పును ఇచ్చింది. వివాహేతర సంబంధం కారణంగా తన మాజీ భర్త నుంచి విడాకులు తీసుకున్న మహిళ భరణం పొందటానికి అనర్హురాలని తీర్పునిచ్చింది. ఆమెకు నెలకు రూ.4,000 ఇవ్వాలని ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు కొట్టివేసింది. 2021లో తన భర్త ఇంటిని విడిచిపెట్టి 2019లో రాయ్‌పూర్‌లో హిందూ ఆచారాలతో వారిద్దరికీ వివాహం జరిగింది. అయితే భర్త తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారంటూ మార్చి 2021లో ఇంటిని విడిచిపెట్టి ఆమె వెళ్లిపోయారు. అనంతరం ఆమె భర్త తనతో క్రూరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ రాయ్‌పుర్ ఫ్యామిలీ కోర్టులో భరణం కేసు దాఖలు చేశారు. అయితే, దీనిపై స్పందించిన భర్త, తన తమ్ముడితో వివాహేతర సంబంధం పెట్టుకుందని ఆరోపిస్తూ భార్యతో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రశ్నించగా, తనను తప్పుడు కేసులో ఇరికిస్తానంటూ ఆమె బెదిరించిందని కూడా ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే దీనిపై విచారించిన ఫ్యామిలీ కోర్టు 2023 సెప్టెంబర్ 8న భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందని పేర్కొంటూ విడాకులు ఇవ్వాలని ఆదేశించింది. అనంతరం నవంబర్ 6న భార్యకు నెలవారీ భరణం రూ.4,000 చెల్లించాలని కోర్టు తీర్పునుచ్చింది. అయితే దీనిపై ఆమె సంతృప్తి చెందకుండా దానిని రూ.20,000కి పెంచాలని డిమాండ్ చేశారు. చివరికి ఫ్యామిలీ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఛత్తీస్‌గఢ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, భర్త తరఫున వాదించిన న్యాయవాదులు, ఆమెకు భరణం లభించదని హైకోర్టుకు తెలిపారు. తన క్లయింట్ భార్య, తన భర్త తమ్ముడితో వివాహేతర సంబంధం పెట్టుకున్నందున భరణానికి అనర్హురాలని కోర్టు ముందు చట్టబద్ధంగా నిరూపించారు. ఈక్రమంలోనే తీర్పునిచ్చిన కోర్టు, భర్తకు అనుకూలంగా విడాకులూ మంజూరు చేసింది. సెక్షన్ 125(4)లోని నిబంధనను పరిగణనలోకి తీసుకోకుండా భరణం ఉత్తర్వు జారీ చేశారంటూ భర్త తరఫున న్యాయవాది తెలిపారు. భర్త తరఫు న్యాయవాది వాదనతో హైకోర్టు అంగీకరించింది. భార్య వివాహేతర సంబంధం కారణంగా ఫ్యామిలీ కోర్టు విడాకులిచ్చిన నేపథ్యంలో ఆమె భరణం పొందడానికి అనర్హురాలు అనడానికి తగిన సాక్ష్యమవుతుందని హైకోర్టు పేర్కొంది. సివిల్ కోర్టు జారీ చేసిన ఆదేశానికి విరుద్ధంగా హైకోర్టు వేరే అభిప్రాయాన్ని తీసుకోవడం సాధ్యం కాదని పేర్కొంది. కాబట్టి ఫ్యామిలీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు భార్య వివాహేతర సంబంధంలో జీవిస్తున్నట్లు స్పష్టంగా నిరూపిస్తుందని చెప్పింది. అందువల్ల ఆమె భర్త నుంచి భరణం పొందేందుకు అనర్హురాలని హైకోర్టు అభిప్రాయపడింది.



## గోల్డ్ స్మగ్లింగ్‌కేసులో నటి రన్యారావుకు బెయిల్

**బెంగళూరు, మే 20:** గోల్డ్ స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యారావుతో పాటు తరుణ్ రాజ్ కొండూరుకు బెంగళూరు కోర్టు మంగళవారం బెయిల్ మంజూరుచేసింది. ఆర్థిక నేరాల ప్రత్యేకకోర్టు ఇద్దరికి షరతులతోకూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. రూ. 2లక్షల చొప్పున వ్యక్తిగత బాండ్, ఇద్దరి పూచీకత్తుతో బెయిల్‌ని ఇచ్చింది. అధికారులు పిలిచిన సమయంలో తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించొద్దని, దర్యాప్తు అధికారులకు సహకరించాలని, కోర్టు నుంచి ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని, ఇదేతరహాలో నేరాల్లో పాల్గొనొద్దని ఆదేశించింది. ఆదేశాలను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దవుతుందని హెచ్చరించింది.

## బైడెన్‌కు కేన్సర్ సోకితే ఎందుకు రహస్యం?: ట్రంప్

**వాషింగ్టన్, మే 20:** అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు కేన్సర్ నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. బైడెన్‌కు కేన్సర్ సోకిందనే విషయాన్ని ఆలస్యంగా బయటపెట్టడాన్ని ఆయన ప్రశ్నించారు. విలేకరులతోమాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలుచేశారు. బైడెన్‌కు ప్రొస్టేట్ కేన్సర్ నిర్ధారణ అయినట్లు ఆయన కార్యాలయం ఆదివారం ప్రకటించింది. ఈ కేన్సర్‌ను గ్లీసన్ స్కోరింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి అంచనా వేస్తారు. ఇందులో బైడెన్ స్కోరు 9 ఉన్నట్లు కార్యాలయం తెలిపింది.

దీనిపైనే తాజాగా ట్రంప్ మాట్లాడుతూ.. 'కేన్సర్ సోకిందన్న విషయం చాలా రోజుల తర్వాత తెలియడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. స్కోరు 9కు చేరుకోవడానికి చాలా సమయం పడుతోంది. బైడెన్ మానసికంగా ఆరోగ్యంగానే ఉన్నారని గతంలో అదే వైద్యుడు చెప్పారు. ఇది రాజకీయమైన అంశం కాదు.. ఇది మన దేశానికి ప్రమాదం. కేన్సర్ విషయం ఇప్పటివరకు ఎందుకు బయటకు చెప్పలేదు. ప్రజలకు దీని గురించి వాస్తవాలు తెలియాలి. కొందరు వాస్తవాలు చెప్పడంలేదు. ఇది మరో పెద్ద సమస్య' అని ట్రంప్ పేర్కొన్నారు.

# సాయం అందకపోతే గాజాలో 14వేల మంది చిన్నారులు మృత్యువాత

## ఐక్యరాజ్యసమితి మానవతాసాయం విభాగం హెచ్చరిక

**గాజాసిటీ, మే 20:** ఇజ్రాయెల్ భీకర దాడులతో గాజాలో పరిస్థితులు పూర్తి అధ్వాన్నస్థితికి చేరుకున్నాయి. ప్రజలజీవనంఅస్తవ్యస్థంగా మారింది. ఇప్పటికే గాజాను అన్నివైపులా నిర్బంధించిన ఇజ్రాయెల్‌పరిమిత స్థాయిలో మాత్రమే మానవతా సాయానికిఅనుమతిస్తోంది. ఆ ప్రాంతంలో ఆకలికేకలు మిన్నంటుతున్నాయి. ఈపరిస్థితిపై స్పందించిన ఐక్యరాజ్యసమితి మానవతాసాయం విభాగం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. సాయం ఇలాగే కొనసాగితే మరో రెండురోజుల్లో 14 వేల మంది చిన్నారులు మరణించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 11 వారాలక్రితం పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయెల్‌నిర్బంధించింది. అమెరికా, కెనడా, ఫ్రాన్స్, యుకె ఒత్తిడిచేయడంతో పరిమితస్థాయిలో గాజాలోకి మానవతా సాయాన్ని ఇజ్రాయెల్ అనుమతిస్తోంది. చిన్నారులతో సహా గాజావాసులకు ఇటీవల ఐదు ట్రక్కుల మానవతా సాయం మాత్రమే అందింది. వారికి మరింత సాయం అవసరమని లేదంటే 48 గంటల్లో 14 వేలమంది చిన్నారులు చనిపోయే ప్రమాదం ఉందని తెలిపింది. అక్కడున్న చిన్నపిల్లలు, తల్లులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని సమితిప్రతినిది టామ్ ఫ్లెచర్ హెచ్చరించారు.

మానవతాసాయం విషయంలో ఇజ్రాయెల్ తీరును బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలు తీవ్రంగా ఖండించాయి. గాజాకు మానవతా సాయంపై ఆంక్షలు వెనక్కితీసుకోకపోతే తామంతా ఉమ్మడి కార్యాచరణ తీసుకుంటామని హెచ్చరించాయి. తాజాగా ఇజ్రాయెల్ తీరుపై ఐక్యరాజ్య సమితికూడా స్పందించింది. పోషకాహారంతో కూడిన 100 ట్రక్కులసాయాన్ని గాజాలోకి అనుమతించాలని, చిన్నారుల ప్రాణాలు రక్షించాలని సూచించింది.

# ఇంటెలిజెన్స్ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు

**న్యూఢిల్లీ, మే 20:** ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్‌కుమార్ డేకా పదవీకాలం మరో ఏడాది పాటు పొడిగించారు. జూన్ 2026 వరకూ ఆయన డైరెక్టర్‌గా కొనసాగుతారని వ్యక్తిత్వ వికాసం, నియామకాల మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. 1988 బ్యాచ్ హిమాచల్ ప్రదేశ్‌కేడర్ ఐపిఎస్ అధికారి అయిన డేకా రెండేళ్ల కాలం పాటు పనిచేసేందుకు ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2022 జూన్‌నుంచి ఆయన ఈ పదవిలో ఉన్నారు. అంతకుముందు కూడా ఆయన ఏడాది కాలం పాటు అంటే2024 జూన్‌వరకూ పదవీకాలం పొడిగించారు. కేబినెట్ నియామకాల కమిటీ తపన్‌కుమార్ పదవీకాలం పొడిగించేందుకు ఆమోదం తెలిపింది. 2025 జూన్ 30 నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువ డేంత వరకూ ఆయన పదవీకాలం ఉంటుందని నియామకాలకమిటీ ఆమోదం తెలిపింది. ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రకార్యకలాపాలు తీవ్రస్థాయిలో కొనసాగిస్తున్న కాలంలోఆయన జాయింట్ డైరెక్టర్‌గా కొనసాగారు. పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్ దాడి, 2019 పుల్వామా దాడిలపైనా ఆయన నిఘా కార్యకలాపాలు కొనసాగించి సమగ్ర నివేదికలు ఇచ్చారు. జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదం, లోయలో జరుపుతున్న హత్యలపైనా ఆయనసమగ్ర నివేదికలు రూపొందించి కేంద్రాన్ని అప్రమత్తంచేసారు.

# అధికారులూ.. దుబారాకు చెక్ పెట్టండి..

## మద్యం, సిగరెట్ కట్ : చైనా ఆదేశం



**బీజింగ్, మే 20:** మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు చైనా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అందులో భాగంగా ప్రభుత్వంలోని అధికారులు ఖర్చులు తగ్గించుకోవాలని చైనా ప్రభుత్వం ఆదేశించింది. ప్రయాణాలు, మద్యం, సిగరెట్‌ఖర్చులు తగ్గించుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు అక్కడి అధికారిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వం ౹లోని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా అక్కడి ప్రభుత్వ అధికారులతో పాటు, అధికార పార్టీ నేతలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వాటి ప్రకారం ప్రయాణాలు, మద్యం, సిగరెట్, ఆహారం, కార్యాలయాల అద్దెలు వంటివి తగ్గించుకునేలా ప్రణాళికలు చేసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ వనరులను ఖర్చు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని కోరింది. దుబారాను తగ్గించాలని పేర్కొంది. ఈ దుబారా ఖర్చులు చేయడాన్ని సిగ్గుచేటుచర్యగా ప్రభుత్వం అభివర్ణించింది. ఇటీవల కాలంలో స్థిరాస్తి విక్రయాలకు సంబంధించిన ఆదాయం విషయంలో చైనా నష్టాలను చూస్తోంది. అంతేకాక స్థానిక ప్రభుత్వాలపై అప్పుల భారం కూడా పెరిగిపోయింది. ఈ క్రమంలో అధికారులు చేసే ఖర్చులతో ఒత్తిడి పెరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. స్థానిక ప్రభుత్వాల ఆర్థికవృద్ధిని మెరుగుపరచాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా అక్కడి అధికారులను ఖర్చులు తగ్గించుకోవాలని ఆదేశించింది.

# పంజాబ్ మూడు చెక్‌పోస్టులవద్ద బిఎస్‌ఎఫ్ బీటింగ్ రిట్రీట్ వేడుకలు



**ఛండీఘర్, మే 20:** భారత్‌పాకిస్థాన్‌లమధ్య నెలకొన్న ఉద్రిక్తతలకారణంగా నిలిపివేసిన బీటింగ్ రిట్రీట్ వేడుకలు మళ్లీ ప్రారంభం అయ్యాయి. మూడు జాయింట్ చెక్‌పోస్టులవద్ద కూడా కొనసాగినట్లు భారత్ ఆర్మీ తెలిపింది. పంజాబ్ ఫ్రాంటియర్‌లోని అమృత్‌సర్‌వద్ద అట్టారి, ఫిరోజ్‌పూర్‌లోని హుస్సేనీవాలా, ఫజిల్లాలోని సాద్‌కీ వద్ద ఈబీటింగ్ రిట్రీట్ వేడుకలు కేవలం మీడియా సిబ్బందికోసం నిర్వహించారు. ఇక సాధారణ ప్రజానీకం కూడా సందర్శించేందుకు ఈనెల 21వతేదీనుంచి అనుమతిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ కారణంగా బిఎస్‌ఎఫ్ అట్టారి సరిహద్దువద్ద ఈ బీటింగ్ వేడుకను నిలిపివేసింది. పహల్గాంవ్ ఉగ్రదాడి తర్వాత రెండుదేశాలమధ్య అత్యంత తీవ్రస్థాయి ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే ఈ వేడుకలో బిఎస్‌ఎఫ్‌దళాలు పాకిస్తాన్ రేంజర్స్‌తో కరచాలనంచేయడం కానీ, ఇరువైపులా గేట్లు తెరవడం కానీ, పతాకాలను అవనతం చేయడం కానీ ఉండవని బిఎస్‌ఎఫ్ తెలిపింది. ప్రజాబాహుళ్యం లేకుండానే జెండాలను అవనతంచేస్తారు. ఈనెల 8వ తేదీనుంచి బిఎస్‌ఎఫ్ ఈ మూడు జాయింట్ చెక్‌పోస్టులవద్ద ప్రజల సందర్శనను రద్దుచేసింది. పంజాబ్ కేబినెట్‌మంత్రి కులదీనప్‌సింగ్ ధలివాల్ షాపూర్ సరిహద్దుపోస్టును సందర్శించి అజ్నాలావద్ద బిఎస్‌ఎఫ్ అధికారులు, సిబ్బందిని కలిసి చర్చలుజరిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా వారిపొలాల్లో పనులుచేసుకునేందుకు అనుమతించాలని కోరారు.

# ఆపరేషన్ సిందూర్‌పై అఖిలపక్షం

## టిఎంసి ఎంపి యూసఫ్ పఠాన్ స్థానంలో అభిషేక్ బెనర్జీ



**కోల్‌కతా, మే 20:** ఉగ్రవాదంతో అంటకాగుతూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఉద్దేశించిన ఏడు బృందాలు విదేశాలకు వెళ్తున్న సంగతి తెలిసిందే. అందులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహరంపుర్‌కు ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్న యూసఫ్ పఠాన్‌ను కేంద్రం ఎంపిక చేయడాన్ని ఆ పార్టీ తప్పుబట్టడంతో ఆయన ఈ బృందం నుంచి తప్పుకొన్నారు. ఈ నేపథ్యంలో యూసఫ్ స్థానంలో పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీని ఆ పార్టీ ఎంపిక చేసింది. దీనిపై టిఎంసి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో తమ పార్టీ తరఫున అభిషేక్‌ను ఎంపిక చేయడం గర్వంగా భావిస్తున్నట్లు పేర్కొంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బెంగాల్ దృఢ వైఖరిని ఆయన ప్రతిబింబించడమే కాకుండా.. ప్రపంచ దేశాల్లో భారత ప్రజల సమష్టి స్వరాన్ని వినిపిస్తారని తెలిపింది.

ప్రతినిధి బృందంలో యూసఫ్ పేరును చేర్చడంపై అభిషేక్ బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, దేశాన్ని రక్షించడం వంటి జాతీయ భద్రత విషయాలపై తమ పార్టీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తుందని.. కానీ, తమను సంప్రదించకుండా పఠాన్‌ను దౌత్యబృందంలో చేర్చడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఒక పార్టీ ఎంపిని ఎంపిక చేసేటప్పుడు ఆ పార్టీతో సంప్రదింపులు జరపాలని కేంద్రానికి సూచించారు. ఈ వ్యాఖ్యలు చేసిన మరునాడే ఆయన పేరును పార్టీ తరఫున బృందంలో చేర్చడం గమనార్హం. పహల్గాం ఘటన నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచ దేశాలకు వివరించడానికి భారత్ దౌత్య యుద్ధం ప్రారంభించింది.

ఇందులో భాగంగా 51 మంది నేతలు 7 బృందాలుగా విదేశాల్లో పర్యటించనున్నారు. ఈ బృందాల్లో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, మాజీ ఎంపిలు, మంత్రులు దౌత్యవేత్తలు ఉన్నారు. ఒక్కో బృందంలో ఒక ముస్లిం నేత గాని, అధికారిగానీ ఉండేలా చర్యలు తీసుకున్నారు. 51 మందిలో 31 మంది ఎన్డీయే నేతలు, 20 మంది ఎన్డీయేతర పార్టీల నేతలున్నారు. 'ఒకే లక్ష్యం..ఒకే సందేశం.. ఒకే భారత్' పేరుతో ఈ పర్యటనలు సాగనున్నాయి.

# ఉత్తరాఖండ్‌లో విరిగిపడ్డ కొండచరియలు..

## ఆ మార్గంలో చిక్కుకుపోయిన యాత్రికులు!

**డెహ్రాడూన్, మే 20:** ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. పితోరాగఢ్ జిల్లా సమీపంలో కైలాస్-మానసరోవర్ యాత్ర మార్గంలో అవి విరిగిపడటంతో వందలాది యాత్రికులు చిక్కుకుపోయారు. వారితోపాటు స్థానికులు కూడా ఉన్నారు. ఆ మార్గాన్ని అందుబాటులోకి తెచ్చే విధంగా స్థానిక యంత్రాంగం సహాయక చర్యలు ప్రారంభించింది. శిథిలాలను తొలగించేందుకు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ బృందం అక్కడకు చేరుకుంది. తాజా ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు. పరిస్థితులు మెరుగుపడేవరకు యాత్రికులు అక్కడే ఉండాలని సూచించారు. అయిదేళ్లుగా నిలిచిపోయిన కైలాస్ మానస సరోవర్ యాత్రను ఈ యేడాది జూన్ నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం గత నెల అధికారికంగా ప్రకటించింది. జూన్ నుంచి ఆగస్టు వరకూ కొనసాగనున్న ఈ యాత్ర ఉత్తరాఖండ్, సిక్కింలలో ప్రారంభం కానుందని విదేశీ వ్యవహారాలశాఖ తెలిపింది. 50 మంది యాత్రికుల చొప్పున 5 బృందాలు ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ నుంచి 10 బృందాలు సిక్కిం నాథులాపాస్ నుంచి ఈయాత్రకు తరలి వెళ్తాయి అని వెల్లడించింది.

యాత్ర కోసం దరఖాస్తులను కంప్యూటర్ జనరేటెడ్‌విధానంఆధారంగా యాత్రికులను ఎంపిక చేస్తామని పేర్కొంది. కొవిడ్ కారణంగా కైలాస పర్వతం, మానస సరోవర్ సరస్సు యాత్ర 2020లో ఆగిపోయింది. గతేడాది రష్యాలో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల భేటీ అనంతరం ఇరు దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చే చర్యలు మొదలయ్యాయి. ఈక్రమంలోనే కైలాస్ మానస సరోవర్ యాత్రను తిరిగి ప్రారంభిస్తున్నారు.



## టంగుటూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత ఆశయాలను మనమంతా ముందుకు తీసుకువెళ్లాలని రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 69వ వర్ధంతి సందర్భంగా అసెంబ్లీ ముందున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ, స్వాతంత్ర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు సేవలను రాబోయే తరం గుర్తుంచుకోవాలన్నారు. ఆయన జీవిత ఆశయాలను మనమంతా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణిదేవి, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, వేణుగోపాలాచారి, తదితర నేతలు పాల్గొన్నారు.

## ఇద్దరు దివ్యాంగులు పెళ్లి చేసుకున్నా రూ.1 లక్ష ఆర్థిక సాయం

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరబాద్, మే 20, ప్రభాతవార్త:** దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం శుభ వార్త చెప్పింది. గతంలో ఒకరు దివ్యాంగులు, మరొకరు సాధారణ వ్యక్తి పెళ్లి చేసుకుంటేనే రూ. లక్ష ప్రోత్సాహం లభించేది. ఇద్దరు దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే వర్తించేది కాదు. ఈ సమస్య దశాబ్దాల కాలంగా ఉండగా తాజాగా మంత్రి సీతక్క చొరవతో దీనికి చెక్ పడింది. ఇద్దరికీ ప్రోత్సాహకం అందేలా కాంగ్రెస్ సర్కార్ జీవో జారీ చేసింది. ఇక నుంచి ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ. లక్ష ఆర్థిక సహాయం వర్తింపజేయాలని పేర్కొన్నది. ఈ మేరకు మంగళవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఆదేశాలు జారీ చేశారు.

## రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్‌ఆర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు గడువు పెంపు

### ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఎస్సి, ఎస్టి సొసైటీల్లో 6వ తరగతి నుంచి 9 వ తరగతి వరకు బ్యాక్ లాగ్ సీట్లతోపాటు 6వ తరగతిలో రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు అర్హత పొందిన విద్యార్థులు స్కూల్స్‌లో చేరడానికి గడువును పొడిగించారు. మంగళవారం(మే 20)తో గడువు ముగియడంతో ఈ నెల 25 వరకు చేరడానికి అవకాశం కల్పించినట్లు టిజిసెట్-2025 చీఫ్ కన్వీనర్ డాక్టర్ విఎస్ అలగు వర్షిణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశానికి ఫిబ్రవరి 23న నిర్వహించిన పరీక్ష ఫలితాలను ఏప్రిల్ 28న విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులు ఆయా పాఠశాలలో చేరేందుకు మంగళవారం(మే20) తుది గడువు కాగా, ఇప్పుడు గడువునుకాస్త ఈ నెల 25 వరకు పొడిగించడం జరిగిందని అలగు వర్షిణి ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అలాగే తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సి గురుకుల సొసైటీ అధ్వర్యంలో కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ సైనిక పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 23న పరీక్షను నిర్వహించారు. అర్హత పొందిన విద్యార్థులలో రుక్మా పూర్ సైనిక్ స్కూల్ లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను 1:10 చొప్పున ఎంపిక చేసి ఫిజికల్, మెడికల్ టెస్ట్‌లను ఈనెల మొదటి వారంలో నిర్వహించడం జరిగింది. మేడ్చెల్ మల్కాజ్ గిరి జిల్లా పరిధిలోని ఘట్‌కేసర్ దగ్గరగల ఏదులాబాద్ ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 23న పరీక్షను నిర్వహించడం జరిగింది.

## సైనికులపై చిల్లర కామెంట్స్ చేసిన ఘనత బిజెపిదే : మాజీ ఎంపి విహెచ్

**హైదరబాద్, మే 20, ప్రభాతవార్త:** సైనికులపై చిల్లర కామెంట్స్ చేసిన ఘనత బిజెపిది, చివరకు పాకిస్తాన్‌పై దాడి చేసి వచ్చిన సోఫియా ఖురేషీపై కూడా అభ్యంతర కరమైన వ్యాఖ్యలు బిజెపి మంత్రి చేయడం ఓట్లకోసం వారి దిగజారుడు రాజకీయం తేటతెల్లం అవుతోందని మాజీ రాజ్యసభ సభ్యుడు,మాజీ పిసిసి అధ్యక్షుడు వి.హను మంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గాంధీ భవన్‌లో మాజీ ఎంపీ విహెచ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఛీప్ పాలిటిక్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆపరేషన్ సింధూర్ ను రాజకీయం కోసం వాడుకుంటున్నారని అన్నారు. దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన ఫ్యామిలీ రాహుల్ గాంధీ కుటుంబం అని ఆయన గుర్తుచేశారు. దేశభక్తి కల్చర్ కాంగ్రెస్ పార్టీ కి ఉంది అని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ లో చిచ్చు పెట్టే ఆలోచన కిషన్ రెడ్డి చేయడం సిగ్గు చేటు అని విమర్శించారు. దేశంలో స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తీకరణ చేయలేని నియంతృత్వ పరిస్థితికి తీసుకొని వచ్చారని ఆయన ఆవేదన చెందారు.

## రేపటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

### జూన్ 3 వరకు కొనసాగింపు

### ఇంప్రూవ్‌మెంట్ కోసం 1,23,647 మంది దరఖాస్తు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన వారికి.. మొదటి సంవత్సరంలో ఇంప్రూవ్‌మెంట్ కోసం పరీక్షలు రాసే వారికోసం నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రేపటి(గురువారం) నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే ఇప్పటి వరకు రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఎన్ని పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారనే విషయాన్ని ఇంటర్ బోర్డు ప్రకటించ లేదు. రాష్ట్రంలో ఎన్ని పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులను వార్త ప్రతినిధి ఫోన్‌లో సంప్రదించినప్పటికీ ఉన్నతాధికారులు స్పందించ లేదు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రేపటి(మే 22 గురువారం) నుంచి జూన్ 3 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు జరగనుండగా.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు కొనసాగనున్నాయి. మార్చి 5 నుంచి 25 వరకు జరిగిన వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల్లో 2,89,907 మంది ఫీజు చెల్లించినట్టు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. అలాగే ఇంప్రూవ్‌మెంట్ కోసం 1,23,647 మంది దరఖాస్తు చేసుకున్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లను ఇంటర్ బోర్డు ఈ నెల 17న విడుదల చేసింది. రాష్ట్రంలో మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. మొదటి సంవత్సరంలో 4,88,430 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 3,22,191 మంది పాసయ్యారు. మరో 1,66,239 మంది ఫెయిలయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,08,582 మంది పరీక్షలకు హాజరు కాగా.. వారిలో 3,33,908 మంది ఉత్తీర్ణులయ్యారు.. మరో 1,74,674 మంది ఫెయిలయ్యారు.

# కిక్కిరిసిపోయిన త్రివేణి సంగమం

### 6వ రోజు భక్తుల రాకతో జనసంద్రమైన కాళేశ్వరం

### తాకిడి పెరగడంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం



**కాళేశ్వరం, మే 20, ప్రభాతవార్త:** 'కాళేశ్వర నివాసోవా, కాళేశ్వర నిరీక్షణం, కాళేశ్వరస్య స్మరణం సర్వపాప వినాశనం' అని స్తుతిస్తూ భక్తులు త్రివేణి సంగమ తీరాన పవిత్ర సరస్వతి పుష్కర స్నానాలు ఆచరిస్తున్నారు. 6వ రోజు కూడా త్రివేణి సంగమం భక్తుల రాకతో కిక్కిరిసిపోతోంది. సువిశాలంగా విస్తరించిన త్రివేణి సంగమంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు చేరుకుంటున్నారు. అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానమాచరించిన భక్తులు పునీతులై నీరాజనాలు అర్పిస్తున్నారు. 6వ రోజు కూడా భక్తుల తాకిడి తీవ్రంగా పెరగడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సేవలందించే విధుల్లో నిమగ్నం అయింది. త్రివేణి సంగమంలో ఏర్పాటు చేసిన పుష్కర ఘాట్ల వద్ద భక్తులు నది లోపలకు వెళ్లకుండా ఉండేందుకు, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు బారికేడ్లు, గజ ఈతగాళ్లు, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలను, బోట్లు అందుబాటులో ఉంచిన అధికారులు భక్తులు ప్రమాదాలకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

**6వ రోజు..**

పుష్కర నదికి మొదటి 12 రోజుల్లో ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఆ ప్రత్యేకత ననుసరించి భక్తులు దానం చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని పురణాలు చెప్తున్నాయి. ప్రకృతిలో భాగమైన నదుల వద్ద సహజత్వాన్ని పెంపొం దించేందుకు భక్తులు కూడా చొరవ తీసుకోవాలన్న సంకల్పంతోనే హైందవ ఆచారాలు పాటించాల్సి ఉంటుంది.

ప్రాకృత్య ధర్మానికి మించింది మరోటి లేదన్నది చేతల్లో చూపించేందుకే పూర్వీకులు ఈ సాంప్రాదాయాలను కొనసాగించే వారు. పుష్కర నది తీరంలో 6వ రోజున ఔషధ దానం, కర్పూర దానం, చందన దానం, కస్తూరి దానం చేయాలని పురణాలు వివరించాయి. ఈ రోజు పుష్కర సరస్వతి ఒడిలో పుణ్య స్నానాలు చేసిన భక్తులు దానాలు చేయడం మంచిదని చెప్తున్నాయి. 6వ రోజైన మంగళవారం తెలంగాణ, ఏపీ, చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు కాళేశ్వరం చేరుకుంటున్నారు.

# గుల్జార్‌హౌస్ మృతులకు ఎంపిలు, ఎమ్మెల్యే నివాళులు

### బాధిత కుటుంబసభ్యులను పరామర్శించిన ఈటల, కొండా, రాజాసింగ్

### ఒకే కుటుంబంలో 17 మంది చనిపోవడం బాధాకరం

### ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్



మృతులకు నివాళులర్పిస్తున్న ఎంపిలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు

**హైదరాబాద్ (అత్తాపూర్) మే 20, ప్రభాతవార్త :** ఒకే కుటుంబంలో 17 మంది చనిపోవడం బాధాకరమైన విషయమని ఎంపిలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పేర్కొన్నారు. పాతబస్తీ గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదంలో మరణించిన మోదీ అగర్వాల్ కుటుంబ సంతాప సభను మంగళవారం రాజేంద్రనగర్ పరిధిలోని ఎస్ఎన్‌సి కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ తొకల శ్రీనివాస్ రెడ్డిలు హాజరై మృతుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. చార్మినార్, గుల్జర్ హౌస్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి 17 మంది చనిపోవడం యావత్ సమాజాన్ని కలిచివేసిందనిఅగ్నిప్రమాదం ఏ సమయంలో జరిగింది, ఎన్ని గంటలకు ఫోన్ వెళ్ళింది, ఏ టైం కు రెస్క్యూ సిబ్బంది వచ్చారు అనే దానిపై ముఖ్యమంత్రిని రాజకీయాలకు, వివక్షకు ఆస్కారం లేకుండా సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చార్మినార్, బేగంబజార్, ఓల్డ్ సిటీలో నిర్మాణాలు ఎప్పుడో కట్టినవి కాబట్టి ఇలాంటి ఘటనలు మళ్ళీ మళ్ళీ జరగకుండా ఉండాలంటే ఒక సమగ్రమైన ప్రణాళిక చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలతో మీటింగ్ ఏర్పాటు చేసి పరిస్థితుల్ని ఎస్సెస్ చేసి ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలన్నారు. ఫైర్ డిపార్ట్మెంట్, వైద్య సిబ్బందిని 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఒకటే కుటుంబంలో 17 మంది చనిపోవడం అనేది చాలా బాధాకరం. ఆ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తున్నానని వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుం టున్నట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు, దుఃఖాలు మరొకరికి రాకూడదు అంటే ప్రభుత్వం సమగ్రమైన ప్రణాళిక రూపొం దించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ పేరుతో ఎంతమంది మావోయిస్టులను చంపి వేశారు? మరేంత మందిని చంపుతారు? అసలు కేంద్ర ప్రభుత్వం లక్ష్యం ఏమిటో శ్వేత ప్రతం విడుదల చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేనిసాంబశివరావు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను కేంద్ర బలగాలతోకలిసి రాష్ట్ర పోలీసులు సైతం పాల్గొంటున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంపై దాడిచేసి అమాయక ప్రజలను కాల్చి చంపిన ఉగ్రవాదులతో దౌత్య పరంగా చర్చలు జరుపుతామని ప్రకటించిన కేంద్రం.. దేశ పౌరులైన మావోయిస్టులు తాము శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించి ముందుకు వచ్చారని.. వారితో చర్చలు జరపాలని దేశమంతా కోరుతున్నారన్నారు. కేంద్రం మాత్రం ఆపరేషన్ కగార్ పేరుతో వారిని మట్టుపెడుతోందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన కేంద్ర పాలకులు.. ఇప్పుడు న్యాయ వ్యవస్థనుపై మాటల దాడి కొనసాగిస్తూ చులకన చేసే ప్రయత్నం చేస్తున్నారని కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్ధ వ్యవస్థల మధ్య హక్కులు, న్యాయపరమైన చిక్కులు తలెత్తినప్పుడు వాటిలో కల్గజేసుకునివాటిని పరిష్కరించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన గవర్నర్లు ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పాలనపరమైన ఇబ్బందులు కలిగిస్తూ ఫైళ్లను పరిష్కరించకుడా తొక్కిపెడుతున్న నేపథ్యంలో వాటిని ఎంతకాలంలో క్లియర్ చేస్తారో స్పష్టత ఇవ్వాలని సూచించిన సుప్రీంకోర్టును రాష్ట్రపతి సైతం తప్పు పట్టడం ఏమిటని కూనంనేని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. పాత సంక్షేమ పథకాల పరిస్థితి ఏమిటని.. వాటిని అరకొరగా అమలు చేయడంతో ప్రజల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అతిముఖ్యమైన పథకాలైన ఇళ్లతోపాటు రేషన్ కార్డులను త్వరితగతిన అందజేయాలన్నారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయనకు సముచిత గౌరవం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎదురుగా ఉన్న ప్రకాశం పంతులు విగ్రహం ఓ అనాద విగ్రహంగా ఉందని, ముఖ్యమైన ప్రదేశంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయనకు సమూచిత గౌరవం కల్పించాలని కోరారు. అదేవిధంగా కమ్యూనిస్టు దిగ్గజమైన మాజీఎంపి ధర్మ బిక్షం పేరును సూర్యపేట జిల్లాకు పెట్టాలని మరోసారి సిఎంకు విజ్ఞప్తి చేస్తున్నట్టు కూనంనేని సాంబశివరావు తెలిపారు.

# అక్రమంగా రవాణా చేస్తున్న ఎండుగంజాయి పట్టివేత

### ఐదుగురు నిందితులకు రిమాండ్

### 59 కిలోల సరకుతోపాటు కారు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం

**ఘట్‌కేసర్ రూరల్, మే 20, ప్రభాతవార్త:** కారులో అక్రమంగా తరలిస్తున్న 59 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించిన సంఘటన మంగళవారం ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భారీ ఎత్తున పట్టుబడిన ఎండు గంజాయి విషయమై రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. దశరథ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. సంఘటన వివరాలు ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. ముందస్తు విశ్వసనీయ సమాచారం మేరకు ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు సీఐ జూపల్లి రవి తన సిబ్బందితో కలిసి ఈనెల 19 వ తేది రాత్రి ఏడు గంటల సమయంలో ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా రెడ్ కలర్ బ్రిజా మారుతి కారును ఆపి తనిఖీ చేయగా అందులో 29 బ్యాగులు బ్యాగుకు రెండు కిలోల చొప్పున మొత్తం 59 కిలోల 88 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులను విచారించగా వారంతా కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ వాసులుగా తెలిపారు. పట్టుబడిన కారు కర్ణాటక రాష్ట్రానికి చెందినదిగా నెంబరు కెఎ 39 ఎం 2162గా తెలిపారు. అందులో ఎండు గంజాయి రవాణాచేస్తూ పట్టుబడిన వారిలో గోవింద్ తాప్‌సేల్ (36), గజానంద్ (21), పవన్ (25), ఆకాశ్ (32)లుగా తెలిపారు. వీరంతా కర్ణాటక లోని బీదర్ జిల్లా జైగావ్, శంశేర్‌పూర్ వాడీ వాసులుగా తెలిపారు. తోరత్ రాహుల్ (31) ఆదిలాబాద్‌లోని అంబేద్కర్‌నగర్ వాసిగా పోలీసులు తెలిపారు.



నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడిన నిందితుల వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ

# వరి జన్యుమార్పిడి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

### కేంద్రానికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి లేఖ

**హైదరాబాద్, మే 20,ప్రభాతవార్త:** వరి జన్యు మార్పిడి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, గతంలో మన్మోహన్ సింగ్ హయాంలో వంకాయ జన్యు మార్పిడి నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నామని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి లేఖ రాశారు. వరి జన్య మార్పిడికి కేంద్రం అనుమతించడాన్ని రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ తీవ్రంగా వ్యతిరేకించింది. వరి జన్యు మార్పిడి విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం అత్యంత తీవ్రమైన ప్రమాదకరమైన నిర్ణయంగా అభివర్ణించారు. ఈ నిర్ణయం వల్ల దేశంలో ఉన్న ఫుడ్ సిస్టమ్ పై ప్రభావం చూపుతుందన్నారు. గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా వున్నప్పుడు ఆహార పంట అయినా వంకాయ జన్య మార్పిడిని కాంగ్రెస్ వ్యతిరేకించిందని గుర్తుచేశారు. అప్పటి దేశ ప్రధాని మన్మోహన్ సింగ్ రాష్ట్ర రైతాంగం అభిప్రాయాన్ని మన్నించి ఆ ప్రయత్నాన్ని ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్రం లో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎవరిని సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు.

వరి ధాన్యాన్ని ఎక్కువ ఉత్పత్తి చేసే రాష్ట్రం తెలంగాణ అని ఇక్కడి రాష్ట్ర రైతాంగం తరుపున రైతు కమిషన్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల బియ్యం ఆహారంగా తినే వినియోగదారుడిపై కూడా తీవ్రమైన ప్రభావం పడ్తుందని, ఎక్కువ శాతం వరి పండించే తెలంగాణపై ఈ నిర్ణయంతో తీవ్రమైన ఆర్థిక ప్రభావం పడుతుందని చైర్మన్ కోదండరెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. అంతేకాదు విత్తన హక్కుకు కూడా భంగం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత కీలకమైన ఈ నిర్ణయం తీసుకోకముందు రాష్ట్ర అభిప్రాయం తీసుకోకపోవడం బాధాకరమని ఆవేదన లేఖలో వ్యక్తం చేశారు.

అంతేకాదు వినియోగదారులను పరిగణలోకి తీసుకోకపోవడం తీవ్రమైన విషయంగా కమిషన్ పరిగణిస్తుందన్నారు. దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని భారతదేశ వ్యవసాయము రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు.

## పుష్కరాల్లో సరస్వతి నవరత్నమాల హారతి ప్రత్యక్ష ప్రసారం

**హైదరబాద్, మే 20, ప్రభాతవార్త:** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఉన్న సరస్వతి నవరత్నమాల హారతి ఘట్టాన్ని ప్రతీ రోజూ ప్రత్యక్ష ప్రసారం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు మంగళవారం నుంచే ఈ హారతి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ప్రతీ రోజు సాయంత్రం నిర్వహించే సరస్వతి హారతిని ఇవ్వడానికి, కాశీలో అత్యంత ప్రజాదరణ పొందిన గంగా హారతినిచ్చే పండితులను ప్రత్యేకంగా ప్రభుత్వం పిలిపించింది. దాదాపు అరగంట పాటు సాగే సరస్వతి నవరత్నమాల హారతిలో తొమ్మిది (ఓంకార హారతి, నాగహారతి, పంచహారతి, సూర్యహారతి, చంద్రహారతి, నంది హారతి, సింహహారతి, కుంభహారతి, నక్షత్రహారతి) ప్రత్యేక హారతులను ఇస్తారు.

## కాళేశ్వరం అవినీతిలో కెసిఆర్, హరీశ్, ఈటలకు జైలుకెళ్లే అర్హతలున్నాయి

### కిషన్‌రెడ్డి వంటి వారితో ఈ ప్రాంతానికి నష్టం

### ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్య

**హైదరాబాద్,మే 20,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఊరికినే భట్ట కాల్చి మీద వేయదు, రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చట్టానికి ఎవరు అతీతులు కాదు కాళేశ్వరం అవినీతిలో కెసిఆర్, ఈటెల, హరీష్‌రావు వీళ్ళ ముగ్గురికి జైలుకి వెళ్ళడానికి అన్ని అర్హతలు ఉన్నాయని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ ఈటెల రాజేందర్ గుడ్డిగా ఆర్థిక అనుమతులు ఎలా ఇచ్చారని అన్నారు. కేసీఆర్ విచారణకు హాజరై తన నిజాయితీ నిరూపించుకుంటే పూలదండలు వేస్తాం అని అన్నారు. కాళేశ్వరం ఆనాటి సిఎం, ఇరిగేషన్, ఆర్థిక మంత్రి వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామిక కోణంలో నిర్ణయం తీసుకుంటుంది, అందుకే కమిషన్ వేశామని అన్నారు. ఈటెల రాజేందర్ ని కేసీఆర్ కావాలనే బిజెపి లోకి పంపారా?? అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈటెల రాజేందర్ తప్పు చేసి బిఆర్ఎస్ నుంచి బిజెపిలోకి వచ్చారా? ఇప్పుడు బిజెపి వారిని కాపాడుతుందా? తప్పు ఎవరు చేసిన జైలుకి వెళ్ళాల్సిందే అని అద్దంకి అన్నారు. తెలంగాణ దొంగలకు దొంగల దొడ్డిగా మార్చారని ఆయన ఆగ్రహం చెందారు. మేడిగడ్డ వద్ద 3 ఏళ్లలో ఒక్కపిల్లర్ పోతే ఏం అవుతుంది అని కేసీఆర్ అంటున్నాడు నాగార్జున సాగర్, శ్రీశైలం ఎందుకు ఒక్క పిల్లర్ కూడా కూలలేదు అని గుర్తుచేశారు. గతంలో గవర్నర్ కాళేశ్వరరావు అన్నారు ఇప్పుడు కూలగానే నోవేశ్వర్ రావు అంటున్నాడు. కాంగ్రెస్ బిఆర్ఎస్ ఒకటి అవుతార అందుకే అరెస్టు చేయడం లేదని ఇన్నాళ్ళుఅభియోగం మోపారని . ఇప్పుడు మీ నాయకుడు అరెస్టు అయ్యేజాబితాలో ఉన్నారని గుర్తుచేశారు. ఈటెల సీల్డ్ కవర్లో ఏదో దాచిపెట్టారో అని అది రాలేదు అనే నోరు జరారని అద్దంకి అన్నారు. బిజెపి పార్టీని ప్రశ్నిస్తే దేశ ద్రోహులవుతారా అని ఆయన ప్రశ్నించారు. బిజెపి పార్టీ దేశ స్వాతంత్ర్య పోరాటానికి సంబంధం ఏంటి? కిషన్ రెడ్డి లాంటి బానిసలు ఉండబట్టే ఈ ప్రాంతానికి తీవ్ర నష్టం అని అన్నారు. బిజెపి అంటే బూతు జనతా పార్టీ అని కొత్త భాష్యం చెప్పారు.



కేంద్ర రీజినల్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా నేతలు

## కొత్త నాలుగు కార్మిక కోడ్‌లను రద్దుచేసి 29 పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

### కేంద్ర కార్మిక సంఘాల భారీ ధర్నా

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దుర్మార్గపు కొత్త నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేసి పాత 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా నేతలు ఎస్. బాలరాజ్ (ఏఐటీయూసీ) పాలడుగు భాస్కర్ (సిఐటియు), కె. సూర్యం (టియుసిఐ), ఎం. శ్రీనివాస్ (ఐ.ఎఫ్. టి.యు), ఆర్.డి. చంద్ర శేఖర్ (ఐ.ఎన్.టి.యు.సి), పశ్య పద్మ (తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం), టి. సాగర్ (తెలంగాణ రైతు సంఘం) లు డిమాండ్ చేసారు. నాలుగు కార్మిక కోడ్‌లు మరియు స్థిరకాలిక ఉపాధి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, పని ప్రదేశంలో సమానత్వం, భద్రతను కల్పించాలని, రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేసి పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విద్యానగర్, కేంద్ర రీజినల్ లేబర్ కమీషనర్ కార్యాలయం వద్ద వేలాదిమంది కార్మికులు, రైతులతో భారీ ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు, జండాలు చేతబూని నాలుగు కార్మిక కోడ్‌లు, రైతువ్యతేరేక చట్టాలను రద్దు చేయాలనీ, పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని పెద్దఎత్తున వారు పెద్దఎత్తున నినాదాలు చేసారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కేంద్ర రీజినల్ లేబర్ కమీషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్. బాలరాజ్ మాట్లాడుతూ పాత 29 కార్మిక చట్టాలలో ట్రేడ్ యూనియన్ చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, వృత్తి భద్రత మరియు ఆరోగ్యంపై చట్టం, కాంట్రాక్ట్ కార్మిక చట్టం, అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం, సమాన వేతన చట్టం, ప్రసూతి ప్రయోజన చట్టం మొదలైనవి ఉన్నాయని, వీటిని నియంతృత్వ మోదీ ప్రభుత్వం రద్దు చేసి, బదులుగా కొత్తగా 4 కోడ్లను తీసుకొచ్చిందని, కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధమైన ఈ 4 కోడ్లను వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ వ్యవస్థీకృత కార్మికులకు నెలవారీ కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి అమలు చేయాలనీ కోరారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ నేతలు పి. ప్రేమపావని, ఏం. నరసింహా, బి. వెంకటేశం, కమతం యాదగిరి, బొడ్డుపల్లి కిషన్, ఏం. ప్రవీణ్ కుమార్, సిఐటియు నేతలు జె. వెంకటేష్, కుమారస్వామి, ఈశ్వర్ రావు, టియుసిఐ నేతలు ఎస్ఎల్. పద్మ, లింగం గౌడ్, శ్రీనివాస్, ఐ.ఎఫ్.టి.యు నేతలు జి. అనురాధ, ఐ.ఎన్.టి.యు.సి నేతలు విజయ్‌కుమార్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మినీ అంగన్‌వాడీలకు పెంచిన వేతనాలు తగ్గించడం సరికాదు

### సిఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 20:** తెలంగాణలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మినీ అంగన్‌వాడీలను పూర్తిస్థాయి అంగన్‌వాడీలుగా గుర్తించి, వారికి పెంచిన వేతనం పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న 3,989 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నిరుపేద వర్గాలకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారని హరీశ్ రావు తన లేఖలో గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారి సేవలను గుర్తించి, 2023 సెప్టెంబర్ 5వ తేదీన వారిని అంగన్‌వాడీలుగా ప్రమోట్ చేస్తూ జీవో జారీ చేసిందని తెలిపారు. అయితే, ఎన్నికల కోడ్ కారణంగా ఆ ఉత్తర్వులు అప్పట్లో అమలు కాలేదని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా సీతక్క బాధ్యతలు స్వీకరించి, మినీ అంగన్‌వాడీలను అంగన్‌వాడీలుగా గుర్తిస్తూ మొదటి సంతకం చేశారని హరీశ్ రావు పేర్కొన్నారు. వాస్తవానికి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవోనే మళ్లీ కొత్తగా ప్రచారం కోసం విడుదల చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. 2024 జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల పాటు మినీ అంగన్‌వాడీలకు అంగన్‌వాడీ పే గ్రేడ్ ప్రకారం రూ.13,650 వేతనం చెల్లించిన ప్రభుత్వం, ఆ తర్వాత మళ్లీ వారి వేతనాన్ని మినీ అంగన్‌వాడీ స్కేల్ అయిన రూ.7,800కి తగ్గించిందని హరీశ్ రావు విమర్శించారు.

## మినీ అంగన్‌వాడీలకు అన్యాయం చేసింది హరీశ్‌రావే: మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త :** ఆర్థిక మంత్రిగా మిని అంగన్వాడీలకు అన్యాయం చేసింది హరీష్ రావే అని పంచాయితీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. మీరు ఇచ్చిన జీవోలతో అంగన్వాడీలకు ఒరిగిందేమి లేదన్న సీతక్కమీ మొక్కుబడి జీవోల చిక్కుముడులు చేధించి పకడ్బందిగా అమలు చేస్తున్నాన్నారు. అంగన్వాడీ టీచర్ల జీతాలపై సిఎంకు మాజీ మంత్రి హరీష్ రావు రాసిన బహిరంగ లేఖపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా మినీ అంగన్ వాడి టీచర్ల పట్ల బాధ్యత ఉంటే.. పదేళ్లలో వారిని మెయిన్ అంగన్‌వాడీలుగా ఎందుకు పదోన్నతులు కల్పించ లేదని హరీష్ రావును ప్రశ్నించారు. ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా ఎన్నికల ముందు మొక్కుబడి జీవోలు ఇచ్చి చేతులు దులుపుకున్న చరిత్ర మీదని మండిపడ్డారు. ఆర్థిక మంత్రిగా ఉండి మిని అంగన్వాడీలకు పదోన్నతులు రాకుండా అన్యాయం చేసింది హరీష్ రావేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు మీకు పట్టని మినీ అంగన్‌వాడీల సమస్యలు.. అధికారం పోగానే గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. "ఓట్ల కోసమే అప్పట్లో జీవోలు ఇచ్చి చేతులు దులుపుకున్నరన్న ఆమె ఆ జీవోలు ఓట్ల జీవోలే అన్నారు. ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా జారీ చేసిన జీవోలు పనికి రాకుండా పోయాయి అన్న మంత్రి సీతక్క ఇప్పుడు తాము జివోలను చట్టబద్ధంగా, పకడ్బందీగా అమలు చేసి చూపిస్తున్నామన్నారు. మీరు అంగన్‌వాడీలను మోసం చేస్తే... తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే చట్ట బద్ధంగా, ఆర్థిక శాఖ అనుమతులతో 3438 మంది మినీ అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతులు కల్పించామన్నారు. ఎన్నో చిక్కుముడులని చేదించి, భవిష్యత్తులో ఏలాంటి న్యాయపరమైన అడ్డంకులు తలెత్తకుండా.. ఏప్రిల్ 2025లోనే ఈ ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేసి, ఈ నెల నుంచే మెయిన్ అంగన్‌వాడీల తరహాలోనే మిని అంగన్‌వాడీలకు జీతాలు చెల్లిస్తున్నా మన్నారు. మిన్ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసి.. టీచర్లుకు తోడుగా హెల్పర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. పదేళ్లు మీ పాలన వల్ల బాధపడ్డ ప్రజలకు హరీష్ రావు బహిరంగ క్షమాపణ చేబితే బాగుంటుం దన్నారు. బహిరంగ లేఖ రాయడం కన్నా.. అంతరాత్మను ప్రశ్నించు కోవాలని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## మిస్‌వరల్డ్ పోటీదారులను అంబేద్కర్ విగ్రహం వద్దకు ఎందుకు తీసుకెళ్లలేదు?

### బోయినపల్లి వినోద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 20:** మిస్ వరల్డ్ పోటీదారులను 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్దకు ఎందుకు తీసుకెళ్లలేదని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో బోయినపల్లి వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. అంబేద్కర్ జీవిత చరిత్రను మిస్ వరల్డ్ పోటీదారులకు వివరించాలి. రేవంత్‌రెడ్డి చేసిన తప్పిదాన్ని సరిచేసు కోవాలి. జూన్ 2న మిస్‌వరల్డ్ విజేతలు, పోటీదారులను గవర్నర్ వద్దకు తీసుకువెళ్లే ముందు అమరజ్యోతిని చూపించాలి అని వినోద్ కుమార్ సూచించారు. ప్రపంచంలోనే గొప్పగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించుకున్నాం.. ఆ అంబేద్కర్ విగ్రహాన్ని మాత్రం మిస్‌వరల్డ్ పోటీదా రులకు చూపించకుండా రేవంత్‌రెడ్డి విస్మరించారని వినోద్ కుమార్ మండిపడ్డారు. కాళేశ్వరం కమీషన్ నోటీసులపై వినోద్ కుమార్ స్పందించారు.

## అండర్‌కవర్ ఏజెంట్లకోసం ఐఎస్ఐ 'జ్యోతి అస్త్రం'!

**న్యూఢిల్లీ, మే 20:** గూఢచర్యం కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో కొత్త కొత్తవిషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పాకిస్థానీ ఏజెంట్లతో ఆమె క్రమం తప్పకుండా సంప్రదింపులు జరిపిందని, వాటిని రహస్యంగా ఉంచేందుకు పలు ఎన్‌క్రిప్ట్ చేసిన ప్లాట్‌ఫారమ్‌లను వినియోగించినట్లు విచారణలో తేలింది. స్నాప్‌చాట్, టెలిగ్రామ్, వాట్సాప్‌లో కోడ్ ల్యాంగ్వేజ్‌లో మాట్లాడుకున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. తమ కస్టడీలో ఉన్న జ్యోతిపై దర్యాప్తు అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌తో సంబంధాలు, అంతర్జాతీయ పర్యటనలు, సమాచార బదిలీ గురించి ఎన్ఐఏ, ఇంటెలిజెన్స్ బ్యూరో లోతుగా ప్రశ్నిస్తోంది. జ్యోతి పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్, దుబాయ్ పర్యటనలపై కూడా ఆరాతీస్తున్నారు. భారత్‌లోని అండర్‌కవర్ ఏజెంట్లను గుర్తించేందుకు పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఐఎస్ఐ ఆమెను వినియోగించినట్లు రూఢి అయింది. అలీహసన్ అనే ఐఎస్ఐ హ్యాండ్లర్‌తో నిత్యం సంప్రదింపులు జరిపింది. ప్రోటోకాల్, అండర్‌కవర్ అనే పదాలు వీరి చాటింగ్‌లో ఎక్కువ వినిపించినట్లు అధికారులు నిర్ధారించారు. పాకిస్థాన్ - ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దు వరకు ఆమె సంబంధాలను ఏర్పరచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఢిల్లీలో పాక్ రాయబారి డానిష్‌తో సంబంధాలపై ఆమె బుకాయించినట్లు తెలిసింది. కమిషన్ ఏజెంట్ల ద్వారా వీసా పొందిన జ్యోతి 2023లో వైశాఖి పండుగ కోసం పాక్‌ను సందర్శించింది. ఆమె ఎవరికీ అనుమానం రాకుండా పాక్ అధికారులకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు తేలింది.

# వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

### రాష్ట్రస్థాయి సమావేశంలో మంత్రి సీతక్క



**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ, ప్రజలఅభివృద్ధి కోణంలో వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోనీ మంత్రి సీతక్క కార్యాలయంలో మంత్రి ఆధ్వర్యంలో వాల్టా రాష్ట్రస్థాయి అథారిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వాల్టా అథారిటీలను నియమించి సహజ వనరులను దుర్వినియోగం చేయకుండా, అవసరం మేరకే వినియోగించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నీటిని అధికంగా వినియోగించడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్న మంత్రి నీటి దుర్వినియోగంపై అన్ని శాఖలు దృష్టి సారించాలి నిపుణులు, శాస్త్రవేత్తలు పర్యావరణ వేత్తలతో కలిసి విధానాలు రూపొందించాలన్నారు. నీటిని సంరక్షించాలని ప్రజలకు అవగాహన కల్పించాలని అందుకోసం ప్రభుత్వ పాఠశాలలను, మార్కెట్ యార్డులను, రైతు వేదికలను ప్రచార కేంద్రాలుగా వాడుకోవాలన్నారు. మన శరీరంలో నీరు తగ్గిపోతే మన ప్రాణాలకే గండం, అదేవిధంగా భూగర్భంలో నీరు అడుగంటితే మానవాళికి ప్రమాదమన్నారు. మొక్కుబడి గా అవగాహన కార్యక్రమాలు చేయడం వల్ల ఉపయోగం లేదన్న మంత్రి గత 10 సంవత్సరాల్లో వాల్టా అథారిటీ సమావేశాలు నిర్వహించకపోవడం అన్యాయమన్నారు. పర్యావరణం, హరిత తెలంగాణ అని పెద్ద పెద్ద మాటలు చెప్పారే తప్ప ప్రణాళిక బద్ధంగా పర్యావరణాన్ని కాపాడుకునేందుకు కృషి చేయలేదని విమర్శించారు. వాల్టా చట్టం పై వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని విస్తృతంగా పెంచాలన్నారు. నీటిని అధికంగా వినియోగిస్తున్నారని కొన్ని ప్రాంతాలపై ఆంక్షలు పెడితే ఉపయోగం ఉండదు, కొత్తగా బోర్లు వేయవద్దని అధికారులు ఆంక్షలు పెట్టినా ప్రజలు అంగీకరించే పరిస్థితి ఉండదని, అందుకే నీటి కొరత తలెత్తితే జరిగే ప్రమాదంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. భవిష్యత్తు తరాల కోసం నీటిని అవసరం ఉన్నంత మేరకు వినియోగించేలా కళాకారులతో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అన్ని స్థాయిల్లో వాల్టా వాలంటీర్లు క్రియాశీలం చేయాలన్నారు. ఎంపీలు ఎమ్మెల్యేలు స్థానిక అధికారులతో కమిటీలు వేసి సమావేశాలు పెట్టి ప్రతి మూడు నెలలకు ఒకసారి విధిగా వాల్టా అథారిటీలు సమావేశం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోతున్న గ్రామాల్లో ఏ స్థాయిలో జలాలు ఉన్నాయో జనాలకు తెలిసెలా చేయాలన్నారు. భూగర్భ జలాల స్థాయిని గ్రీన్, ఆరెంజ్, రెడ్ జోన్ గా విభజించి గ్రామాలు ఏ జోన్లో ఉన్నాయో గ్రామ పంచాయతీ గోడల మీద రాయాలన్నారు. ప్రత్యేకంగా వాల్టా నిదిని ఏర్పాటు చేస్తాం పర్యావరణ హితం కోసం వాల్టానిధిని ఖర్చు చేస్తామని, పర్యావరణ చట్టాలను ఉల్లంఘిస్తున్న వారి పై చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. భవిష్యత్ తరాల కోసం పర్యావరణహితం కోసం వాల్టా చట్టాన్ని అమలు చేస్తామన్న మంత్రి సీతక్క ఆకుపచ్చ తెలంగాణ కోసం, పాడి పంటల తెలంగాణ కోసం వాల్టా చట్టాన్ని అమలు చేస్తామన్నారు. వాల్టా, ప్రజల ప్రయోజనాలు వేరు కాదు, ప్రజలు, రైతుల సంక్షేమ కోణంలో వాల్టా చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాస్థాయి, డివిజనల్ స్థాయి, మండల స్థాయి వాల్టా అథారిటీల ఏర్పాటు చేయాలని, భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో తగ్గుతున్న గ్రామాల్లో, పట్టణాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానిం చారు. ఈ సమావేశంలో వాల్టా అఫిషియో సభ్యులు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ కార్యదర్శి లోకేష్ కుమార్, డైరెక్టర్ సృజన, స్పెషల్ కమిషనర్ షఫీ ఉల్లా, ప్రముఖ పర్యావరణ వేత్త దుశ్చర్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర సహకార బ్యాంక్ ఆడిట్‌పై అసహనం

### వ్యవసాయ సహకార సంఘాల పునర్వ్యవస్థీకరణ

### అధికారులపై చర్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త :** రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా అపెక్స్ (తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్), సహకార సంఘాల ఆడిట్ ఎందుకు జరగలేదని ఆడిట్ అధికారులపై వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరావు అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత ఆడిట్ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సహకార శాఖ కమిషనర్ ను ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని సహకార సంఘాలను ఆడిట్ చేయాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పిఎసిఎస్) సీఈఓల బదిలీలపై సర్కార్ ఇప్పటికే వెసులుబాటు కల్పించిందని, తదనుగుణంగా స్టేట్ లెవల్ కమిటీ ద్వారా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొత్తగా ప్రతిపాదించిన సహకార సంఘాలను పరిశీలించి, రైతులకు ఉపయోగపడే



విధంగా నిబంధనలకు అనుగుణంగా తుదిజాబితా తయారుచేయాలన్నారు. అలాగే 311 సహకార సంఘాలను ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పిఒ) లుగా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పిఎసిఎస్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డిసిసిబి)లకు సంబంధించి ఎంక్వైరీ పూర్తయి, సర్ చార్జీ ఉత్తర్వులు జారీచేయడమైనదని, దానిలో భాగంగా ఇప్పటివరకు 6 కోట్ల 38 లక్షల రివకరి పూర్తి అయిందని, ఇంకా 19 కోట్లు రికవరీ చేయాల్సి ఉందని, అలాగే 74 సర్ చార్జ్ లు పెండింగ్ ఉన్నాయని వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నాబార్డ్, ఆర్ఐడిఎఫ్ నిధులతో కొత్తగా గోదాములు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణంతో పాటు, ఇప్పటికే ఉన్న వాటి సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. రైతు బజార్లలో సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు వాటిలో రైతులు మాత్రమే ఉత్పత్తులను అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మార్కెట్ యార్డుల పునర్విభజన నిమిత్తం వచ్చిన ప్రతిపాదనల్లో నిబంధనలకు అనుగుణంగా ఉన్నవాటిని వెంటనే ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే మే నెలాఖరు వరకు 2 లక్షల మట్టి నమూనాల సేకరణ పూర్తి చేసి, వాటి ఫలితాలు రెండు నెలలలోపు రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరీక్షల ఆధారంగా ఎలాంటి పంటలు వేయాలో రైతులకు తెలియజేయాలని ఆదేశించారు.



## సిఎస్కేను ఉతికి ఆరేసిన రాజస్థాన్

### ఆరు వికెట్ల తేడాతో రాయల్స్ విక్టరీ

**న్యూఢిల్లీ, మే 20:** ఐపీఎల్ 18వ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ చివరి లీగ్ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న కుర్రాడు వైభవ్ సూర్యవంశీ(57) అర్ధ శతకంతో విరుచుకుపడగా కెప్టెన్ సంజూ శాంసన్(41) సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. అశ్విన్ వీళ్లిద్దరిని ఒకే ఓవర్లో ఔట్ చేసి చెన్నైని పోటీలోకి తెచ్చాడు. ధ్రువ్ జురెల్(31 నాటౌట్), హిట్‌మైర్(12 నాటౌట్) ధనాధన్ ఆడి జట్టును విజయ తీరాలకు చేర్చారు. పద్దెనిమిదో ఎడిషన్‌ను రాజస్థాన్ రాయల్స్ విజయంతో ముగించింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను 6 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. 188 పరుగుల ఛేదనలో ఓపెనర్ యశస్వీ జైస్వాల్(36) దంచి కొట్టాడు. అతడిని అన్షుల్ బౌల్డ్ చేసి సీఎస్కేకి బ్రేకిచ్చాడు. ఆ తర్వాత కెప్టెన్ సంజూ శాంసన్(41), వైభవ్ సూర్యవంశీ(57)లు మరో వికెట్ పడకుండా చూసుకున్నారు. అన్షుల్ వేసిన 6 వ ఓవర్ చివరి బంతిని వైభవ్.. చక్కని కవర్ డ్రైవ్‌తో బౌండరీకి తరలించడంతో రాజస్థాన్ పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 56 పరుగులు చేసింది. పవర్ ప్లే జడేజా బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాదడంతో రాజస్థాన్ స్కోర్ 100 దాటింది. నూర్ అహ్మద్ ఓవర్లో భారీ సిక్సర్‌తో రఘువంశీ అర్ధ శతకం సాధించాడు. బంతుల్లోనే 4 ఫోర్లు, 4 సిక్సర్లతో ఫిఫ్టీకి చేరువ య్యాడు. వీళ్లిద్దరి మెరుపులతో గెలుపు దిశగా దూసుకెళ్లుతున్న రాజస్థాన్‌ను అశ్విన్ దెబ్బకొట్టాడు. ఒకే ఓవర్లో శాంసన్, వైభవ్‌ను ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. రియాన్ పరాగ్(3)ను నూర్ అహ్మద్ ఔట్ చేసి సంజూ సేనను మరింత ఒత్తిడిలోకి నెట్టాడు. అశ్విన్ బౌలింగ్‌లో ధ్రువ్ జురెల్(31 నాటౌట్), హెట్‌మైర్(12 నాటౌట్)లు చెరొకి సిక్సర్ బాదడంతో రాజస్థాన్ విజయం ఖరారయింది. పథిరన బౌలింగ్‌లో తొలి బంతినే జురెల్ స్టాండ్స్‌లోకి పంపగా రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. మాత్రే, బ్రెవిస్ మెరుపులతో నామమాత్రపు పోరులో మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్‌కు వరుస షాక్‌లు తగిలాయి. రాజస్థాన్ రాయల్స్ పేసర్ యుధ్‌వీర్ సింగ్(3-47) చెలరేగగా డెవాన్ కాన్వే(10), ఉర్విల్ పటేల్(0) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. అయితే.. 12 పరుగులకే రెండు వికెట్లు పడినా ఓపెనర్ ఆయుష్ మాత్రే(45) మెరుపు బ్యాటింగ్‌తో స్కోర్ బోర్డును ఉరికించాడు. అయితే.. రాజస్థాన్ బౌలర్ల ధాటికి జడేజా(1), అశ్విన్(13)లు పెవిలియన్ చేరారు. 78 పరుగులకే 5 వికెట్లు పడిన దశలో డెవాల్డ్ బ్రెవిస్(42), శివం దూబే(39) ఆరో వికెట్‌కు 59 రన్స్ జోడించి ఆదుకున్నారు.

## హెడ్-టు-హెడ్ ఛాలెంజ్‌లో పాల్గొన్న మిస్‌వరల్డ్ పోటీదారులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే20:** 72వ మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా హెడ్-టు-హెడ్ ఛాలెంజ్ టీ-హబ్‌లో విజయవంతంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన పోటీదారులు బ్యూటీ విత్ పర్పస్‌లో భాగంగా తమ సామాజిక కోణాన్ని, మెరుగైన ప్రపంచం కోసం తమ ఆశయాలను పంచుకున్నారు. అంతేకాకుండా పోటీదారులు విస్తృత సామాజిక అంశాలపై దృష్టి సారించారు.
బాలల విద్య, పర్యా వరణం, ప్రకృతి పరిరక్షణ, యువతుల మద్దతు, చిన్న సమాజిక వర్గాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, కౌమార దశలో ఆందోళన, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించడం, భాషా పరిరక్షణ, పిల్లలో హింస, సౌరశక్తి వినియోగం, ప్లాస్టిక్ కాలుష్యం, లింగ ఆధారిత హింస, బాలలపై లైంగిక వేధింపులు, ప్రత్యేక వర్గాల విద్య, ఆర్థిక సంక్షోభాలు, ఆటిజం, మాదక ద్రవ్య వ్యతిరేక విద్య వంటి అనేక ముఖ్యమైన ప్రపంచ, స్థానిక సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మంగళవారం(మే 20) ఆమెరికా, కరేబియన్, ఆఫ్రికా ఖండాలకు చెందిన సుందరీమణులు తమ ప్రదర్శనలు ఇవ్వగా. బుధవారం(మే21) యూరప్, ఆసియా ఖండాల ప్రతినిధులు పాల్గొననున్నారు.
అందాల భామలు తమకు మనసుకు నచ్చిన అంశాలను మాట్లాడటానికి, సమాజంలో మంచి మార్పునకు లీడర్‌షిప్ కమిట్‌మెంట్లపై వారికి అవకాశం లభించింది. మిస్ వరల్డ్ పోటీకి ప్రధాన అంశంపై హెడ్-టు-హెడ్ ఛాలెంజ్, మానవతా విలువలపై ప్రపంచ దృష్టిని ఆకర్శిస్తుంది. విద్య, ఆరోగ్య సంరక్షణ నుంచి వాతావరణ మార్పులు, సమాజ అభివృద్ధికి వివిధ సమస్యలను పరిష్కరించడానికి బ్యూటీస్‌కు ఈ వేదిక చాలా కీలకమైనది. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ చైర్మన్, సీఈవో జూలియా మోర్లే మాట్లాడుతూ హెడ్-టు-హెడ్ ఛాలెంజ్ కేవలం ఒక పోటీ కాదని, ధైర్యం, కరుణ, సంకల్పానికి ఒక వేదిక అన్నారు. ఈ యువతులు ప్రపంచ వేదికపైకి తీసుకొచ్చిన కథలు నన్ను ఎంతగానో ప్రేరేపించాయన్నారు. దూరదృష్టి గల తెలంగాణలో దీనిని నిర్వహించడం ఈ కార్యక్రమానికి మరింత ఆర్థాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

## సరిహద్దుల్లో మొహరించిన అదనపు బలగాలు వెనక్కి!




**న్యూఢిల్లీ, మే 20:** సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా తరలించిన తమతమ బలగాలను ఈనెలాఖరుకల్లా యధాస్థానాలకు పంపించేందుకు రెండుదేశాలు అంగీకరించినట్లు పాకిస్తాన్ మిలిటరీ అధికారి ఒకరు వెల్లడించారు. నాలుగురోజుల వివాదంలో పాకిస్తాన్‌పరంగా సుమారు 70 మంది చనిపోయారని తేలింది. పహల్గాంలో పర్యాటకులు, అమాయ కులపై బుల్లెట్ల వర్షంకురిపించిన ఉగ్రమూకల దాడిఘటన తర్వాత రెండుదేశాలమధ్య భారీ ఎత్తున దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ సింధూర్‌పేరిట నిర్వహించిన దాడులతో పాక్ బెంబేలెత్తిపోయిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడులను పాక్ ప్రోత్సహిస్తోందని, ఉగ్రమూకలకు ఆశ్రయం కల్పిస్తోందని ముందు నుంచీ పాకిస్తాన్ వాదిస్తున్న సంగతి తెలిసిందే. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు చివరకు డ్రోన్లు, క్షిపణులు, వైమానిక దాడులవరకూ వెళ్లాయి. అమెరికా అధ్యక్షుడు ఆకస్మికంగా కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటిం చడం వంటి సంఘటనలు ఒకదానివెంట ఒకటి జరిగిపోయాయి. ఇపుడు బలగాలు ఈ ఘర్షణలకు ముందున్న ప్రాంతాలకు తరలిపోతున్నాయని, మే చివరినాటికిమొత్తం తరలింపు ప్రక్రియ పూర్తవుతుందని పాకిస్తాన్‌కు చెందిన సీనియర్ మిలిటరీ అధికారి ఒకరు తెలిపారు. రెండుదేశాలు కూడా దశలవారీగా అదనపు బలగాల ఉపసంహరణకు అంగీకరించాయని, అలాగే ఆయుధాలను భారీ ఆయుధసామగ్రిని కూడాతరలించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. కాశ్మీర్‌సరిహద్దుల్లో అంటే వాస్తవాధీనరేఖవెంబడి ఇటీవలికాలంలో భారీ ఎత్తున మిలిటరీ మొహరింపు జరిగిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్‌తోపాటు బారత్ కూడా అదనపు బలగాలను తగ్గించుకుని యధాస్థితి మొహరింపునకు అంగీకరించిందని ఆ సీనియర్ అధికారి తెలిపారు. ఈ తరలింపు మొత్తం పదిరోజుల్లో పూర్తవుతుందన్నారు. కొన్ని చిన్నపాటి సమస్యలు జాప్యానికి కారణం అవుతున్నట్లు తెలిపారు. కాశ్మీర్ మాదేనంటూ పాకిస్తాన్ కొన్ని దశాబ్దాలుగా పాకులాడుతున్న సంగతి తెలిసిందే. ముస్లిం మెజార్టీ ఉన్న ఈప్రాంతంపై 1947నుంచి కూడా పోరాడుతూనే వస్తోంది. తాజా వివాదం మే ఏడో తేదీ భారత్ ఒక్కసారిగా ఆపరేషన్ సింధూర్ పేరిట జరిపిన దాడులతో తీవ్రతరం అయింది. పాక్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను మట్టుపెట్టేసింది. పాకిస్తాన్‌వైపునుంచి కూడా కొన్ని దాడులు జరిగినా భారత్ ముందు నెగ్గకురాలేకపోయాయని చెప్పాల్సిందే.




## బిఐఎస్ఐ ప్రతిష్టను కాపాడాలి

### ఆ శాఖ అధిపతి శ్రీకాంత్

**హైదరాబాద్, మే 20,ప్రభాతవార్త :** బిఐఎస్ఐ మార్కుకు ఉన్న ప్రతిష్టను కాపాడటంతోపాటు, వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందించడం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా భావించాలని బిఐఎస్ హైదరాబాద్ శాఖ అధిపతి పివి శ్రీకాంత్ అన్నారు. నూతనంగా లైసెన్సులు పొందిన పరిశ్రమల నిర్వాహక్కులు, క్వాల్టీ ఇన్‌ఛార్జులకు బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బిఐఎస్) మంగళవారం మోలాలీలోని కార్యాలయంలో హైదరాబాద్‌శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ప్రతినెలా జరుగుతున్న ఈ కార్యక్రమంలో నూతనంగా బిఐఎస్ లైసెన్సులు పొందిన సంస్థలకు. భారతీయ ప్రమాణాలు పాటించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బిఐఎస్ నిబంధనలు, బిఐఎస్ డిజిటల్ వేదికల వివరాలను చెబుతున్నామన్నారు.

# ఉపాధ్యాయులు కాలానుగుణంగా బోధనా పద్ధతులను అలవర్చుకోవాలి

### విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

### శిక్షణా కార్యక్రమంలో విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా

### 24 వరకు కొనసాగనున్న శిక్షణా తరగతులు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కాలానుగుణంగా తమ బోధనా పద్ధతులను మెరుగు పరుచుకోవాలని విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. ప్రభుత్వ పాఠశాలల మీద నమ్మకం కలిగేలా బోధన ఉండాలన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకి రెండో విడత శిక్షణా తరగతులు మంగళవారం నుంచి ప్రారంభం కాగా.. శిక్షణా తరగతులను ప్రారంభించిన అనంతరం జూమ్ మీటింగ్‌లో యోగితా రాణా ఉపాధ్యాయులతో మాట్లాడారు. మొదటి విడత శిక్షణా తరగతులు ఈ నెల 13 నుంచి 17 వరు జరగగా రాష్ట్రంలోని 17,771 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. రెండో విడత శిక్షణ మంగళవారం ప్రారంభం కాగా.. ఈ నెల 24 వరకు ఐదు రోజులపాటు కొనసాగనుంది. రెండో విడతలో 89,378 మంది ఉపాధ్యాయులు పాల్గొన నున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 550 మండల కేంద్రాల్లో జరుగుతున్న టీచర్ల 5 రోజుల శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాలు పెంచాలని.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించుటకు దేశం లోనే తొలిసారిగా వేసవి సెలవుల్లో టీచర్ల కి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యా శాఖ కార్యదర్శి సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు వివిధ అంశాల్లో నైపుణ్యాలతో బోధన పద్ధతులు ఉపయోగించి విద్యా వ్యవస్థ బలోపేతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఉపాధ్యాయులందరూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని .. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగు పరచాలన్నారు. టీచర్లందరూ ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేసి తద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని విద్యాప్రమాణాల పరంగా ముందువరుసలో నిలబెడతారనే నమ్మకం, విశ్వాసం ఉందన్నారు. చాలా మంది టీచర్లు వారి బెస్ట్ ప్రాక్టిసెస్ ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచారని.. తద్వారా పాఠశాలలో అడ్మిషన్లను కూడా పెంచారన్నారు. అందుకు రంగయ్య, రవిరాజు, భవాని టీచర్లే ఉదాహరణ అని పేర్కొన్నారు. బెస్ట్ ప్రాక్టిసెస్‌ను అమలుచేస్తున్న టీచర్స్ నుండి వివరాలు సేకరించి, వారితో త్వరలో రాష్ట్రస్థాయిలో సమ్మేళనం నిర్వహించబోతున్నామని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు పెంచడానికి ఫౌండేషనల్ లిటరసి అండ్ న్యూమరసి (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమానికి అత్యధిక ప్రాముఖ్యతనిచ్చి విద్యార్థులందరూ ధారాళంగా చదవడం, రాయడంతోపాటు చతుర్విధ ప్రక్రియలు చేయడం లో ఉపాధ్యాయులందరూ ప్రత్యేక దృష్టి సారించాలని యోగితా రాణా ఉపాధ్యాయులను ఆదేశించారు.
ఈ శిక్షణ కార్యక్రమంలో ఎటువంటి ఇబ్బంది రాకుండా టీచర్లు అందరికీ అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించాని డిఈవోలను, శిక్షణా కేంద్రాల ఇన్‌చార్జిలను ఆదేశించారు. టీచర్ల యొక్క హాజరు, ఫీడ్ బ్యాక్ మొబైల్ అప్ ద్వారా సేకరించడం జరుగుతుందని.. శిక్షణ ముగిసిన తరువాత సర్టిఫికెట్ కూడా ఐదు రోజుల తర్వాత ఆటోమేటిక్‌గా మొబైల్ యాప్‌లోనే జనరేట్ అవుతుందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న 1,22,000 మంది టీచర్లకు ఒకేసారి ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బోధనా సమయం వృధా కాకుండా వేసవి సెలవుల్లో నిర్వహించుకోవడం, దానికి అందరు ఉపాధ్యాయులు సహకరించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం
ఫోన్ నం. 0878-2243438, ఫ్యాక్స్ నం. 0878-2240624, ఇ-మెయిల్ : knrcmnr@rediffmail.com
'ఇ'- ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నిట్ నెం. E1/DB/MCK/8201/215/MCK/2025-26 తేది: 19.05.2025
మునిసిపల్ సాధారణ నిధులు క్రింద 2025 F.Y బక్రీద్ పండుగ కొరకు 05 నం.ల యొక్క తాత్కాలిక ఏర్పాట్లు- మొత్తం అంచనా ధర: రూ.11.71 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 21.05.2025, సా.4.00గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 28.05.2025 సా.4గం. తదుపరి వివరాలు www.tender.telangana.gov.in వెబ్‌సైట్ వద్ద చూడవచ్చును.
DIPR.NO. 2166-PP/CL/ADVT/1/2025-26 తేది: 20.05.2025 సం/-. కమిషనర్, కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్.

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు
(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)
తేది: 20.05.2025
రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి ప్రజా పాలన పార్టీ అధ్యక్షులు అయిన శ్రీ దుగ్గిరాల నాగేశ్వరరావు గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీ దుగ్గిరాల నాగేశ్వరరావు (అధ్యక్షులు) గారు (2) శ్రీ కోనింటి పవన్ కళ్యాణ్ (ప్రధాన కార్యదర్శి) గారు (3) శ్రీ అద్దంకి చెన్నకేశవులు (కోశాధికారి) గారు ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము 1-9-290/B/A అడిక్మెట్, రాంనగర్ గుండు, లలితానగర్, న్యూ నల్లకుంట, హైదరాబాద్, తెలంగాణ. సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C. గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల వరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు ప్రజా పాలన పార్టీను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.
అధ్యక్షులు/సంతకం
ప్రజా పాలన పార్టీ.

# 'భైరవం' నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలుస్తుంది..మంచు మనోజ్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుత స్పందనతో, పాజిటివ్ బజ్‌తో ముందుకు దూసుకెల్తుతోంది. విజయ్ కనకమేడల దర్శకత్వంలో, శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ భారీ నిర్మించారు. ఈ సినిమా మే 30న వేసవి సీజన్‌లో బిగ్గెస్ట్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మనోజ్ మంచు విలేకరుల సమా వేశంలో సినిమావిశేషాలు పంచుకున్నారు.



**భైరవం జర్నీ ఎలా స్టార్ట్ అయింది?** ఒక సినిమా ఈవెంట్‌కి వెళ్ళినప్పుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కలిశారు. డైరెక్టర్ విజయ్ నన్ను కలవాలని అనుకుంటున్నారని చెప్పారు. అలా ఫోన్ నెంబర్ ఇవ్వడం జరిగింది. విజయ్ ఈ కథగురించి చెప్పారు. నాకు చాలా నచ్చింది. ఇమ్మీడియట్‌గా ఓకేచేశాను.

**ఈ సినిమాలో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?** గజపతి వర్మ లాంటి క్యారెక్టర్ ఇప్పటివరకు నేను చేయలేదు. చాలా ఇంటెన్స్ అండ్ ఫెరోషియస్ క్యారెక్టర్. భైరవం తప్పకుండా నా కెరియర్‌లో చాలా ప్రత్యేకంగా నిలుస్తుంది.సాయి నాకు తమ్ముడు లానే వాడు. రోహిత్ నాకు మంచి ఫ్రెండ్. ఈ సినిమా వలన మీ ముగ్గురు ఎక్కువ టైం స్పెండ్ చేసాము.

**నాన్న నుంచి మీరు ఏం నేర్చుకున్నారు?** నమ్మినోల్ని బాగా చూసుకోవడం, పదిమందికి హెల్ప్ చేయడం. ఆయన కష్టపడుతూ పైకి వచ్చారు. ఆయన ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. నిజాయితీగా ఉండడం ఆయన దగ్గరే చూసి నేర్చుకున్నాను. నాకు మా ఫాదరే హీరో.

**మీరు మంచిగా బిర్యాని వండు తారని అతిథి శంకర గారు చెప్పారు?** హాస్టల్లో ఉండే వాళ్ళం కాబట్టి వంట చేయడం అలవాటు. అలా సెట్స్‌లో ఉండే టప్పుడు కూడా కొంచెం సమయం దొరికితే వంట చేయ డం మొదలు పెట్టే వాళ్ళం. అలాగే రోహిత్ కూడా చాలా మంచి వంట చేస్తారు.

**మీరు సోలోగా ఎప్పుడు వస్తున్నారు?** అహం బ్రహ్మాస్మి సోలోగా వద్దామని చేసుకున్న కథ. అయితే అది కొన్ని కారణాల వల్ల కుదరలేదు.

**డైరెక్టర్ విజయ్‌కనకమెడల గురించి?** విజయ్ తెలుగు ఆడియన్స్ పల్స్ మీద చాలా మంచి గ్రిప్ ఉంది. అన్ని కమర్షి యల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాని ప్రజెంట్ చేశారు. గరుడన్ సినిమా చూసిన వాళ్లు కూడా ఈ సినిమా చూస్తే చాలా సర్ప్రైజ్ అవుతారు. తన మీద చాలా గౌరవం పెరిగింది. ఆయన లాంటి డైరెక్టర్స్ మరింత మంది రావాలి.

# 'వార్ 2' టీమ్ టీజర్ విడుదల

ఎన్టీఆర్ - హృతిక్ రోషన్ కలయికలో రాబోతున్న మోస్ట్‌వాంటెడ్ పాన్ ఇండియా మల్టీస్టారర్ వార్ 2. ఈ సినిమా ఆగస్టు 14, 2025న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఐతే, ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా వార్ 2 టీమ్ టీజర్‌ను విడుదల చేసింది. ఇందులో ఎన్టీఆర్ పవర్ ఫుల్‌గా కనిపించారు. నా గురించి తెలియదేమో.. ఇప్పుడు తెలుసుకుంటావ్.. గెట్ రెడీ ఫర్ ద వార్ అంటూ ఎన్టీఆర్ డైలాగ్, యాక్షన్ సన్నివేశాలతో ఉన్న ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. ఇక రెండో పాటను హృతిక్ ఎన్టీఆర్‌పై షూట్ చేయనున్నారు. వచ్చే నెల హృతిక్‌తారక్‌పై ఈ సాంగ్‌ను 7 రోజుల పాటు షూట్ చేస్తారట, ఈ సాంగ్‌లో తారక్ స్టెప్స్ అదిరిపోతాయని తెలుస్తోంది. కాగా, మోస్ట్ వాంటెడ్ పాన్



ఇండియా మల్టీస్టారర్స్‌లో వార్ 2 ఫస్ట్ ప్లేస్‌లో ఉంటుంది. పైగా ఎన్టీఆర్ - హృతిక్ రోషన్ కలయిక అనగానే ఆడియన్స్‌లో కూడా భారీగా అంచనాలు పెరిగిపోయాయి. ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్రపై ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. నిర్మాత ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కియారా అద్వానీ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తోంది.

# సోషల్ మీడియాలో రాశీ ఖన్నా గాయపడిన ఫోటో..

స్టార్ హీరోయిన్ రాశీఖన్నా తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆమెనే సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ ఫొటోల్లో రాశీఖన్నా తన ముక్కు నుంచి రక్తం కారుతుంది. అలాగే, రాశీఖన్నా కాళ్లకు, చేతులకు కూడా దెబ్బలు తగిలి రక్తం కారుతూ ఉంది. ఓ సినిమా షూటింగ్‌లో రిస్కీ యాక్షన్ సీన్స్‌లో రాశీఖన్నా పాల్గొంది. అందువల్లే ఆమెకు ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో ఫర్జీ2 అనే వెబ్ సిరీస్‌లో యాక్ట్ చేస్తోంది. అన్నట్టు రీసెంట్‌గా హీరోయిన్ రాశీఖన్నా తన పెళ్లి గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాశీ ఖన్నా తన మ్యారేజ్ ప్లాన్స్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేస్తూ.. నా పెళ్లిపై కొన్ని రూమర్స్ వినిపిస్తు న్నాయి. అవి నిజం కాదు. ఐతే, నాకు పెళ్లి చేసుకుని పిల్లల్ని కనాలని ఉంది. కానీ నా పెళ్లికి ఇంకా సమయం ఉంది. అయినా, నా పెళ్లి అనేది నా పర్సనల్ మ్యాటర్. కాబట్టి ఇక్కడ దాని గురించి డిస్కస్ చేయాలను కోవడం నాకు ఇష్టం లేద్దు అంటూ రాశీఖన్నా తెలిపింది.





# 'హరిహర వీరమల్లు' కి కీరవాణి సంగీతం భేష్

**మనలోని పౌరుషం..** వీరత్వం ఎన్నటికీ చల్లబడిపోకూడదు అని ప్రతి ఒక్కరినీ తట్టిలేపే సలసల మరిగే నీలోని రక్తమే...అని పాటకు సంగీత, సాహిత్యాలతో ప్రాణం పోశారు శ్రీ కీరవాణి గారు. హరిహర వీరమల్లులో ఈ గీతం వినిపిస్తుంది. నేటి పరిస్థితులలో మనందరిలో వీరత్వం చేవజారిపోకూడదని చర్నాకోలతో చెప్పినట్లు అనిపించింది. ఈ పాటను 21వ తేదీన అందరికీ విన్పించబోతున్నారు. హరిహర వీరమల్లు చిత్రానికి కీరవాణి అందించిన సంగీతం, నేపథ్య సంగీతం ఆ చిత్ర కథలోని భావోద్వేగాలను శిఖర స్థాయికి తీసుకువెళ్తాయి. ఈ సినిమా కోసం ఎంత తపన చెంది స్వరాలు అందించారో స్వయంగా చూశాను. వీరమల్లుకి ప్రాణం పోశారు అంటే అతిశయోక్తి కాదు. మొదటిసారి మీతో చేస్తున్నాను అంటే... అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. అందుకు తగ్గట్టు ఉండాలి కద్దా అనడం కీరవాణిలో అంకిత భావాన్ని తెలియచేస్తోంది. ఆస్కార్ గ్రహీత కీరవాణిని కలిసి సాగించిన సంభాషణ ఎంతో సంతోషాన్ని కలిగించింది. సంగీత దర్శకులు చక్రవర్తి దగ్గర శిష్యరికం నుంచి సరస్వతి పుత్రులైన శ్రీ వేటూరి సుందర రామమూర్తి, శ్రీ సిరివెన్నెల సీతా రామశాస్త్రి వరకూ తనకున్న అనుబంధాన్ని, సంగీత సాహిత్యాల గురించి చెబుతుంటే సమయం తెలియలేదు. కీరవాణి దగ్గర ఉన్న వయొలిన్లు చూసి వాటి గురించి మాట్లాడుకొంటున్నప్పుడు - నేను వయొలిన్ నేర్చుకోవడం, జంట స్వరాల వరకూ నేర్చుకొని వదిలేయడం గుర్తు చేసుకున్నాను. చిదంబరనాథన్ ఇచ్చిన వయొలిన్ ను ఎంత భద్రంగా దాచుకున్నారో చూపించారు కీరవాణి. తెలుగు కథలను ప్రేమించే కీరవాణి తనకు అమితంగా నచ్చిన 32 కథలను ఒక సంకలనంలా చేసుకొన్నారు. వాటిని నాకు బహూకరించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. అందులో కీరవాణి రాసిన రెండు కథలు కూడా ఉన్నాయి.





అనశ్వర రాజన్ నయా లుక్

# మళ్లీ తెరపైకి 'మాయాబజార్'

**మాయాబజార్** సినిమా విడుదలై నేటికీ 68 సంవత్సరాలు. ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎస్.వి.రంగారావు, సావిత్రి, రేలంగి, గుమ్మడి, ముక్కామల, మిక్కిలినేని, అల్లు రామలింగయ్య, ఆర్.నాగేశ్వర రావు, సూర్యకాంతం, రమణా రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన గొప్ప పౌరాణిక చిత్రం. విజయా ప్రొడక్షన్స్ పతాకంపై నాగిరెడ్డి, చక్రపాణి మాయాబజార్ చిత్రాన్ని చిరస్మరణీయంగా రూపొందించారు. దర్శకుడు కె.వి.రెడ్డి మాయా



బజార్ చిత్రాన్ని అపూర్వంగా, అనూహ్యంగా, అనితర సాధ్యంగా తెలుగు తెరపై ఓ సెల్యులాయిడ్ కావ్యంగా మలిచారు. మాయాబజార్ చిత్రాన్ని ఈనెల 28న మహానటుడు ఎన్. టి. రామారావు 102వ జయంతి సందర్భంగా బలుసు రామారావు విడుదల చేస్తున్నారు. మాయా బజార్ సినిమాకు పింగళి నాగేంద్ర రావు అద్భుతమైన మాటలను అందించారు. ఛాయాగ్రాహకుడు మార్కస్ బార్ట్ లే ఈ సినిమాను నవరస భరితంగా తెరమీద చూపించారు. ఘంటసాల సంగీత దర్శకత్వంలో ఈ చిత్రాల్లోని పాట్లను ఈ తరం ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంటున్నాయి. శ్రీకృష్ణుడుగా ఎన్.టి.రామారావు, ఘటోత్కచుడుగా ఎస్.వి.రంగారావు, శశి రేఖగా సావిత్రి, అభిమన్యుడిగా అక్కినేని నాగేశ్వర రావు ఆయా పాత్రలను సజీవంగా మన ముందు నిలబెట్టారు. 27 మార్చి 1957లో ఆంధ్ర దేశంలో విడుదలై సంచలన విజయం సాధించింది. ఈ సినిమాను కలర్‌లో మళ్ళీ తెలుగు ప్రేక్షకుల కోసం రామారావు బలుసు ఈనెల 28న విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మాయాబజార్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా టిడి జనార్ధన్, రమేష్ ప్రసాద్, ఎస్‌వి కృష్ణారెడ్డి అచ్చి రెడ్డి, దర్శకుడు వీర శంకర్, భగీరథ, వైజె రాంబాబు, త్రిపురనేని చిట్టి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చెర్మన్ శ్రీ టి.డి.జనార్ధన్ మాట్లాడుతూ, మాయాబజార్ సినిమా అప్పటి ఇప్పటి తరానికి ఒక మైలు రాయి లాంటిది. ఇప్పటితరంలో ఎన్నో గ్రాఫిక్స్ వచ్చినా ఆనాడే గ్రాఫిక్స్ లేని సమయంలో ఎంతో అద్భుతంగా మాయాబజార్‌ను మలిచి తిరుగులేని విజయాన్ని అందుకున్నారు. మళ్లీ ఇప్పుడు మాయాబజార్‌ని బలుసు రామారావు విడుదల చెయ్యడం అభినందించదగ్గ విషయం. సినీరంగంలో రారాజుగా నిలిచిన ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఓ ధృవతారగా అభివర్ణించారు. ఎన్టీఆర్ ముందు, తర్వాతగా తెలుగునాట రాజకీయాల్ని చెప్పుకోవాలని, రాజకీయాల్లో నైతిక విలువల్ని, ప్రజాస్వామ్య విధానాల్ని, సంక్షేమ శకాన్ని ప్రారంభించిన మహాపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. 2023లో ఎన్టీఆర్ శతజయంతిని పురస్కరించుకొని ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీని ఏర్పాటు చేశాము, ఎన్టీఆర్ నమ్మి ఆచరించిన మహోన్నత ఆశయాలు, సిద్ధాంతాలు, విధానాల్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో తాము ఎన్టీఆర్‌కు సంబంధించిన అపురూప గ్రంధాలను వెలువరిచాము.

# 'ఎం4ఎం' స్క్రీనింగ్, రెడ్ కార్పెట్‌పై దక్కిన గౌరవం

**2025** కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఓ తెలుగు సినిమా మన ఘనతను ప్రపంచానికి చాటిచెప్పింది. మోహన్ వడ్లపట్ల, జో శర్మ మూవీ ఎం4ఎం. కేన్స్‌లోని ప్రెస్టీజియస్ థియేటర్‌లో ఎం4ఎం మూవీ రెడ్ కార్పెట్ స్క్రీనింగ్ జరిగింది. ఈ వేడుకకు అంతర్జాతీయ ప్రేక్షకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. తెలుగు చిత్రసీమ తరపున దర్శకుడు మోహన్ వడ్లపట్ల తో పాటు అమెరికాకు చెందిన నటి జో శర్మ గౌరవంగా రెడ్ కార్పెట్‌పై మెరిశారు. ప్రదర్శన అనంతరం ప్రేక్షకులు హర్షధ్వానాలు చేయడంతో పాటు, విమర్శకులు, సినీ అభిమానుల నుంచి ప్రశంసలు లభించాయి. ఇది తెలుగు సినిమాకు కేన్స్‌లో దక్కిన అరుదైన ఘనత. ఇటీవల అంతర్జాతీయంగా మంచి గుర్తింపు పొందుతున్న జో శర్మ, ఈ ఈవెంట్‌లో దుబాయ్, ఢిల్లీలోని ప్రముఖ డిజైనర్లు రూపొందించిన దుస్తులు ధరించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆమె ఫ్యాషన్ సెన్స్, నటనా ప్రతిభకు అక్కడి మీడియా ప్రశంసలు కురిపించింది. మోహన్ మీడియా క్రియేషన్స్, మ్యాక్‌విన్ గ్రూప్ గీలీతి సంయుక్తంగా నిర్మించిన ఎం4ఎం, కేన్స్ 2025లో ప్రదర్శించిన ఏకైక తెలుగు చిత్రం. ఈ మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ కథ అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకట్టుకుంది. కథన బలంతో పాటు సినిమాటిక్ ప్రెజెంటేషన్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రీమియర్‌కు హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్ సహా ప్రపంచ సినీ పరిశ్రమ నుండి పలువురు ప్రముఖులు హాజరై చిత్రానికి అభినందనలు తెలిపారు. గత కొన్నేళ్లుగా తెలుగు సినిమాకు కేన్స్‌లో ఊరిస్తున్న ఈ అరుదైన గౌరవం, ఎం4ఎం మూవీకి దక్కడంతో ఈ ప్రీమియర్ తెలుగు చలనచిత్ర చరిత్రలో గొప్ప ఘట్టంగా నిలిచింది. టాలీవుడ్ నిర్మాతగా మంచి గుర్తింపు ఉన్న మోహన్ వడ్లపట్ల, ఈ చిత్రంతో దర్శకుడిగా ఇప్పుడు అంతర్జాతీయ గుర్తింపు పొందారు. జో శర్మ అభినయం ప్రపంచ స్థాయిలో ప్రశంసలందుకుంది. త్వరలో ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. భారతీయ ప్రాంతీయ సినిమాకి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చిన సినిమాగా ఎం4ఎం విడుదలకు ముందే అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు అందుకుంటోంది.



# విశాల్ పెళ్లిపై సాయి ధన్సిక క్లారిటీ

**తమిళ హీరో** విశాల్ తెలుగు ఆడియెన్స్‌లోనూ మంచి క్రేజ్‌ను దక్కించుకున్నాడు. ఆయన నటించే తమిళ చిత్రాలను



తెలుగులోనూ గ్రాండ్‌గా రిలీజ్ చేస్తారు. ఇక గతకొద్ది రోజులుగా విశాల్ పెళ్లిపై పలు వార్తలు వినిపిస్తూ ఉన్నాయి. అయితే, తాజాగా విశాల్‌తో పెళ్లిపై హీరోయిన్ సాయి ధన్సిక క్లారిటీ ఇచ్చేసింది. ఓ ఈవెంట్‌లో మాట్లాడిన సాయి ధన్సిక త్వరలోనే తాను పెళ్లి చేసుకోబోతున్నానని.. హీరో విశాల్‌తో తన పెళ్లి ఆగస్టు 29న జరగనుందని తెలిపింది. అదే ఈవెంట్‌లో విశాల్ కూడా ఉండటంతో వారు అధికారికంగా తమ పెళ్లి డేట్‌ను ప్రకటించారు. ఇక ఈ వార్తతో వారి అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. విశాల్‌సాయి ధన్సిక వివాహం కోసం సినీ పరిశ్రమ కూడా ఆసక్తిగా ఎదురు చూస్తోంది.

# ఈ తరం హీరోయిన్స్‌కు అన్ను అంబానీ పోటీ

**టి అన్ను** గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ముద్దుగుమ్మ మన్మథుడు సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది. అక్కినేని నాగార్జున సరసన నటించిన ఈ తెలుగు రొమాంటిక్ కామెడీ సినిమాతో ఆమె గుర్తింపు పొందింది. ఈ చిత్రంలోని గుండెల్లో ఏముందో పాటలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా తర్వాత ఆమె ప్రభాస్ సరసన రాఘవేంద్ర సినిమాలో నటించి ప్రేక్షకులను మెప్పించింది. ఆ తర్వాత ఓ తమిళ్ సినిమాలోనూ నటించింది ఈ చిన్నది. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ చిన్నది ఇటీవలే తిరిగి రీ ఎంట్రీ ఇచ్చింది. 21 సంవత్సరాల విరామం తర్వాత, ఆమె సందీప్ కిషన్, రీతూ వర్మ, రావు రమేష్‌లతో కలిసి మజాకా చిత్రంతో తెలుగు సినిమాల్లోకి తిరిగి అడుగుపెట్టింది. ఈ చిత్రం ఫిబ్రవరి 28, 2025న విడుదలైంది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. మజాకా సినిమా సూపర్ హిట్ కావడమే కాదు.. మరోసారి తన నటనకు మరోసారి ప్రశంసలు అందుకుంది. దీంతో ఇప్పుడు తెలుగులో మరిన్ని ఆఫర్స్ వస్తే చేసేందుకు రెడీగా ఉంది అన్ను. ఇదిలా ఉంటే.. సోషల్ మీడియాలో అన్ను చాలా యాక్టివ్. నిత్యం తన ఫ్యామిలీతోపాటు తన క్రేజీ ఫోటోస్ షేర్ చేస్తూ



ఫాలోవర్లను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ అమ్మడు మోడ్రన్ డ్రస్‌లో మరింత అందంగా కనిపిస్తుంది. వయ్యారాల సింగారంతో ఫాలోవర్లను కట్టిపడేస్తుంది ఈ చిన్నది.

# పిల్లలు ఇద్దరూ సమానమే !



ఇంట్లో ఒకరికి మించి పిల్లలు ఉంటే చాలు.. తరచూ తగాదాలే. 'అన్ననే నువ్వు బాగా చూస్తావ్'. చెల్లికే నువ్వు అన్నీ కొనిస్తావ్ అంటూ అలకబూనుతుంటారు. ఇది కొంతవరకూ పరవాలేదు కానీ తోబుట్టువులపై ద్వేషం పెంచుకునే వరకూ వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ఇందుకోసం నిపుణులు ఏం సలహా ఇస్తున్నారంటే..

✦ తల్లిదండ్రులుగా ఇద్దరు పిల్లల్ని వేర్వేరుగా చూడాలన్న పక్షపాతం మీకు లేకపోయి ఉండొచ్చు. కానీ తరచూ ఒకరితో ఒకరు గొడవ పడటం, చిన్నబుచ్చుకోవడం చేస్తుంటే.. వారికి కాస్త మీ ప్రేమ అవసరం అని తెలుసుకోండి. ఇద్దరూ సమానమే అని చెప్పే ప్రయత్నం చేయండి. తనతో మీరు చిన్నప్పుడు ఎంత చనువుగా ఉండేవారో చెబుతూ ఉండండి ఇది తనలోని అభద్రతా భావాన్ని దూరం చేస్తుంది. ఆ జ్ఞాపకాలన్నీ క్రమంగా తన అపోహల్ని దూరం చేయొచ్చు.

✦ అమ్మానాన్నలు వయసులో చిన్నది కదా అని ఆఖరిదానికి అడిగినవన్నీ తెచ్చివ్వడంలో తప్పులేదు. కానీ, అదే సమయంలో పెద్దవాడి ఇష్టాలకూ ప్రాధాన్యం ఇవ్వండి. లేదంటే, మీకూ, తనకీ, మధ్య చెల్లి వచ్చిందనే అభద్రత బాధ తోబుట్టువుతో గొడవలకు దారితీస్తాయి.

✦ పిల్లల్లో అల్లరి, గిల్లికజ్జాలు మామూలే తప్పొప్పులు ఇద్దరివైపూ ఉంటాయి. అలా కాకుండా పెద్దాడే చేసుంటాడు. లేదా చిన్నదే చేస్తుందిలా అనే నిర్ధరణకు వచ్చేయకండి. సమస్య ఏంటో తెలుసుకుని సరిదిద్దినప్పుడు గొడవలు రావు. ఇంకోసారి ఒకరి మీద మరొకరు ఫిర్యాదు చేసుకునే పరిస్థితి ఉండదు. □

# సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి !



**కష్టంలో ఉన్నవాళ్లకు అండగా నిలవడం, యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం, మూగజీవాల దాహార్తిని తీర్చడం... ఇలాంటి సేవా కార్యక్రమాలెన్నో చేస్తారు. అందులోనే సంతృప్తి అంటారు. విశాఖకు చెందిన ఎస్.గీతా నారాయణ్, అందుకే తన ముందు ఎన్నో దారులు కనిపించినా... సేవా మార్గాన్నే ఎంచుకున్నారామె.**

డబ్బు ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. అధికారి భార్య కాబట్టి ఇదంతా చేస్తున్నారు. రాజకీయాల్లోకి రావాలని సేవ చేస్తున్నారు... ఇలా ఎన్నో రకాలుగా నా గురించి అనుకోవడం విన్నాను. అయినా వాటిని పట్టించుకోలేదు. ఎందుకంటే నేను సేవచేయడానికి కారణాలు వారనుకున్నవి కాదు. మా అబ్బాయి పట్లే కాదు... సమాజంపైనా నాకు అంతే బాధ్యత ఉందనుకుంటాను. సంపాదనలో కొంత అందుకు ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నా. దీనికి



కారణం నా నేపథ్యమే. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం మా సొంతూరు. నాన్న తల్లాడి సత్యనారాయణ గ్రామ సర్పంచ్‌గా చేశారు. అమ్మ వరలక్ష్మి, వాళ్ల మూడో సంతానం నేను, ఎన్ని ఇబ్బందులున్నా. అడిగినవారికి కాదనకుండా నాన్న సాయం చేయడాన్ని దగ్గరగా చూశారు. ఉమ్మడి కుటుంబంలోని సభ్యుల మధ్య ప్రేమ, సాయం, జాలిని చూశాను. ఇవే నన్ను సేవవైపు నడిచేలా చేశాయి. మావారు శంకర్ నారాయణ్ ఐఆర్ఎస్, ఏపి ప్రభుత్వంలో డ్రగ్స్ కంట్రోల్ కాపీరైట్లను పనిచేసి వీఆర్ఎస్ తీసుకున్నారు. సేవా కార్యక్రమాల్లో నాకు అండగా ఉంటున్నారు.

**పక్షుల కోసం చలివేంద్రాలు ...**

మావారి ఉద్యోగ రీత్యా 2012లో విశాఖ వచ్చాం. ఇక్కడ సేవా కార్యక్రమాలు చేయడానికి సిద్ధమైనప్పుడు సంతోష్ పుల్లెటికుర్తి స్థాపించిన 'కెన్ ఫౌండేషన్' మంచి వేదికగా అనిపించింది. అప్పట్నుంచి నేనూ అందులో భాగమై వివిధ కార్యక్రమాలు చేస్తున్నా. వాటిలో 'గ్రీన్' ప్రాజెక్టు ఒకటి. వేసవి రాగానే ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం. అదే ఎన్ని తరహా పక్షులకూ ఎందుకు ఉండకూదని పించి 'వాటర్ బౌల్స్' ప్రాజెక్టుని ప్రారంభించాం. ఈ ప్రాజెక్టుకు ఛైర్పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. గత 13 ఏళ్లుగా ఉమ్మడి విశాఖ పరిధిలో వేల సంఖ్యలో పక్షుల కోసం నీటి తొట్టెలను పెట్టించాం. జంతువులు, వీధి శునకాలకు సైతం పెద్ద సిమెంటు తొట్టెలను ఏర్పాటు చేస్తున్నాం.

**గిరిజనులకు వింటర్ స్మైల్...**

పాడేరు చుట్టుపక్కల గిరిజన గ్రామాల్లో 'వింటర్ స్మైల్ పేరుతో ఓ ప్రాజెక్టు చేపడుతున్నాం. పోలీసుల సాయంతో రెండు నెలలపాటు స్థానిక పేద కుటుంబాలకు దుస్తులు, 2 నిత్యావసర సరకులు అందిస్తాం. నాన్న గుండెపోటుతో చనిపోయినప్పుడు అంబులెన్స్ సమస్య వచ్చింది. అది చూశాక, అన్ని రకాల సౌకర్యాలుండే అంబులెన్స్‌ను రూ.20లక్షలతో కొనుగోలు చేసి జంగారెడ్డిగూడెంలో ఒక ఎన్జీవోకు అప్పగించారు.

అక్కడ ప్రభుత్వ స్కూల్లో నీటికి అవస్థలు పడుతుంటే రూ.3లక్షలతో బోర్ వేయించాం. విశాఖ పరిధిలో 13వేల మంది అనాథ చిన్నారులు, బాలికలు, వృద్ధులకు ఇప్పటివరకు అండగా నిలిచాం. నాలుగేళ్ల క్రితం పాడేరులో పదో తరగతి అర్హత ఉన్నవారిని గుర్తించి రెండు నెలలపాటు ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. 550 మంది హాజరైతే అందులో 180 మంది పోలీస్ శిక్షణకు ఎంపికయ్యారు.

నిరాదరణకు గురైన మహిళలకు 60కు పైగా కుట్టు మెషీన్లు పంపిణీ చేయడంతోపాటు, ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించాం. హుద్‌హుద్ సమయంలో విశాఖలో వెళ్లగలిగిన ప్రతి ప్రాంతంలో మా సేవలందాయి. సేవలో దొరికే సంతృప్తి మరెక్కడా ఉండదు. అందుకే ఈ మార్గాన్ని ఎంచుకున్నా. అందుకే మా మార్గాన్ని ఎంచుకున్నా. □

# కీళ్ల నొప్పులకు రోజ్‌హిప్ టీ



అందం, ఆరోగ్యం కోసం.. సంప్రదాయ టీ స్థానంలోకి హెర్బల్ టీలు వచ్చాయి. వాటిల్లోనూ యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే రోజ్‌హిప్ టీ తీసుకోవడం వల్ల అధిక ప్రయోజనాలు పొందొచ్చు అంటున్నారు పోషకాహార నిపుణులు.

✦. సాధారణ హెర్బల్ టీలతో పోలిస్తే ఇందులో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వల్ల మనలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

✦. రక్తంలోని ట్రైగ్లిజరాయిడ్లని అదుపుచేసి.. గుండెజబ్బులు రాకుండా చేస్తుంది. బరువుని అదుపులో ఉంచుతుంది.

✦. తుంటి, కీళ్లనొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అంతర్గత వాపుల రాకుండా చూస్తుంది. ఈ టీని నిత్యం తాగేవారికి విటమిన్ సి, విటమిన్ ఇలు పుష్కలంగా అందుతాయి. ఈ విటమిన్లు.. చర్మంలో సాగే గుణాన్ని పెంపొందించి వయసు ఛాయలని వెనక్కి నెడతాయి. □

## చెలి చిట్కా

ముఖాన్ని ఎంతగట్టిగా రద్దితే అంత మెరుగువస్తుందని కొందరి భ్రమ. ముఖాన్ని గట్టిగా చేతులతో అదిమి రుద్దుకోనడం వల్ల అందం పెరగకపోగా చక్కటి చర్మం పాడవుతుంది. □

# సంగీతంతో మనసు ఉల్లాసం



కొన్ని పాటలు శరీరంలో పులకలు తెప్పిస్తాయి. మరికొన్ని చల్లటిగాలేదో చుట్టుముట్టిన భావనని కలిగిస్తాయి. కొన్ని వ్యక్తం చేయలేని శోకాన్నేదో కలిగిస్తే.. మరికొన్ని తెలియని ఆనందాన్ని పుట్టిస్తాయి. ఎందుకు జరుగుతోందిలా? అన్న ప్రశ్నకి సంగీతం మనసులో తెచ్చే స్పందనలే ఇందుకు కారణమని చెబుతూ వచ్చారు ఇంతకాలం. కానీ ఒక్క మనసే కాదు శరీరమూ సంగీతానికి రకరకాలుగా స్పందిస్తోందని తాజాగా తేల్చారు శాస్త్రవేత్తలు. ఇందుకోసం 528 మందితో ఓ అధ్యయనం నిర్వహించారు. వాళ్లకి వినిపించడానికి కొన్ని వాయిద్య సంగీత భాగాల్ని ఎంచుకున్నారు. వాళ్ల ముందు మానవ శరీరభాగాలతో ఉన్న టచ్‌స్క్రీన్ బొమ్మని ఉంచారు. ప్రతిసారీ సంగీతాన్నీ విన్న పది సెకన్ల తర్వాత వాళ్ల శరీరంలో ఏ భాగం స్పందిస్తోందో దాన్ని టచ్‌స్క్రీన్‌లోని బొమ్మని తాకి చెప్పమన్నారు. దాదాపు అందరూ కొన్ని పాటలతో తమ హృదయ స్పందన పెరుగుతోందనీ, మరికొన్నింటితో ఉదరభాగంలో ఏదో కదులుతున్నట్టు భావించామనీ చెప్పారట! దీన్నిబట్టి సంగీతం అన్నది మనసుపైనే కాదు శరీరంమీదా ప్రభావాన్ని చూపుతోందని తేల్చారు శాస్త్రవేత్తలు. ముఖ్యంగా పాట మొదలైనప్పటి నుంచీ చివరిదాకా సాఫీగా సాగే మెలడీ ఉదర(గట్) భాగాల్లో అవ్యక్తానుభూతికి కారణమైతే.. అక్కడక్కడా మలుపులున్న సంగీతం హృదయ స్పందనల్నీ పెంచుతోందని విశ్లేంచారు. □

# కారం గవ్వలు

ఆకుకూరలు ఆరోగ్యానికెంతో మంచిది. మరి వాటిని పిల్లలతో తినపించాలంటే కూరగా కంటే చిరుతిండి రూపంల ఇస్తే సరి. మెంతికూరతో ఇల స్నాక్స్ చేశారనుకోండి. ఇంటిల్లిపాదికీ నచ్చేస్తాయి.

**కావలసినవి..** మెంతికూర 2 కట్టలు, నెయ్యి 2 చెంచాలు, మైదా, గోధుమపిండి పావు కిలో చొప్పున, శనగపిండి 2 టేబుల్‌స్పూన్లు, నెయ్యి 3 చెంచాలు, వాము అర చెంచా, నువ్వులు 2 చెంచాలు, నూనె వేయించేందుకు సరిపడా, ఉప్పు రుచికి తగినంత, ఆమ్‌చూర్ పొడర్ పావు చెంచా, అల్లం ముద్ద ముప్పావు చెంచా, పచ్చిమిర్చి తరుగు, మిరియాలపొడి అర చెంచా, చొప్పున తీసుకోవాలి.



**తయారీ :** మెంతికూరను శుభ్రంగా కడిగి నీళ్లు లేకుండా వడకట్టాలి. వెడల్పాటి పాత్రలో మైదా, గోధుమపిండి, శనగపిండి, నెయ్యి, వాము నువ్వులు, ఉప్పు, ఆమ్‌చూర్ పొడర్, అలనం ముద్ద, పచ్చిమిర్చి తరుగు, మిరియాలపొడి వేసి కలపాలి. కడాయిలో మిగలిన నెయ్యి వేడిచేసి మెంతికూరను వేయించాలి. చల్లారాక.. దీన్ని కూడా జోడించి కొన్ని నీళ్లతో పిండి కలిపి.. గవ్వలు చేయొచ్చు. అది కష్టమనుంటే.. కొంచెం మందమైన చపాతీలు చేసి, చతురస్రం, త్రిభుజం.. =ఇలా ఇష్టమైన ఆకృతిలో ముక్కలుగా కట్ చేయొచ్చు. లేదా సన్నగా చీలికలుగా చేసి ఒక్కోదాన్నీ కింది నుంచి పైకి రోల్ చేసినా చూడసొంపుగా ఉంటాయి. ఇలా నచ్చినట్టు చేశాక.. కాగుతున్న నూనెలో వేయించుకుంటే.. నోరూరించే కారం గవ్వలు సిద్ధమైపోతాయి. □

# మెరిసే అందం కోసం..

అందానికీ, ఎంటర్‌టైన్మెంట్‌కీ హద్దులుండవు కదూ! అలా మనం అనుసరించే వారిలో కొరియన్లూ ఒకరు. ఆ చిత్రాలకే కాదు.. వారి చర్మతత్వానికీ మన అమ్మాయిలు ఫిదా అవుతుంటారు. అంతటి నున్నటి, మెరిసే **చర్మం కావాలా..** వారి స్కిన్ కేర్ రొటీన్‌ను మీరూ అనుసరించేయండి.



డబుల్ క్లెన్సింగ్... మేకప్‌తో సంబంధం లేకుండా డబుల్ క్లెన్సింగ్‌కి ప్రాధాన్యమివ్వాలి. ముందు మిసెల్లర్ వాటర్ లేదా ఆయిల్ క్లెన్సర్‌తో ముఖాన్ని శుభ్రపరచుకోవాలి. **లేదంటారా..** కొబ్బరి, ఆలివ్, బాదం నూనెల్లో నచ్చినదాన్ని తీసుకొని ముఖానికి పట్టించండి. మృదువుగా వృత్తాకారంలో ముఖమంతా రుద్దితే సరి. చర్మరంధ్రాల్లోని మురికి బయటికి రావడమే కాదు. మర్దనా జరిగి రక్తప్రసరణా మెరుగవుతుంది. తర్వాత నచ్చిన లిక్విడ్ సోప్‌తో ముఖాన్ని శుభ్రం చేస్తే సరి. టోనింగ్ తప్పని సరి.. ముఖం కడిగేటప్పుడు చర్మ రంధ్రాలు తెరుచుకుంటాయి. వాటిని తిరిగి మూయడంలో దీనిదే ప్రధాన పాత్ర. చర్మానికి తాజాదనంతో పాటు తేమనీ అందిస్తుంది. మీ అవసరాలకు తగ్గట్టు విటమిన్ సి, నియాసినమైడ్, గ్రీన్ టీ.. నచ్చిన రకాలను ఎంచుకోవచ్చు. గ్లాసీ లుక్ కావాలి అనుకుంటే సెరమైడ్స్ ఉన్నవి ఎంచుకోండి. 30 దాటితే కొల్లాజెన్‌ను పెంచేవి వాడితే మంచిది. □

# పిల్లలు సెలవుల్లో సరదాగా..



ముందు ఖాళీ బాటిళ్లను తీసుకోవాలి. క్రాఫ్ట్ స్టోర్‌లో దొరికే కలర్ ఇసుకను తీసుకొచ్చి వాటిల్లో వేయాలి. ఆ తర్వాత ఓ కర్రకు చెక్క లేదా గట్టిగా ఉండే ప్లాస్టిక్ రింగునొకదాన్ని కట్టి వేలాడదీయాలి. మరో పెద్ద రింగు మధ్యలో బాటిల్‌ను అడ్డంగా ఉంచండి. ఇప్పుడు ఆ కర్ర సాయంతో ముందుగా ఎవరైతే బాటిల్‌ను నిలువుగా నిలబెడతారో వాళ్లు గెలిచినట్టు! ఈ ఆట పిల్లల్లో ఏకాగ్రత, మెంటల్ బ్యాలెన్స్‌ను పెంచుతుంది. □

# స్నేహా

మనిషి జీవితంలో అతిమధురమైనది స్నేహం. జీవితాంతం చెరిగిపోనిది స్నేహ బంధం. తల్లిదండ్రులతో, తోబుట్టువులతో, సంతానంతో, కట్టుకొన్న భార్యతో కూడా చెప్పుకోలేని కొన్ని విషయాలను ప్రాణ సమానులైన స్నేహితులతో పంచుకోడానికి సామాన్యంగా ఎవరూ వెనుకాడరు. అయితే విశ్వాస పాత్రుడూ, శ్రేయోభిలాషీ అయిన సుగుణవంతునితోనే చెలిమి చేయాలంటారు పెద్దలు. శ్రీరాముని బాధలలో పాలుపంచుకొని, సాయంచేసి, తరించారు ఆయన స్నేహితులైన గుహుడు, ఆంజనేయుడు, సుగ్రీవుడు. ప్రాణ స్నేహితునిగా, జీవిత సారథిగా, చెలికానిగా, గురువుగా అర్జునునికి తోడై నిలిచి శ్రీకృష్ణుడు అతనికి విజయాన్ని, శాశ్వత కీర్తిని కల్గించాడు. వారిది నర (అర్జునుడు) నారాయణ ( శ్రీకృష్ణుడు) బంధం.

కర్ణ దుర్యోధనుల స్నేహం కూడా గాఢమైనదే. కానీ దుర్గుణ సంపన్నుడైన సుయోధనునితో స్నేహం చేసి, అధర్మం వైపున నిలిచినందు వలన కర్ణుని కీర్తి మసకబారింది. మైత్రీబంధ వినిష్ఠితులైన మహనీయులు మనకు చాలా మంది పురాణేతిహాసాలలో కన్పిస్తారు.

శ్రీకృష్ణ కుచేలుల మైత్రి జగతికే ఆదర్శమైంది.

"మిత్రే నివేదితే దుఃఖే/ దుఃఖినో జా యతే లఘుః / భారం భార వహస్యేన/ స్కంధయోః పరివర్తితే ". బరువులను మోసేటప్పుడు ఒకే భుజంపైననే కాక, మధ్య మధ్యలో ఆ బరువును రెండో భుజంపైకి మార్చుకొంటూ ఉంటే భారమనిపించనట్లు, మిత్రునికి బాధ చెప్పుకొంటే దుఃఖ భారం ఉపశమిస్తుందని పై సుభాషితం చెబుతుంది.

అంతేకాదు. " కరాని వ శరీరస్య , నేత్రయోరి వపక్ష్మణీ / అవిచార్య ప్రియం కుర్యాత్ తన్మిత్రం మిత్ర ఉచ్యతే " శరీరానికి చేతులలాగా, కళ్ళకు రెప్పల లాగా, స్వచ్ఛందంగా, వేరే ఆలోచనే లేకుండా సహాయపడే వాడు, మేలు చేసే వాడే స్నేహితుడనబడతాడు. అలాంటి సన్మిత్రుడు లభించినవాడు చాలా అదృష్టవంతుడు అదే స్నేహభాగ్యము.



ఆధ్యాత్మికం

-డా. గొల్లాపిన్ని సీతారామ శాస్త్రి

# మహిళలకు శక్తి నిచ్చే బాదం !

**ఇంటి బాధ్యతలన్నీ నెత్తి వేసుకుని అందరి గురించీ ఆలోచించే మహిళల్లో ఎక్కువమంది పోషకాహార లోపంతో** బాధపడుతు న్నారని చెబుతున్నారు పలు అధ్యయనాలు. అందుకే, రోజూ గుప్పెడు బాదం గింజల్ని తినమని సూచిస్తున్నారు. మరి దీని ప్రయోజనా లేంటో తెలుసుకుందామా !

ే.బాదం గింజల్లో విటమిన్ ఇ, మెగ్నీషియం, ప్రొటీన్, రైబోఫ్లేవిన్, జింక్ వంటి 15 రకాల పోషకాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యం ఉంచేందుకు దోహదపడతాయి. పోషకాల లేమిని తగ్గిస్తాయి. ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు యాంటీ ఏజింగ్ గుణాలూ బాదంలో ఎక్కువ. వీటిని తీసుకోవడం వల్ల చర్మం ముడతలు పడకుండా ఉంటుంది.

ే. ఇందులో ఎక్కువ దొరికే ప్రొటీన్ శక్తి నివ్వడంతో పాటు కండరాల సాంద్రతను పెంచుతుంది. అలానే ఇందులోని విటమిన్ బి2, విటమిన్ ఇ, మెగ్నీషియం, ఫాస్ఫరస్‌లు నరాల పనితీరుని పెంపొందిస్తాయి. అంతేకాకుండా బాదం తినడం వల్ల త్వరగా కడుపునిండినచ భావన కలిగి అతిగా తినే అలవాటు తగ్గుతుంది. ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్ తక్కువగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

ే బాదం తినడం వల్ల రక్తంలో చక్కెరలు సమన్వయం అవుతాయి. ఇన్సులిన్ ఉత్పత్తి బాగుంటుంది. అలానే, ఇందులో అధిక మోతాదులో లభించే కాల్షియం ఎముకలు, దంతాలను దృఢంగా ఉంచుతుంది. కండరాల పనితీరుని మెరుగుపరుస్తుంది. శరీరంలో ఎర్రరక్త కణాల శాతాన్ని పెంచి రక్తహీనతను నివారించడంలో ఐరన్ పాత్ర ఎక్కువే. ఫలితంగా మహిళల్లో రక్తహీనత అదుపులోకి వస్తుంది. ఇది బాదం గింజల్లో పుష్కలంగా లభిస్తుంది. శరీరంలోని అన్ని అవయవాలకూ ఆక్సిజన్ సరఫరా సక్రమంగా ఉండేలా చూస్తుంది. మెటబాలిజాన్నీ, వ్యాధినిరోధక శక్తినీ పెంచుతుంది. □

# నలుగురిలో ప్రత్యేకంగా..

**ఆరునెలల్లో మనమేంటో తెలిసిపోతుంది. వ్యక్తిగత లేదా వృత్తి జీవితాల్లో నలుగురిలో ప్రత్యేకంగా ఉండాలని కోరుకోని అమ్మాయి ఉంటుందా! ఈ గుర్తింపు రావాలంటే ఈ సూత్రాలు పాటించాల్సిందే..**

**ఆహార్యంతో: ..** పుట్టుకతో వచ్చిన ఛాయ, రూపం.. వంటి వాటిని మార్చలేం. కానీ ఉన్నదాంట్లోనే ఉత్తమంగా కనిపించే అవకాశం మన చేతుల్లోనే ఉంది. అలాగని ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు, వస్తువులు వేసుకోవాలనే కాదు. మనం ఏది ధరించినా అందులో మన వ్యక్తిత్వం ప్రస్ఫుటించాలి. హుందాతనాన్ని మరింత పెంచేలా ఉండాలి. ఎవరు ఎంత చెప్పినా సరే.. ఒక మనిషిని చూడగానే ఎదుటివారు మొదట గమనించేది మన **ఆహార్యాన్నే..** కాబట్టి దానిమీద శ్రద్ధపెట్టడం చాలా ముఖ్యం. నువ్వు నీలా ఉంటేనే.. కొందరు నలుగురు



మెప్పు పొందాలని.. లేని అలవాట్లు, పద్ధతులను అనుసరిస్తుంటారను. ఈ ధోరణి సరికాదు. ఎందుకంటే మనం ఎంత దాచిపెట్టినా మన వ్యక్తిత్వం ఎదుటి వారికి 6 నెలల్లోపే తెలిసి పోతుందట. దాన్ని ఎక్కువ రోజులు ఎవరి దగ్గరా దాచలేమనేది అందరికీ తెలిసిన సత్యమే. ముందు మనం మనలా, నిజాయితీగా ఉండాలి. మన నమ్మకాలను, విలువలను, వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా ఉండాలి. అప్పుడే మనకు స్నేహితులు, బంధువులు ఎవరి వద్దయినా గౌరవం ఉంటుంది.

**వినటం నేర్చుకుంటే..** ఒక్కోసారి మన ఎదుటివారు చెప్పే విషయాలను శ్రద్ధపెట్టి వినం. అలాంటప్పుడు మనం తిరిగి సమాధానం చెప్పాల్సివస్తే ఏం చెప్పాం? అందుకే ఇతరులు చెప్పే విషయాల్ని శ్రద్ధగా విని, ఆలోచించి స్పందిస్తే వారిని మనం గౌరవించినట్లే. అప్పుడు వాళ్లూ మనల్ని తిరిగి గౌరవిస్తారు. అదే విధంగా మనం రకరకాల వ్యక్తులతో కలిసి పనిచేస్తుంటాం. ఒక్కొక్కరి ఆలోచన, అభిప్రాయాలు భిన్నంగా ఉంటాయి. తొందరపడి వాళ్లపైన మీరు ఇది అనే ముద్ర వేయకుండా చెప్పింది వినాలి. అది మన అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంచటమే కాకుండా, వారితో మన అనుబంధాన్నీ బలపరుస్తుంది. దాంతో పాటు గౌరవాన్నీ ఇస్తుంది. □

## మహిళల టి20 వరల్డ్ కప్..
# క్వాలిఫయర్స్‌కు నేపాల్, థాయ్ అర్హత
### చివరి లీగ్ మ్యాచ్‌ల్లో ఎమిరేట్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల టీ20 వరల్డ్ కప్-2026 గ్లోబల్ క్వాలిఫయర్స్‌కు నేపాల్, థాయ్‌లాండ్ జట్లు ఆఖరి నిముషంలో అర్హత సాధించాయి. ఆసియా క్వాలిఫయర్స్‌లో అద్భుత ప్రదర్శన కనపర్చిన ఈ రెండు జట్లు వరల్డ్ కప్ బెర్త్ కోసం పోటీ పడేందుకు అర్హత సాధించాయి. తమ చివరి లీల్ మ్యాచ్‌ల్లో యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌పై విజయాలు సాధించిన నేపాల్, థాయ్‌లాండ్ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించాయి. గ్లోబల్ క్వాలిఫయర్స్‌కు ఇప్పటికే స్కాంట్లాండ్, బంగ్లాదేశ్ జట్లు అర్హత సాధించాయి. ఇక యూరప్, ఆఫ్రికా క్వాలిఫయర్స్ నుండి అర్హత సాధించే జట్లేవో తెలియాల్సి ఉంది. ఈరెండు టోర్నీల నుండి రెండు జట్లు వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తాయి. అనంతరం గ్లోబల్‌క్వాలిఫయర్స్‌లో ఆరు జట్లు పోటీ పడగా, అందులో నాలుగు జట్లు వరల్డ్ కప్‌కు అర్హత సాధిస్తాయి. కాగా2026 మహిళల టీ20 వరల్డ్ కప్ ఇంగ్లండ్ వేదికగా జరగనుంది. ఈ టోర్నీలో మొత్తం 12జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి పోటీ పడతాయి. ఆతిధ్య దేశ హోదాలో ఇంగ్లండ్‌తొలుత ఈ వరల్డ్‌కప్‌కు అర్హత సాధించగా, ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, శ్రీలంక దేశాల జట్లు ఈ మెగా టోర్నీకి నేరుగా అర్హత సాధించాయి. మిగిలిన నాలుగు బెర్తులు గ్లోబల్ క్వాలిఫయర్స్ ద్వారా నిర్ణయం అవుతాయి. ఈ టోర్నీలో న్యూజిలాండ్ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగనుంది.

# లాటిన్ అమెరికాతో ఛెత్రి శాశ్వత అగ్రిమెంట్
### తొలి భారత్ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రికార్డు



**న్యూఢిల్లీ:** లాటిన్ అమెరికన్ జట్టుతో భారత్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు బిజయ్ ఛెత్రి శాశ్వత ఒప్పందం చేసుకున్నాడు. ఉరుగ్వే క్లబ్ కోలన్ ఎఫ్‌సితో పూర్తి సమయం ఒప్పందంపై సంతకం చేయడం ద్వారా బిజయ్ ఛెత్రి దకిణ అమెరికా జట్టులో శాశ్వతంగా చేరిన మొదటి భారతీయ ఆటగాడిగా నిలిచాడు. మణిపూర్‌కు చెందిన ఛెత్రి, 2016లో షిల్లాంగ్ లాజోంగ్‌తో తన ఫుట్‌బాల్ కెరీర్‌ను ప్రారంభించాడు. 2018లో ఇండియన్ ఆరోస్‌తో సీనియర్‌గా అరంగేట్రం చేశాడు. అప్పటి నుండి అతను తనతొలి ఐఎస్‌ఎల్‌క్లబ్ అయిన చెన్నైయిన్ ఫుట్‌బాల్ క్లబ్‌లో చేరడానికి ముందు చెన్నై సిటీ, రియల్ కాశ్మీర్ మరియు శ్రీనిధి డెక్కన్ వంటి క్లబ్‌లకు ఆడాడు. అయితే, కోలన్‌లో ఛెత్రి గత సీజన్‌లో కేవలం 25 నిమిషాలు మాత్రమే ఆడాడు. ఉరుగ్వేలోని సెగుండా డివిజన్ ప్రొఫెషనల్ (రెండవ డివిజన్)లో పోటీ పడుతున్నాడు. 23 ఏళ్ల సెంటర్‌బ్యాక్ గతసీజన్‌లో చెన్నైయిన్ ఫుట్‌బాల్‌క్లబ్ తరపున పాల్గొంటున్నాడు. ఈసారి దాన్ని మరింతగా మెరుగుపరచుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు.




### ఉమెన్ టెన్నిస్ అసోసియేషన్ ర్యాంకింగ్స్‌లో..
# అగ్రస్థానంలో సబలెంకా
### 2 నుండి 5వ ర్యాంక్‌కు పడిపోయిన స్వియాటెక్
### శ్రీవల్లికి 287, సహజకు 316 ర్యాంక్

**న్యూఢిల్లీ:** ఉమెన్ టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యూటిఎ) ర్యాంకింగ్స్‌లో అరినా సబలెంకా అగ్రస్థానాన్ని ఆక్రమించింది. రోమ్‌లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత అమెరికాకు చెందిన కోకో గౌఫ్ తన కెరీర్‌లో 2వ ర్యాంకుకు తిరిగి చేరుకుంది. డబ్ల్యూటిఎ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకునే ముందు ఇగా స్వియాటెక్ 5వ స్థానానికి పడిపోయింది. 23 ఏళ్ల స్వియాటెక్ ఈ నెల 25 నుండి జూన్ 8 వరకూ పారిస్‌లో జరగనునన రోలాండ్ గారోస్‌లో వరుసగా ఐదవ టైటిల్‌ను గెలుచుకోవాలని పట్టుదలతో ఉంది. అయితే మాజీ ప్రపంచ నంబర్ వన్ అయిన పోలిష్ క్రీడాకారిణి, 2024 ఎడిషన్ క్లే మేజర్‌లో విజయం సాధించినప్పటి నుండి స్వియాటెక్ ఇబ్బంది పడుతోంది. ఇటీవల ఆమె ఇటాలియన్ ఓపెన్‌లో 32వ రౌండ్‌లో అమెరికన్ డేనియల్ కాలిన్స్ చేతిలో ఓడిపోయింది. దీని ఫలితంగానే స్వియాటెక్ ర్యాంకింగ్స్‌లో 2 నుండి 5వ స్థానానికి పడిపోయింది. ఇక ఇటాలియన్ ఓపెన్‌ను సొంతం చేసుకున్న జాస్మిన్ పావోలిని 5వ స్థానం నుండి నాల్గవ స్థానానికి చేరుకోగా, గౌఫ్ స్వదేశీయురాలుజెస్సికా పెగులా 4వ స్థానం నుండి 3వ స్థానానికి చేరుకుంది. అలాగే రోమ్‌లో జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో గౌఫ్ చేతిలో ఓడిపోయిన రష్యన్ టీనేజర్ మిర్రా ఆండ్రీవా, ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్ మాడిసన్ కీస్‌ను అధిగమించి ఆరో స్థానంలో నిలిచింది. ఇక భారత్ ప్లేయర్లకు సంబంధించి టాప్ 100లో ఎవరికీ స్థానం దొరకలేదు. ప్రార్థన తోంబరే నాలుగు స్థానాలు ఎగబాకి 148వ ర్యాంక్‌కు, అంకితా రైనా ఒక స్థానం ఎగబాకి 208వ ర్యాంక్, రుతుజా భోసలే 20 పాయింట్లు పడిపోయి 242వ స్థానానికి, ఆరు స్థానాలు పైకి ఎగబాకిన రియా భాటియా 258వ ర్యాంక్, భమిడిపాటి శ్రీవల్లి 282వ ర్యాంకుకు, ఏడు స్థానాలు ఎగబాకి 316వ ర్యాంక్‌తో యమలపల్లి సహజ, ఆరు స్థానాలు ఎగబాకిన వైదేహీ 355వ ర్యాంక్ లభించింది.

# హైదరాబాద్ విక్టరీతో ప్లే ఆఫ్స్ నుండి లక్నో ఔట్
### గుజరాత్,బెంగళూరు, పంజాబ్ కన్ఫర్మ్.. నాలుగో ప్లేస్‌కు ముంబయి, ఢిల్లీ మధ్య నేడు కీలక పోరు







**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025, సీజన్ 18 ప్లేఆఫ్‌లకు సంబంధించిన లెక్కలు ముగింపు దశకు వస్తున్నాయి. ప్రస్తుతానికి గుజరాత్, బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు మాత్రమే ప్లే ఆఫ్స్‌లో ఎంట్రీ ఇచ్చాయి. ఇక నాలుగో జట్టు గురించి మాత్రం మరో రోజు ఆగాల్సిందే. ఇందు కోసం రెండు జట్లు పోటీపడనున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓడిపోవడం ద్వారా, లక్నో సూపర్ జెయింట్స్ ప్లేఆఫ్స్ రేస్‌కు చేరుకునే ఆశలకు కూడా తెరపడింది. ఇక ఇప్పుడు ప్లేఆఫ్స్‌లో మిగిలిన స్థానం కోసం రెండు జట్లు ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ రేసులో మిగిలి ఉన్నాయి. ముంబై, ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్ సమీకరణాన్ని చూస్తే పాయింట్ల పట్టికలో రెండు జట్ల స్థానాలు కీలకం కానున్నాయి. ముంబై ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాల్గవ స్థానంలో ఉంది. 12 మ్యాచ్‌ల తర్వాత ముంబై ఖాతాలో 14 పాయింట్లు ఉన్నాయి. ఢిల్లీ 12 మ్యాచ్‌లలో 13 పాయింట్లు సాధించి పట్టికలో 5వ స్థానంలో ఉంది. అంటే, గ్రూప్ దశలో రెండు జట్లకు చెరొక మ్యాచ్ మిగిలి ఉంది. దీంతో ఈ ఇరుజట్లలో ఒకరు ప్లేఆఫ్స్‌కు చేరుకోనున్నారు. ఇందుకు ఈ నెల 21 కీలకమైంది. ఈ రోజున ముంబై వర్సెస్ ఢిల్లీ ముఖాముఖిగా తలపడ్డాయి. అంటే, ఒకరి జట్టు గెలిస్తే, వారిలో ఒకరి ఓటమి ఖాయం. రెండు జట్లకు ఓడిపోవడం అంటే, ప్లే ఆఫ్స్ నుంచి బయటడడమే అని తెలుసు. ఈసారి రెండు జట్లు వాంఖడేలో ఒకదానికొకటి తలపడుతున్నాయి. కాబట్టి, ఇది ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రతీకార మ్యాచ్ అవుతుంది. ఎందుకంటే గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ తమ సొంత మైదానంలో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. ఢిల్లీ ప్రతీకారం తీర్చుకుంటే, ముంబై ఇండియన్స్ పురోగతి కథ ఇక్కడ ఆగిపోతుంది. ప్లేఆఫ్ సమీకరణం ప్రకారం ఢిల్లీ అయినా ముంబై అయినా, రెండూ తమ మిగిలిన రెండు మ్యాచ్‌లను గెలవాలి. ఇటువంటి పరిస్థితిలో, ఈ నె 21న ఈ ఇద్దరి మధ్య ఘర్షణ మరింత ముఖ్యమైనది అవుతుంది. ఒకరితో ఒకరు తలపడిన తర్వాత, రెండు జట్లు చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడవలసి ఉంటుంది. ఈ సీజన్‌లో ముంబై, ఢిల్లీ జట్లు తొలిసారి పంజాబ్ కింగ్స్ సవాలును ఎదుర్కోవడం ఇదే తొలిసారి. ముంబై, ఢిల్లీ రెండూ జైపూర్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడవలసి ఉంది. జైపూర్‌లోని సవాయ్ మాన్సింగ్ స్టేడియం రికార్డు ఢిల్లీకి అనుకూలంగా ఉంది. ముంబై కంటే ఇక్కడ ఎక్కువ మ్యాచ్‌లు ఆడడమే కాకుండా, ఎక్కువ విజయాలు కూడా సాధించింది. మునుపటి గణాంకాల ప్రకారం ప్రతిదీ అలాగే ఉంటే, ప్లేఆఫ్ రేసులో ముంబై ఇండియన్స్ ఢిల్లీ క్యాపిటల్స్ కంటే ముందుండటం కష్టమే అనిపిస్తుంది.

# టి 20లో యుఎఇ రికార్డు విజయం
### 2 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ ఓటమి

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో పసికూన అయిన యూఏఈ రికార్డు విజయం సాధించింది. తమ చరిత్రలో తొలిసారి బంగ్లాదేశ్‌పై విజయం నమోదు చేసింది. టీ20 మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో 2 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బాంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టనికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం బరిలోకి దిగిన యూఏఈ మరో బంతి మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ టాపార్డర్ బ్యాటర్లు తంజిద్ హసన్ (59), లిటన్ దాస్ (40), నజ్ముల్ హసన్ షాంటో (27), తౌహిద్ హృదోయ్ (45), జాకిర్ అలీ (6 బంతుల్లో 18) రాణించడంతో భారీ స్కోర్ చేసింది. యూఏఈ బౌలర్లలో జవాదుల్లా 3 వికెట్లు, సాఘిర్ ఖాన్ 2 వికెట్లు తీశారు. తదుపరి భారీ లక్ష్య ఛేదనకు దిగిన యూఏఈని కెప్టెన్ మహమ్మద్ వసీం (42 బంతుల్లో 82) అద్భుత ఇన్నింగ్స్ ఆడి గెలిపించాడు. వసీం ఔటయ్యే సరికి యూఏఈ లక్ష్యానికి ఇంకా దూరంలో ఉన్నా, వచ్చిన బ్యాటర్లు వచ్చినట్లు తలో సిక్సరో, బౌండరీనో బాది జట్టు గెలుపునకు దోహదపడ్డారు.



చివర్లో ధృవ్ పరాషార్ (11), హైదర్ అలీ (15 నాటౌట్) జాగ్రత్తగా ఆడి యూఏఈకి రికార్డు విజయాన్ని అందించారు. యూఏఈ 18.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. బంగ్లా బౌలర్లలో షోరీఫుల్, నహీద్ రాణా, రిషద్ హోసేన్ తలో రెండు వికెట్లు తీయగా, తన్వీన్ ఇస్లాం, తంజిమ్ హసన్ చెరో వికెట్ పడగొట్టారు. కాగా ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో యూఏఈ 1-1తో సమంగా నిలిచింది. ఈ సిరీస్ కోసం యూఏఈలో (షార్జా) పర్యటిస్తున్న బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో 27 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నిర్ణయాత్మక మైన మూడో టీ20 ఈ నెల 21న షార్జాలో జరుగనుంది.


# వాణిజ్యం

# భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 20:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, విదేశీ సంస్థాగత మదుపర్ల విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణ దీనికి తోడైంది. ఆరంభంలో లాభాల్లో కదలాడిన సూచీలు.. తర్వాత భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ 800పాయింట్లకు పైగా నష్టపోగా, నిఫ్టీ 24,700 దిగువకు చేరింది. నిఫ్టీ ఆటో సూచీ 2 శాతానికి పైగా నష్టపోగా, నిఫ్టీ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్‌ఎంసీజీ షేర్లు 1 శాతానికి పైగా నష్టపోయాయి. మిడ్‌క్యాప్ 100 సూచీ 1.62 శాతం, స్మాల్‌క్యాప్ సూచి 0.94 శాతం చొప్పున క్షీణించాయి. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3.50 లక్షలు కీణించి రూ.440.23 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,116.17 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 81,153.70 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 872.98 పాయింట్ల నష్టంతో 81,186.44 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 261.55 పాయింట్ల నష్టంతో 24,683.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.63గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఐటీసీ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. ఎటర్నల్, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అమెరికా ప్రభుత్వ అప్పులపై ఆందోళన నేపథ్యంలో యూఎస్ క్రెడిట్ రేటింగ్‌ను మూడీస్ డౌన్‌గ్రేడ్ చేసింది. దీంతో అక్కడి 30 ఏళ్ల బాండ్ రాబడులు 2023 నవంబర్ తర్వాత గరిష్ఠ స్థాయి అయిన 5.03 శాతానికి చేరాయి. బాండ్ రాబడులు పెరగడంతో భారత్ వంటి వర్ధమాన దేశాల మార్కెట్లకు లిక్విడిటీ తగ్గొచ్చన్న భయాలతో మన మార్కెట్లు పడ్డాయి. గత కొన్ని రోజులుగా కొనుగోళ్లవైపు మొగ్గుచూపిన విదేశీ సంస్థా గత ఇన్వెస్టర్లు మే 19న అమ్మకాలకు దిగారు. రూ.526 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత సైతం రూ.238 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. భారత్-పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం స్టాక్ మార్కెట్ సూచీలు దూసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో 4 శాతం మేర లాభపడ్డాయి. ఈ క్రమంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ వంటి లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. మళ్లీ కొవిడ్ కేసులు పెరుగుతుండడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది.



# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముమ్మరం



**న్యూఢిల్లీ, మే 20:** భారత్, అమెరికాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) మొదటి దశను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఇరు దేశాలు చర్చలను ముమ్మరంచేశాయి. ఈ మేరకు కేంద్ర వాణిజ్య,పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్‌తో సమావేశమయ్యారు. మొదటి దశ ఒప్పందాన్ని త్వరగా పూర్తి చేసే దిశగా తమ మధ్య ఫలప్రదమైన చర్చలు జరిగాయని ఎక్స్ వేదికగా తెలిపారు. మంత్రుల స్థాయి సమావేశాల అనంతరం రెండు దేశాల ప్రధాన సంధానకర్తల మధ్య చర్చలు ఈనెల 22 వరకు నిర్వహించను న్నారు. ఈ ఏడాది సెప్టెంబరు అక్టోబరు నాటికి తొలిదశ ఒప్పం దాన్ని ఖరారు చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఈచర్చల్లో ప్రధానంగా పరస్పర మార్కెట్ల వినియోగం.. స్థానికనిబంధనల అమలు, టారిఫ్ మినహా యింపులకు పరిమితులపై ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఈ ఒప్పందంలో భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు, దుస్తులు, ప్లాస్టిక్స్, రసాయనాలు,రొయ్యలు, నూనె గింజలు, రసాయనాలు, ద్రాక్ష, అరటిపండ్లు వంటివి ఉన్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్ (ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు), వైన్స్, పెట్రోకెమికల్ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపు కోరుతోంది. ఈఒప్పందం కోసం రెండు దేశాలు నిబంధనల్ని ఖరారుచేశాయి. ఇందులో సుంకాలు, వస్తువులు, సేవలు, సుంకేతర అడ్డంకులు,కస్టమ్స్ వంటి అంశాలు ఉన్నాయి. అమెరికా, భారత్‌పై విధించిన అదనపు 26 శాతం సుంకాలను జులై 9 వరకు తాత్కాలికంగా నిలిపివేసిన నేపథ్యంలో ఈ 90 రోజుల వ్యవధిని ఉపయోగించుకొని చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఇక 10 శాతం బేస్‌లైన్ సుంకం యథాతథంగా కొనసాగుతుంది. విస్తృతమైన వాణిజ్య లోటును తగ్గించేందుకు టారిఫ్ చర్యలు తీసుకున్నట్లు అమెరికా ఏప్రిల్ 2న ప్రకటించిన విషయం తెలిసిందే.

# నిస్సాన్ ప్లాంట్ల మూసివేత వార్తలపై కంపెనీ క్లారిటీ!

**న్యూఢిల్లీ, మే 20:** దేశంలోని కొన్ని తయారీ ప్లాంట్లను మూసివేస్తారని వస్తున్న వార్తలను నిస్సాన్ మోటార్ ఇండియా అధికారికంగా తోసిపుచ్చింది. తమ కార్యకలాపాలు, డీలర్లు, భాగస్వాములు, వినియోగదారులకు సేవ చేసేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొంది. ఇండియాలో తమ సర్వీసులపట్ల ఉన్నట్లు కంపెనీ ఇటీవల ఒక ప్రకటనలో తెలిపింది. నిస్సాన్ కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా మెక్సికోలో ఫ్రాంటియర్, నవరా పికప్స్ ఉత్పత్తి ఏకీకృతం చేస్తున్నట్లు ప్రకటించడంతో ఈ పుకార్లు వెలువడ్డాయి. అయితే ఈ మార్పుల వల్ల భారత తయారీ ప్లాంట్లు ప్రభావితం కావని నిస్సాన్ స్పష్టం చేసింది. భారత దేశంలో తమ వ్యాపార వ్యూహం బలంగాఉందని, ఏ కర్మాగారంలో కార్యకలాపాలను నిలిపి వేసే అధికారిక ప్రణాళికలు లేవని వాటాదారులకు హామీ ఇచ్చింది. మార్చి 2025లో రెనాల్ట్ గ్రూప్ రెనాల్ట్ నిస్సాన్ ఆటోమోటివ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 51శాతం వాటాను కొనుగోలు చేస్తుందని నిస్సాన్ ప్రకటించింది. ఈ చర్య రెనాల్ట్-నిస్సాన్ ప్రపంచ భాగస్వామ్యాన్ని కీలకం కానుందని కంపెనీ తెలిపింది. ఇది చెన్నై ఆధారిత ఉత్పత్తి రెనాల్ట్ పూర్తి నియంత్రణను తీసుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఇదిలా ఉండగా, నిస్సాన్ భారతదేశ వ్యాపారం పూర్తిగా పనిచేస్తుందని, కస్టమర్ నిమగ్నత, డీలర్‌షిప్ విస్తరణపై నిరంతరం దృష్టిపెడతామని కంపెనీ స్పష్టం చేసింది.




# బంగ్లాదేశ్‌లో స్టార్‌లింక్ పాగా

**వాషింగ్టన్, మే 20:** ఎలాన్‌మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ యాజమాన్యంలోని శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్ స్టార్ లింక్ బంగ్లాదేశ్‌లో అధికారికంగా సేవలు ప్రారంభించిట్లు ప్రకటించింది. ఇది దేశ డిజిటల్ కనెక్టివిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో గణనీయమైన పురోగతిని సూచిస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. సాంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్, నెట్‌వర్క్ సమస్యలతో పోరాడుతున్న మారుమూల, వెనుకబడిన ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్టార్ లింక్ విభిన్న యూజర్ అవసరాలను తీర్చడానికి బంగ్లాదేశ్‌లో వివిధ సబ్‌స్క్రిప్షన్ ప్యాకేజీలను ప్రవేశపెట్టింది. స్టార్ లింక్ రెసిడెన్స్ ప్లాన్‌లో భాగంగా నెలకు 6వేల టాకా ధర రూ.4,200తో ప్రామానిక గృహ వినియోగానికి ఇంటర్నెట్ అందిస్తున్నారు. రెసిడెన్సీ లైట్ ప్లాన్‌లో భాగం గా నెలకు 4,200 టాకా రూ.2,900 ధరతో నెట్ సేవలు అందిస్తున్నారు. వన్ టైమ్ సెటప్ ఫీజు కింద 47వేల టాకాలు రూ.32వేలు చెల్లించాల్సి ఉంటుంది. స్టార్ లింక్ డిష్, రౌటర్‌తో సహా పరికరాల ఖర్చులు ఇందులో కవర్ అవుతాయి.



# మహాదేవ్ బెట్టింగ్‌యాప్ కుంభకోణంపై 'ఇడి' దర్యాప్తు

**ముంబై, మే 20:** మహదేశ్ బెట్టింగ్‌యాప్ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఈజ్ మై ట్రిప్ సిఇఒ నిశాంత్ పిట్టిని విచారిస్తున్నట్లు తెలిపింది. అక్రమ బెట్టింగ్ కార్యకలాపాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో పిట్టి ప్రమేయం ఉందని ఇడి అనుమానిస్తోంది. ఈ వ్యవహారంతో స్టాక్ మానిప్యులేషన్, మనీలాండరింగ్‌పై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అసోసియేట్ ల్యాప్‌టాప్ నుంచి స్వాధీనం చేసుకున్న డిజిటల్ ఆధారాలు ద్వారా పిట్టిని అక్రమ బెట్టింగ్ ప్లాట్ ఫామ్ అయిన స్కై ఎక్ఛేంజ్‌కు ఏజెంట్‌గా గుర్తించినట్లు ఇడి వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా మహదేవ్ బెట్టింగ్‌యాప్ ఆపరేటర్లతో సంబంధం ఉన్న డొల్ల కంపెనీలకు ఈజ్ మై ట్రిప్ చెల్లింపులు చేసిందని దర్యాప్తు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ యేడాది ఏప్రిల్‌లో ఇడి పిట్టి నివాసంలో సోదాలు నిర్వహించి రూ.7 లక్షలు స్వాధీనం చేసుకుంది. స్టాక్ ధరలను తారు మారు చేయడం, చట్టవిరుద్ధమైన ఆర్థిక లావాదేవీలను సులభతరం చేయడం లక్ష్యంగా ఉన్న బిగ్ నెట్‌వర్క్‌లో భాగంగా ఈ లావాదేవీలు జరిగాయని అధికారులు భావిస్తున్నారు. నిషాంత్ పిట్టి ఈ ఆరోపణలను ఖండిస్తూ ఇడి సూచించిన వ్యక్తులు, కంపెనీల గురించి తనకు తెలియదని స్పష్టం చేశారు. 2017 నుంచి ఈజ్ మై ట్రిప్ ఏ సంస్థలకు చెల్లింపులు చేయలేదని, పారదర్శకత, చట్టబద్ధమైన కార్యకలాపాలకు తమ సంస్థ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. అధికారులకు పూర్తిగా సహకరిస్తున్నానని, అన్ని ఆర్థిక రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని తెలిపారు.




# ప్రొటీన్ ఈగవ్ షేర్లు భారీ పతనం

**ముంబై, మే 20:** ఇ-గవర్నెన్స్ సేవలు అందించే ప్రొటీన్ ఈగవ్ టెక్నాలజీ షేర్లు భారీగా పతనం అయ్యాయి. రెండు ట్రేడింగ్ సెషన్లలో ఈ స్టాక్ విలువ దాదాపు 30 శాతం మేర క్షీణించింది. సోమవారం ట్రేడింగ్ 20 శాతం మేర పతనం కాగా, మంగళవారంట్రేడింగ్ ఆరంభంలో 13 శాతం మేర నష్టాన్ని చవిచూసి తర్వాత కోలుకుంది. మధ్యాహ్నం 1.15 గంటల సమయానికి 8.76 శాతం నష్టంతో 1,043.00 వద్ద కొనసాగింది. కీలకమైన పాన్ 2.0 ప్రాజెక్టుకు ప్రొటీన్‌ఈగవ్ అర్హత సాధించకపోవడమే షేర్లు పతనానికి కారణం. పాన్‌కు కొనసాగింపుగా కేంద్ర ప్రభుత్వం పాన్ 2.0 ప్రాజెక్టును చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్, డెవలప్‌మెంట్, ఆపరేషన్స్, మెయింటెయినెన్స్ కోసం ఆదాయపు పన్ను శాఖ బిడ్డింగ్‌లు ఆహ్వానించగా, ప్రాజెక్టును చేజిక్కించుకోవడంలో ప్రొటీన్ ఈగవ్ విఫలమైంది. మేనేజ్డ్ సర్వీస్ ప్రొవైడర్‌గా వ్యవహరించేందుకు బిడ్డింగ్‌లో పాల్గొనగా తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేదంటూ ఐటీవిభాగం నుంచి తమకు కమ్యూనికేషన్ అందినట్లు ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో ప్రొటీన్‌ఈగవ్ తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న పాన్ ప్రక్రియపై పెద్దగా ప్రభావం ఉండబోదంటూ ఇన్వెస్టర్లకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేసింది. ఈ వ్యాఖ్యలేవీ మార్కెట్‌ను మెప్పించకపోవడంతో షేర్లు పతనం అవుతున్నాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.